ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
13-5-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 101 పేజీలు: 10+4 వెల: 6.50


టెస్టులకు విరాట్ కోహ్లి గుడ్‌బై ఆటలో

# ఉగ్రవాదుల్ని ఊడ్చేశాం


## వారు కలలో కూడా ఊహించని దెబ్బకొట్టాం

మన త్రివిధ దళాలు ఎప్పుడూ సర్వసన్నద్ధం
మహిళల సిందూర రక్షణకే 'ఆపరేషన్ సిందూర్'
పాక్ క్షిపణులు భారత్‌లోకి రాలేకపోయాయి
భారత్ సైన్యానికి, శాస్త్రవేత్తలకు నా సెల్యూట్

### జాతినుద్దేశించిన ప్రసంగంలో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, మే 12:** ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనివిధంగా భారత సైన్యం దెబ్బతీసిందని, భారత మహిళల నుదుట సింధూరాన్ని దూరంచేస్తే మూల్యం ఎలా ఉంటుందో కూడా వారికి తెలిసొచ్చేలా చేసామని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. భారత్ పాక్‌లమధ్య కాల్పుల విరమణ అనంతరం సోమవారం ఉదయం నుంచి విస్తృత స్థాయిలోరక్షణరంగ సమీక్షలు నిర్వహించిన ప్రధాని మోడీ రాత్రి జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆపరేషన్ సింధూర్ అనేది ఒక ఆపరేషన్ కంటే మన భారత మహిళల ఆవేదన అని ఆయన అన్నారు. ఉగ్రవాదాన్ని వీడకపోతే పాకిస్తాన్‌కు మనుగడ అనేదే ఉండదని, ఉగ్రవాదులు భవిష్యత్తులో దాడిచేస్తే ఆపరేషన్ సింధూర్‌కు రెట్టింపుస్థాయిలో జవాబిస్తామని హెచ్చ రించారు. ఉగ్ర వాదం ఏరూపంలో ఉన్నా తుదముట్టిస్తామన్నారు. అణ్వా యుధాలను బూచిగా చూపించి ఉగ్రకార్యకలాపాలకు పాల్పడ తామంటే సహించేదిలేదని, సమూలంగా పెకలించివేస్తా మన్నారు. భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే పాకిస్థాన్‌తో చర్చలుంటాయని ఆయన స్పష్టంచేసారు. పాకిస్థాన్‌తో చర్చలు అంటూ జరిగితే కేవలం ఉగ్రవాదంపైనే ఉంటాయని ప్రధానిమోడీ స్పష్టంచేసారు. గడచిన నాలుగురోజులుగా మన సైన్యం సామర్థ్యాన్ని మనంచూసామని, నిఘా వర్గాల సామర్థ్యం, శాస్త్ర సాంకేతిక సామర్థ్యాన్ని దేశం చూసిందని మనదేశ అసమాన వీరత్వం ప్రదర్శించిందని మోడీ ఈసందర్భంగా వారికి శెల్యూట్‌చేసారు. పహల్గాంలో ఉగ్రవాదులు మతం పేరు అడిగి మరీ కుటుంబ సభ్యులముందే, భర్తలను దారుణంగా కాల్చిచంపారని, వ్యక్తిగతంగా ఇది తనకెంతో బాధాకరం అనిపించిందని అన్నారు. చనిపోయిన ఉగ్రవాదులనుచూసి పాకిస్థాన్ అధికారులు కన్నీళ్లుపెట్టుకోవడం మనం చూసామని, దీన్నిబట్టిచూస్తే పాకిస్థాన్‌లో ఉగ్రస్థావరాలు, ఉగ్రవాదులకు పాకిస్తాన్ అధికారుల ప్రోత్సాహం, మద్దతు ఉందని అన్నారు. పాకిస్థాన్‌లోని బహావ ల్‌పూర్, మురిద్కే వంటి స్థావరాలు ఉగ్రవాద యూనివర్సిటీలుగా ఉన్నాయని, అమాయక యువతను ప్రలోభపెట్టి వారిని లొం గదీసుకుని ఈ కేంద్రాల్లోనే శిక్షణ ఇచ్చి వారిని భారత్‌పైకి ఉసి గొలుపుతున్నారని, అందుకే ఉగ్రవాద మూలాలను ధ్వంసం చేసా మని ప్రధాని మోడీ అన్నారు. కేవలం ఉగ్రవాదంపైనే అనుకుంటే పొరుగుదేశం మన స్కూళ్లు, మందిరాలు, మసీదులు, గురుద్వా రాలు, సామాన్యుల ఇళ్లపైనా దాడులు చేసిందని, ఇక సహించలేకనే మన శక్తిసామర్థ్యాలను చూపించామన్నారు. >>2



## జమ్ము సరిహద్దుల్లో రాత్రి కాల్పులు జరిపిన పాక్
### డ్రోన్లను కూల్చివేసిన భద్రతా దళాలు
### జలంధర్, ఫిరోజ్‌పూర్‌లో బ్లాకౌట్

# మళ్లీ ఉల్లంఘన


**న్యూఢిల్లీ, మే 12:** కాల్పుల విరమణ ఉల్లంఘనను పాకిస్థాన్ నిస్సిగ్గుగా ఉల్లంఘించింది. రెండుదేశాల డిజిఎంఒల చర్చల అనంతరం కూడా పాకిస్తాన్ ఈ నిర్వాకానికి పాల్పడింది. రెండురోజులపాటు తీవ్రస్థాయి దాడులు చవిచూసిన తర్వాతకూడా పాక్ తన వక్రబుద్ధిని మార్చుకోలేదు. జమ్ముకాశ్మీర్‌లోని వాస్తవాధీన రేఖవెంబడిసాంబ, కతువా జిల్లాల్లో డ్రోన్లను ప్రయోగించి దాడులకు పాల్పడిందని సైనిక వర్గాలు ధృవీకరించాయి. దీనితో సరిహద్దు రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తంచేసింది .పంజాబ్, రాజస్థాన్, జమ్ము, గుజరాత్ రాష్ట్రాల్లోని కీలక స్థావరాలున్న ప్రాంతాలను బ్లాకౌట్‌ప్రకటించింది. పంజాబ్‌లోని జలం ధర్, ఫిరోజ్‌పూర్లలో కూడా బ్లాకౌట్ అమలు చేసారు. మరోపక్క వాస్తవాధీనరేఖ వెంబడి పాక్ సైన్యం జరుపుతున్న దాడులను భారత్‌రక్షణ వ్యవస్థ తిప్పికొట్టింది. డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా ప్రధాని మోడీ ప్రసంగం తర్వాతనే పాకిస్థాన్ రెచ్చిపోయింది. డ్రోన్లను >>2



## భారత్, పాక్ అణుయుద్ధాన్ని నేనే ఆపా: ట్రంప్
2లో

# ఏజెన్సీలో ఉద్యోగాలు పూర్తిగా గిరిజనులకే

**విజయవాడ, మే 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో నూరు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పిం చేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 2000 ఏడాదిలో జీ.వో నెంబర్ 3 తెచ్చామని సిఎం చంద్రబాబు గుర్తు చేశారు. న్యాయ సమీక్షలో రద్దయిన జీవో నెంబర్ 3 పునరుద్ధరణకు తీసుకావల్సిన చర్య లపై అధికారులతో సమీక్ష చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు పాటిస్తూనే... 2020 లో రద్దయిన జీ.వో నెంబర్ 3 పునరుద్దరణకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. సోమవారం సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. ఈ రివ్యూలో గిరిజన సంక్షేమ శాఖ, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 1986లో వచ్చిన జీవో ప్రకారం ఏజెన్సీలో స్థానిక గిరి జనులకు టీచర్ పోస్టుల్లో 100 శాతం రిజర్వేషన్లు తెచ్చాం. దీనిపై న్యాయపరమైన చిక్కులు రావడంతో మళ్లీ పెరిగిన మహిళ రిజర్వేషన్ల శాతాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని 2000 సంవత్సరంలో జీవో ఎంఎస్ నంబర్ 3తెచ్చాం. దీన్ని అమలు చేయడం ద్వారా సుమారు 4,626 టీచర్ ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు దక్కాయి. అయితే జీవో నెంబర్ 3 పై 2002లో కొందరు కోర్టును ఆశ్రయించగా వివిధ స్థాయిల్లో విచారణ అనంతరం 2020లో ఈ ఉత్తర్వులను సుప్రీం కోర్టు రద్దుచేసింది. అయితే గత ప్రభుత్వం దీనిపై రివ్యూ పిటిషన్ వేయడంలో తీవ్ర అలసత్వం పాటించింది. దీంతో రివ్యూ పిటిషన్ ను కూడా సుప్రీం కోర్టు కొట్టేసింది. ఈ కారణంగా గిరిజనులు జీవో నెంబర్ 3 ద్వారా లభించే లబ్దిని కోల్పోయార్థు అని సిఎం అన్నారు.



### జీవో నం-3 పునరుద్ధరణకు చర్యలు
### సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటిస్తాం
### ప్రత్యేక పథకాలు కూడా అమలు చేస్తాం
### గిరిజన సంక్షేమశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

**చట్టపరమైన అడ్డంకులపై అధ్యయనం**

జీవో నెంబర్ 3 పునరుద్దణ లేదా అదే తరహా న్యాయం చేసేందుకు గిరిజనులకు ఎన్నికల సమ యంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు జీ.వో నెంబర్ 3 రద్దు అనంతర పరిణా మాలపై అధికారులతో సీఎం చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో జీవో 3 ద్వారా నాడు గిరిజనులకు కలిగిన లబ్దిని పునరుద్దరించేందుకు తీసుకో వాల్సిన చర్యలపై చర్చించారు. ఏజెన్సీలో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు నూరు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న అవకాశాల గురించి, చట్టపరంగా ఉన్న వివిధ అనుకూలతలు, అడ్డంకుల గురించి చర్చించారు. జీ.వో నెంబర్ 3పునరుద్దరిచేందుకు తీసుకో వా ల్సిన చర్యలపై గిరిజనుల, గిరిజన సంఘాల నుంచి అభిప్రాయాలు తీసు కోవాలని సిఎం అధికారులకు >>2

# ఎపి భవన్‌కు చేరిన 400 మంది విద్యార్థులు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** భారత సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఢిల్లీ లోని ఏపీ భవన్‌కు చేరుకున్న విద్యార్థుల సుమారు సంఖ్య 400కి చేరింది. జమ్మూకాశ్మీర్,పంజాబ్‌ల్లోని పలు విద్యాసంస్థల్లో చదువుకుంటున్న వీరంతా ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో స్వస్థలాలకు తిరుగుపయనమయ్యారు. ఢిల్లీ చేరుకున్న వీరికి ఏపీ భవన్ అధికారులు తాత్కాలిక వసతి,భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి 91 మంది విద్యార్థులు ఉండగా,ఆదివారం నాటికి ఆ సంఖ్య 350కి చేరింది. ఇక్కడి సిబ్బంది వారికి రైలు టికెట్ కన్ఫర్మేషన్ చేయించడంతో పాటు, ఎయిర్‌పోర్టు,రైల్వే స్టేషన్లకు వెళ్ళటానికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ సమయంలో దేశ >>2

# సైనికులతో సమానంగా నర్సులు సేవలందించాలి



### రాష్ట్ర వైద్య,ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** నర్సింగ్ వృత్తి చాలా పవిత్రమైంది, గౌరవనీయ మైందని,ఎంతో చిత్తశుద్ధితో నిర్వహించాలని ఏపీ వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.రోగులకు చిరునవ్వుతో సేవలందిం చాలన్నారు.వారిని అదే చిరునవ్వుతో ఆస్పత్రి నుంచి పంపించేలా మాట్లాడుతూ మొదటిసారిగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుల ప్రదానం చేపట్టామన్నారు..ఆంధ్రప్రదేశ్ నర్సెస్, మిడ్‌వైవ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగింది. ఈ కార్యక్ర మంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ నర్సుల సేవలు అనితర సాధ్యమైనవని, నర్సులు సం పదను సృష్టిస్తారని దానికి కారణం మనిషి ఆరో గ్యాన్ని సంరక్షించి వారి జీవిత కాలం పెరగ డట మేనన్నారు. సమస్యల పట్ల ఉదాసీనంగా ఉంటే ఫిర్యాదులు వస్తాయన్నారు. ప్రజలకు పటిష్టమైన వైద్యం అందించాల్సిన బాధ్యత మంత్రిగా నాపైన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పైన ఉందన్నారు. అందుకోసమే బడ్జెట్ లో వైద్య రంగానికి రూ.20 వేల కోట్లు కేటా యించారన్నారు. హక్కుల గురించి మాట్లాడుతు న్నపుడు బాధ్యతలను కూడా మర్చిపోకూడ దన్నారు. ప్రజలకు మేం జవాబుదారీ కాబట్టి బాధ్యతల నిర్వహణపై ప్రతి ఒక్కరినీ ప్రశ్నిస్తా మని, మానవతా దృక్పథంతో కూడా ఆలోచి స్తామన్నారు. నేను బాధ్యతల గురించి మాట్లాడితే నన్నే ప్రశ్నిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో పనిచేస్తుందన్నారు. మా స్థాయిలో మేము సమస్యలు పట్ల సానుకూలంగా ఉంటూ, క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నా, క్షేత్ర స్థాయికి వెళ్లటంలేదనే విమర్శలు చేస్తున్నార న్నారు. ఇవన్నీ వాస్తవాలు కాదని వారికి కూడా తెలుసునన్నారు. ఇటీవల ఒక ఉద్యోగి నన్ను బెదిరిస్తూ నాకు కామెంట్ పెట్టారని, అదే గత ప్రభుత్వం అయితే ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించేదన్నారు. నేను అలా చేయలేదని, కాని మేము అలాంటి వారికి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. ఇటీవల అనంతపురంలో బేబీ మిస్సింగ్ లో మీడియా లో వచ్చిన వార్తలు వల్ల నర్సు మీద చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని, నిజం తెలుసుకుని తర్వాత సరిచేసామన్నారు. ఏపీ లో నర్సింగ్ కౌన్సిల్ లో రాష్ట్ర విభజన తరువాత 1,20,000 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నా రన్నారు. గత ప్రభుత్వం చెప్పిన జీరో వేకెన్సీ పాలసీలో డొల్లతన మేం బయటపెట్టామన్నారు. రాబోయే రోజుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో 5,300 నర్సింగ్ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ప్రతీ సంవత్సరం 2,600 మంది ఇతర దేశాల్లో నర్సింగ్ ఉద్యోగాల కొరకు రిజిస్టర్ చేసుకుం టున్నారన్నారు. ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌తో ఎంఓయూ చేసుకుని 8 విదేశీ భాషలు వారికి నేర్పిస్తామన్నారు. దీనివల్ల మన వాళ్లు విదేశాల్లో కూడా నర్సుల ఉద్యోగాల ద్వారా సేవలు అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు. సరైన అర్హత లేని నర్సులు ఎక్కడా ఉండకూ డదని ఈ విధంగా వృత్తి నైపుణ్యంలో కూడా శిక్షణను అందిస్తామన్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నర్సింగ్ కాలేజీలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

# జూన్ 13 దాకా హైకోర్టుకు సెలవులు

**విజయవాడ,మే 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టుకు ఈ రోజు సోమవారం నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు ప్రకటిం చారు. తిరిగి జూన్ 16 నుంచి పూర్తిస్థాయి కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాను న్నాయి. ఈ నేపథ్యంలో అత్యవసర వ్యా జ్యాల విచారణకు వెకేషన్ కోర్టులు ఏర్పా టు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. మొదటి దశ వెకేషన్ కోర్టులు ఈ నెల 15, 22, 29వ తేదీల్లో విచారణలు చేపడ తాయి. ఇందులో భాగంగా మే 15, 22వ తేదీల్లో న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్ రెడ్డి, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా విచారణలు చేయను న్నారు. మే 29న జస్టిస్ ఎన్.హరి >>2

# తమిళ ప్రజలకు జనసేన తోడ్పాటు
### డి. సిఎం పవన్

**విజయవాడ, మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** అధికారం అంటే ప్రజాక్షేమాన్ని ఆలోచించే మార్గమని నేను నమ్ముతానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.అదే భావనతో జనసేన పార్టీని స్థాపించామ న్నారు. రాజకీయం బాధ్యత దీన్ని గుర్తించా మన్నారు.అందుకే ఓట్లు, సీట్ల లెక్కలు వేసుకోకుండా ప్రజలకు మేలుచేసే దారిలో ముందుకెళ్లామన్నారు. ప్రజలు దాన్ని అర్థం చేసుకుని ఆశీర్వదించారు. తమిళనాడు ప్రజలకు మేలుచేసే విషయాల్లో అవసరమైన తోడ్పాటు అందిస్తాం అని జనసేన అధ్య క్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాన్ పేర్కొన్నారు.మంగళగిరిలోని >>2

### హెలికాప్టర్‌పై దాడి కేసు
# మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డిని విచారణ చేసిన పోలీసులు


సోమవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి

### చెన్నేకొత్తపల్లి పిఎస్‌లో సాగిన విచారణ
### నేడు రానున్న పైలట్ అనిల్ కుమార్
### లింగమయ్య హత్య కేసులో పరిటాల శ్రీరామ్‌పై కేసు ఎందుకు పెట్టలేదన్న తోపుదుర్తి

**అనంతపురం, మే 12 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో గత నెల ఎనిమిదో తేదీన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనలో హెలికా ప్టర్‌పై దాడి జరిగిన కేసులో వైసీపీ నేత, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పోలీసుల విచారణకు హాజరయ్యారు. చెన్నే కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఉదయం 3 గంటల పాటు పోలీసుల విచారణకు హాజరయ్యారు. చెన్నేకొత్తపల్లి సిఐ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీస్ విచారణ జరిగింది. వైసీపీ కార్యకర్తలు, అభిమానులు దూసుకు రావడం వల్ల వైఎస్ జగన్ ప్రయా ణించిన హెలికాప్టర్ దెబ్బతిన్న విషయం హెలి కాప్టర్ దాడి కేసులో ఇప్పటికే హెలికాప్టర్‌కు సంబంధించిన సంస్థకు, పైలెట్, కో పైలెట్‌కు పోలీసులు నోటీ నోటీసులు జారీ చేయగా గతం లో హెలికాప్టర్ సంబంధించిన సంస్థ ఒక న్యా యవాది ద్వారా తన అభిప్రాయాన్ని తెలి యజేసింది. ఇదే సమయంలో కో పైలెట్ కూడా విచారణకు హాజరై పోలీసుల ప్రశ్నలకు సమా ధానం చెప్పారు. అయితే గతంలో పోలీసు విచారణకు హెలికాప్టర్ పైలెట్ అనిల్ కుమార్ హాజరు కాలేదు. మళ్లీ రెండోసారి పైలెట్ పోలీసులు నాటి నోటీసులు జారీ చేయగా మంగళవారం రోజు విచారణకు హాజరవుతున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో పైలెట్ విచారణ పూర్తయితే ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిని మరోసారి అవసరం అయితే పిలుస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సోమవారం రోజు చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి విచారణకు హాజరయ్యారు. పోలీసు విచారణ పూర్తయిన తర్వాత స్టేషన్ బయట మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మీడియాతో ఏమన్నారంటే హెలికాప్టర్ వద్ద జరిగిన సంఘటనలో నా ప్రమేయం ఏమీలేదు. నేను జనాన్ని అదుపు >>2

# వడదెబ్బకు నలుగురు మృతి
### రాష్ట్రమంతా అత్యధిక ఉష్ణోగ్రతలు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఎండలు దంచి కొట్టాయి. ఎన్టీఆర్,కృష్ణా,ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 43.1గా ఉన్నట్లు సమా చారం.ఎండ దెబ్బకు ఈ రోజు జనం అల్లాడారు. శీతల వాతావరణ సదుపాయాలు ఉన్న ఇండ్లలో సైతం జనం ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మధుమేహం,రక్తపోటు వంటి అనారోగ్య కారణాలు నలుగురు వ్యక్తులు ఎండ వేడిమి తట్టుకోలేక మృత్యువాత పడ్డారు.ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఒకరు.ఏలూరు జిల్లాలో ఒకరు గుంటూరులో ఇద్దరు వడదెబ్బకు మరణించారు. 70 మండలాల్లో వడగాడ్పులు వీసినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. 29 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 41 మం డలాల్లో వడగాడ్పులు వీచాయి. తీవ్ర గాడ్పులు వీచిన మండలాల్లో శ్రీకాకుళంలో 6, విజయనగరంలో 9, పార్వతీపురం మన్యం 19, కాకినాడ 3, తూర్పుగోదావరి 1 మండలాలు ఉన్నాయి. వడగాడ్పులు వీచే మండలాల్లో శ్రీకాకుళం 7, విజయనగరం 14, పార్వతీపురం మన్యం 4, అల్లూరి సీతారామరాజు 4, అనకాపల్లి 4, కాకినాడ 4, తూర్పుగోదావరి 1, కృష్ణాలో 3 మండలాలు ఉన్నాయి.

నిన్న ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల, శ్రీకాకుళం జిల్లా జగ్గిలి బొంతులో 42.2 డిగ్రీల చొప్పున, తిరుపతి జిల్లా ఓజిలి, అల్లూరి జిల్లా ఎర్రంపేటలో 41.8 డిగ్రీల చొప్పున, ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు, చిత్తూరు జిల్లా పిపల్లిలో 41.6 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. రాష్ట్రం మొత్తమ్మీద ఆదివారం 144 ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పలు చోట్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరుగా వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే రానున్న మూడు రోజుల పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిస్తే, మరోవైపు వేడి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

ఐఎండీ అంచనా ప్రకారం మే 12 నుంచి 15 వరకు ఉరుములు మెరుపులతో పాటు బలమైన గాలులు వీస్తాయి. ఇవి కొన్ని ప్రాంతాల్లో ఉపశమనం కలిగించేలా ఉంటే, మరికొన్ని చోట్ల ఆందోళనకరంగా ఉంటా యని ఐఎండీ పేర్కొంది. దేశరాజధాని దిల్లీలో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణం చల్లగా ఉండి తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది.



చీనాబ్ నదిపై రామ్‌బాన్‌లో నిర్మించిన బాగ్లిహార్ హైడ్రో ఎలక్ట్రిక్ విద్యుత్ కేంద్రం

# తమిళ ప్రజలకు జనసేన తోడ్పాటు

>> ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో తమిళనాడుకు చెందిన రచయిత పర్యావరణ ఉద్యమకారుడు కేఎస్ రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో తమిళ రచయిత పబ్లిషర్ మరవన్‌పులవు కె.సచ్చిదానందన్, ఎంజీఆర్ మనవడు సత్యరాజేంద్రన్, పలు ప్రజాసంఘాలు నాయకులు విద్యావంతులతో కూడిన బృందం శనివారం పవన్ కల్యాణ్‌తో సమావేశమైంది. తమిళనాడులోని వర్తమాన రాజకీయ పాలనాపరమైన పరిస్థితులు ఆ రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కార మార్గాలు సంస్కృతి ధర్మపరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు. తమిళనాడులోని సమస్యలు నా దృష్టిలో ఉన్నాయి. వాటి పరిష్కారానికి జనసేన తన వంతు తోడ్పాటు అందిస్తుంది. ప్రజలకు మేలు చేకూరాలంటే బలమైన నాయకత్వం ఉండాలి. అప్పుడే భద్రంగా ఉన్నామనే భావన ప్రజల్లో కలుగుతుంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా మనం ఎంతటి శక్తిసామర్థ్యాలతో ఉన్నామో ప్రపంచం గుర్తించింది. అందుకు దేశానికి బలమైన నాయకత్వం ఉండటమే కారణం. సమాజంలో ఐక్యత ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం అని స్పష్టం చేశారు. మాజీ సీఎంలు ఎంజీఆర్ జయలలితలు శాంతిభద్రతలతోపాటు భిన్నత్వంలో ఏకత్వం సామాజిక ఐక్యతకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆ స్ఫూర్తిని కొనసాగించాలి అని సూచించారు. ఎన్నో విశిష్టతల సమాహారం ద్రవిడ భూమి. ఏ రాష్ట్రంలో అయినా స్థిరమైన నాయకత్వం కావాలంటే ఎన్నికల్లో ఓట్ల చీలికను అరికట్టడం ముఖ్యం. దేశాభివృద్ధికి భవిష్యత్తు రాజకీయాల్లో బలమైన పొత్తు అవసరం ఉందని నమ్ముతా. దానివల్ల ప్రజలకు మేలు కలుగుతుంది అని వివరించారు.

# కాశ్మీర్‌లో మళ్లీ మోగనున్న బడిగంట

**న్యూఢిల్లీ, మే 12**: భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ అమలులోకి రావడం, సరిహద్దులోని పరిస్థితి సద్దుమణుగుతున్న నేపథ్యంలో కశ్మీర్‌లో మంగళవారం నుంచి మళ్లీ పాఠశాలలు తెరుచుకోనున్నాయి. సరిహద్దు జిల్లాలైన కుప్వారా, బారాముల్లా, బండిపోరలోని గురెజ్ సబ్‌డివిజన్ మినహా కశ్మీర్ అంతటా ఈ నెల 13 నుంచి స్కూళ్లు తెరుచుకుంటాయని కశ్మీర్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రకటించారు. భారత్-పాక్ మధ్య పరస్పర కాల్పుల నేపథ్యంలో ఇంతకుముందు ఈ బడులను ముందుజాగ్రత్త చర్యగా మూసేశారు. కాగా, పంజాబ్‌లోని సంగ్రూర్ సహా ఐదు సరిహద్దు జిల్లాల్లో సోమవారం కూడా బడులు మూసే ఉంచారు. తక్కిన ప్రాంతాల్లో మాత్రం విద్యాసంస్థలు తిరిగి తెరుచుకున్నాయి. పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పఠాన్‌కోట్, అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, గురుదాస్‌పూర్, తరన్‌తరన్ జిల్లాల్లో పాఠశాలలు మూసే ఉంచారు. పాకిస్థాన్‌తో పంజాబ్‌కు 553 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గత నెల 22న ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చిచంపడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఇందుకు ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను భారత బలగాలు ధ్వంసం చేయడం, 100 మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో యుద్ధపరిస్థితులు తలెత్తాయి. ఈ క్రమంలో ఇరుదేశాలు కాల్పుల విరమణకు ఈ నెల 10న అంగీకరించడంతో సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణుగుతున్నాయి.

# మద్యం కుంభకోణం నిందితులను కఠినంగా శిక్షించాలి: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ మే 12 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం ద్వారా ప్రపంచం విస్తుపోయేలా వైకాంగ్రెస్ పార్టీ నేతలు అవినీతికి పాల్పడ్డారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. ముఖ్యమంత్రే స్వయంగా డిస్టిలరీలు పెట్టడం, సొంత బ్రాండ్లు తయారు చేయించడం లాంటి విడ్డూరం ప్రపంచంలో ఎక్కడా చూడలేదన్నారు. మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సదస్సులో సత్యకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2014-19 మధ్య కాలంలో 49 వేల కిడ్నీ కేసులు నమోదైతే 2019-2024 మధ్య 91 వేలకు పెరిగాయన్నారు. కాలేయ సమస్యలకు సంబంధించిన కేసులు సైతం భారీగా పెరిగినట్లు సత్యకుమార్ తెలిపారు. న్యూరో సంబంధిత కేసులు 380 నుంచి 7800కి పెరిగినట్లు చెప్పారు. గత ప్రభుత్వ నేతలు నాణ్యతలేని మద్యం తయారు చేయించి లక్షల మంది ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇది క్షమించరాని నేరమని బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిన అవసరముందన్నారు.

# సరస్వతి పుష్కరాలకు సర్వం సిద్ధం

**హైదరాబాద్,మే 12,ప్రభాతవార్త :** నదులను దేవతలుగా భావించి, పూజించే సంస్కృతి మన దేశానిది మన జీవఅవసరాలను తీర్చే నదులకు కృతజ్ఞతలు తెలుపుకొనే సాంప్రదాయాన్ని పుష్కరాల రూపంలో పూర్వికులు నిర్దేశించారు. తదనుగుణంగా ఒక్కొక్క రాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు.. ఒక్కొక్క నదికి పుష్కరాలు జరుగుతాయి. పన్నెండు ప్రధాన నదులకు.. పన్నెండేళ్లకు ఒక్కసారి పుష్కరాలు వస్తాయి.ఆ పుష్కర నదుల్లో సరస్వతి ఒకటి. మిగిలిన నదుల్లా కాకుండా అంతర్వాహినిగా ప్రవహించడం ఈ నది యెక్క ప్రత్యేకత, రుగ్వేదం, పురాణాల్లో సరస్వతీ నది ప్రస్తావన ప్రముఖంగా ఉంది. పవిత్రమైన సప్తనదుల్లోనూ సరస్వతికి విశిష్టస్థానం ఉంది. అందుకే, స్నానం చేసినప్పుడు... గంగే చయమునే చైవ గోదావరీ సరస్వతీ నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు..... అంటూ ఈ నదులను తలచుకోవడం పుణ్యప్రదమని చెప్పారు పెద్దలు. బృహస్పతి మిధున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. ఈనెల 15 నుంచి 26 వరకూ పన్నెండు రోజుల పాటు సరస్వతీ నదికి పుష్కరాలు జరగబోతున్నాయి.

మానా... సరస్వతి నది జన్మస్థానం సరస్వతీ నది పుట్టిన చోటుగా పరిగణించే ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బద్రినాథ్ సమీపంలో ఉన్న మానా గ్రామం. అక్కడ కూడా పుష్కర స్నానాల కోసం ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సరస్వతీ నది అలకనంద నదికి ఉపనది కేశవ ప్రయాగ దగ్గర అలకనందలో కలుస్తుందంటారు. అలాగే సరస్వతీ నది అంతర్వాహినిగా....ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగలో, గుజరాత్‌లోని సోమనాథలోని త్రివేణీ సంగమాల్లో, రాజస్థాన్లోని పుష్కరలో కలుస్తుందనే విశ్వాసం ఉంది. ఆ ప్రాంతాల్లో కూడా పుష్కరాలను నిర్వహిస్తున్నారు.తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం. సరస్వతి నది పుష్కరాలకు సిద్ధమవుతోంది. గోదావరి, ప్రాణహిత నదులతో సరస్వతి కలిసే త్రివేణీ సంగమంలో పుష్కర స్నానాల కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాళేశ్వరంలో ప్రస్తుతం ఉన్న ఘాట్‌కు ప్రస్తుతం ఉన్న ఘాట్‌ను విస్తరిస్తూ సుమారు 86 మీటర్ల వెడల్పుతో నూతన ఘాట్‌ను నిర్మించారు. నూతన ఘాటపై 16 అడుగులు ఎత్తయిన సరస్వతి అమ్మవారి రాతి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నారు.పుష్కరాలు జరిగే 12 రోజులు నది హారతి నిర్వహిం చేందుకు హారతి ప్లాట్ ఫాంను ఏర్పాటు చేశారు.ప్రస్తుతం ఆ ఘాట్‌ను విఐపి ఘాట్‌గా పిలుస్తుండగా ఇక నుంచి సరస్వతి ఘాట్‌గా నామకరణం చేశారు.

# ఇడి విచారణకు మహేష్ బాబు గైర్హాజర్

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** టాలీవుడ్ హీరో మహేష్ బాబు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరు కాలేదు. సోమ వారం నాడు మహేష్ బాబు ఈడీ విచారణకు హాజరవుతారని వార్తలు వచ్చినా లండన్‌లో షూటింగ్‌లో వుండడంతో ఆయన రాలేదు. ప్రముఖ నిర్మాణ రంగ స ంస్థ సూర్య డెవలపర్స్‌తో పాటు సురానా సంస్థలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) గత నెలలో జరిపిన దాడుల తరువాత ఈ సంస్థ లకు ప్రమోటర్‌గా వున్న హీరో మహేష్ బాబుకు ఈడీ నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఈ రెండు సంస్థల ప్రాజెక్టులకు మహేష్ బాబు ప్రచారకర్తగా వ్యవ హరించారని ఈడీ గుర్తించడం విదితమే. ఇందుకుగానూ ఆయన 2.5 కోట్ల రూపాయల నగదు, 3.4 కోట్ల మేరకు చెక్ రూపంలో అందుకున్నట్లు ఈడీ నిర్ధారిం చి ఏప్రిల్ 28వ తేదీన హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మహేష్ బాబు ప్రచారం చేయడం తతవల్లే తాము ఈ సంస్థల్లో కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టి మోసపోయామని కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు సాయి సూర్య డెవ లపర్స్‌తో పాటు సురానా సంస్థలపై ఈడీ దాడులు చేబట్టింది. అయితే షూటింగ్‌ల కారణంగా మహేష్ బాబు ఏప్రిల్ 28వ తేదీ విచారణకు రాలేదు. సోమవా రం నాడు ఆయన కచ్చితంగా వస్తారని భావించినా లండన్‌లో వుండడం వల్ల రాలేదని తెలిసింది. అయితే దీనిపై ఈడీ అధికారులు ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. మహేష్ బాబుకు మరో తేదీన విచారణకు రావాలని ఆదేశించే వీలుంది.

# ఉగ్రవాదుల్ని ఊడ్చేశాం

>> ఉగ్రవాదం చర్చలు ఒకే మార్గంలో నడవలేవని, ఉగ్రవాదం వాణిజ్య ఒకే బాటలో ఉండవని, అలాగే నదీజలాలు రక్తపుటేరులు ఒకే తీరులో ఉండబోవని పొరుగుదేశం గుర్తుంచుకోవాలనిమోడీ హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోను ఉపేక్షించేదిలేదని, ఏరూపంలో ఉన్నా ఎక్కడ ఉన్నా అణిచివేస్తామని నిర్మూలించివేస్తామన్నారు. మన మేడిన్‌ఇండియా సాంకేతిక వ్యవస్థలతో రూపొందిన యుద్ధసామగ్రితోనే పొరుగుదేశానికి, ఉగ్రవాదులకు మన శక్తిసామర్థ్యాలను రుచిచూపించామన్నారు. రెండుదశాబ్దాలుగా పాకిస్తాన్‌లో విశృంఖలంగా ఉన్న ఉగ్రవాద తాండాలను ఒక్కదెబ్బతో తుడిచిపెట్టామని భారత్ వ్యతిరేకంగా కుట్రలుచేస్తున్న ఉగ్రతాండాలను తుదముట్టించామన్నారు. దీనితోభారత్‌అచేతనావస్థలోకి వెళ్లిందని, ఎటూపాలుపోని పాకిస్తాన్ మనదేశంలోని జనావాసాలు, పాఠశాలలపై దాడిచేసిందన్నారు. పాక్‌నుంచి ప్రయోగించిన మిసైళ్లు, డ్రోన్లను భారత క్షిపణి రక్షణ వ్యవస్థ సరిహద్దుల్లోకి రాకుండానే కూల్చివేసిందన్నారు.పాకిస్థాన్‌లోని కీలకమైన వైమానిక స్థావరాలకు తీవ్రనష్టం కలిగించామని దీనితోనే పాక్ బెంబేలెత్తిపోయిందన్నారు. పాక్ వైమానికస్థావరాలు, రాడార్ స్టేషన్లలో భారత మిసైళ్లు విధ్వంసం సృష్టించాయన్నారు. ఇప్పటికే మెరుపుదాడులు, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సింధూర్ ఉగ్రవాదంపై మన వైఖరిని స్పష్టంచేసామని, ఉగ్రవాదంపై భారత్‌షరతులమేరకే చర్చలు ఉంటాయని, భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలుసాగుతాయని ప్రధానిమోడీ స్పష్టంచేసారు. అణ్వాయుధాలను చూపించి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తామంటే భారత్ ఉపేక్షించదని, ఏరూపంలో ఎక్కడ నక్కినా భారత్ తుదముట్టిస్తుందని, అందుకు ఈమూడురోజులపాటుజరిగిన దాడులే నిదర్శనమని మోడీ అన్నారు. మరోసారి భారత త్రివిధ దళాల శక్తిసామర్థ్యాలకు ప్రధానిమోడీ సెల్యూట్‌చేస్తున్నానని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రపంచం మొత్తంచూసిందని, భారతశక్తిసామర్థ్యాలను తక్కువగా అంచనావేయవద్దని ఆయన సూచించారు. మేడిన్‌ఇండియా ఆయుధాలతోనే మా సత్తాచూపించామని మోడీ గుర్తుచేసారు. ఉగ్రవాదమౌలిక వనరులను నిలిపివేస్తే తప్ప పాకిస్తాన్‌కు మనుగడ లేదని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నంతసేపూ ఆదేశానికి అభివృద్ధి కష్టమేనని మోడీ స్పష్టంచేసారు. బుద్ధపూర్ణిమరోజని బుద్ధుడు మనకు శాంతిని ప్రబోదించాడని, అలాగే శాంతితోపాటు మన శక్తిసామర్థ్యాలనుచాటిచెప్పినపుడే శాంతిసామరస్యావాతావరణం నెలకొల్పగలుగుతామని మోడీ అన్నారు. ఇది యుద్ధాల యుగం కాదని, ఉగ్రవాదులయుగం కూడా కానేకాదని మోడీ చెపుతూ భవిష్యత్తులోకూడా భారత్ ఉగ్రవాదులు దాడులుచేయాలని ఆలోచిస్తే ఇంతకు రెట్టింపుస్థాయిలో జవాబిస్తుందని పాకిస్థాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు చేసారు.

## మళ్లీ ఉల్లంఘన

>> భారత్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలే టార్గెట్‌గా దాడులుచేసింది. హోషియార్‌పూర్‌లో సైరన్లు మోగించారు. సాంబా, ఆర్నియాలో డ్రోన్ల కదలికలను గుర్తించారు.

# భారత్, పాక్ అణుయుద్ధాన్ని నేనే ఆపా: ట్రంప్

**వాషింగ్టన్, మే 12:** భారత్ పాకిస్థాన్‌లమధ్య అణుయుద్ధాన్ని తానే ఆపానని, అణుయుద్ధంజరిగి ఉంటే లక్షలాదిమందిప్రాణాలు కోల్పోయేవారని అమెరికా అధ్యక్షుడుడొనాల్డ్‌ట్రంప్ పేర్కొన్నారు. అందుకే తాను అణుయుద్ధాన్ని ఆపేలా భారత్ పాక్‌లపై ఒత్తిడి తెచ్చానన్నారు. యుద్ధం కొనసాగిస్తామంటే మీతో వ్యాపారంచేయనని చెప్పానన్నారు. దీనితో రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని దాయాది దేశాలు కాల్పుల విరమణ క్రెడిట్ నాదే అని ట్రంప్ వ్యాఖ్యలుచేసారు. అంతేకాకుండా యుద్ధం విషయంలోప్రస్తుతం భారత్‌తో చర్చలుజరుపుతున్నట్లు ట్రంప్ చెప్పారు. త్వరలో పాక్‌తోకూడా మాట్లాడతానని వివరించారు. కాల్పుల విరమణపరంగా గతంలో ఎన్నడూ వాణిజ్య అంశాలనను ప్రస్తావించిన దాఖలాలు లేవని, తాను మాత్రమే వాణిజ్యం ప్రాతిపదికగా కాల్పుల విరమణకు ఒత్తిడితెచ్చానని ట్రంప్ అన్నారు.

# బుద్ధవనంలో వరల్డ్ 'మిస్'లు గట్టి భద్రత మధ్య విహారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే12:** తెలంగాణ రాజధాని హైద్రాబాద్ లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొంటున్న ఆసియా దేశాలకు చెందిన 22 మంది కంటెస్టెంట్స్ బృందం సోమవారం నల్గొండ జిల్లా బుద్ధ వనాన్ని సందర్శించింది.ప్రపంచ సుందరీమణులకు నల్గొండ జిల్లా యంత్రాంగం ఘనంగా ఆతిథ్యమిచ్చింది.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో విజయ విహార్ వద్ద వారికి ఘనంగా స్వాగతం పలికింది. ముందుగా సుందరీమణుల బృందం నాగార్జున సాగర్ తీరాన ఉన్న విజయ విహార్‌లో ఫోటోలు దిగారు.అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి బుద్ధుడి పాదాలకు పూలతో పూజలు చేసి మహా స్థూపంలో జ్యోతులు వెలిగించి ధ్యానంలో పాల్గొన్నారు. మహాస్థూపం వద్ద ప్రపంచ సుందరీమణులకు లంబాడా కళాకారులు లంబాడా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. బుద్ధవనం ప్రాముఖ్యత, బుద్ధుడి జననం నుండి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలు ఆర్కియాలజిస్ట్ శివనాగిరెడ్డి వివరించారు. అనంతరం జాతకవనంలో బుద్ధ చరితంపై కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఎస్పి శరత్ చంద్ర పవార్,ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్ రెడ్డి,బత్తుల లక్ష్మారెడ్డి,బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు మాట్లాడుతూ బుద్ధవనం,నాగార్జున సాగర్ ప్రాముఖ్యతను, తెలంగాణ గొప్పతనాన్ని వివరించారు.

# తెలంగాణలో నాలుగు రోజులు వర్షాలు

**హైదరాబాద్, మే 12, ప్రభాతవార్త:** ద్రోణి ప్రభావంతో తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. అలాగే రెండో రోజు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగులు వీస్తాయన్నారు.

# జూన్ 13 దాకా హైకోర్టుకు సెలవులు

>> నాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావు డివిజన్ బెంచ్‌గా జస్టిస్ చల్లా గుణరంజన్ సింగిల్ బెంచ్‌గా కేసులు విచారించనున్నారు. రెండోదశ వెకేషన్ కోర్టులు జూన్ 5, 12వ తేదీల్లో విచారణ చేపడతాయి. జూన్ 5, 12వ తేదీల్లో జస్టిస్ జస్టిస్ ఎం.కిరణ్మయి, జస్టిస్ టి.సి. డి.శేఖర్ డివిజన్ బెంచ్, జస్టిస్ కుంచం మహేశ్వరరావు సింగిల్ బెంచ్ నిర్వహిస్తారు.

# 16న జిల్లా కేంద్రాల్లో తిరంగా ర్యాలీ

## బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

**విజయవాడ,మే12,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ,భారత సైనికులు వెంటే జాతి యావత్తూ ఉందని తిరంగా ర్యాలీ లు నిర్వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, లోక్‌సభ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పిలుపునిచ్చారు. బిజెపి శ్రేణులతో ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ భారతీయుల మనోభావాలు కు సంబంధించిన విషయం, అదేవిధంగా స్వదేశీ ఆయుధాలు ఎంత శక్తివంతంగా పనిచేస్తుందో ప్రపంచానికి పరిచయం అయిందన్న విషయం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగంలో ప్రస్తావించిన విషయాలు వివరిస్తూ ఎన్ డి ఎ కూటమి నేతలను, స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానించి జిల్లా కేంద్రంలో 16వ తేదీన ర్యాలీ లు నిర్వహించాలన్నారు, అదేవిధంగా 18వ తేదీన మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించాలని పిలుపు ఇచ్చారు. భారత సైనికులకు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి మద్దతు తెలుపుతూ ర్యాలీలు నిర్వహించాలన్నారు.

# గెస్ట్ లెక్చరర్‌కు వేతనం పెంపు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో గెస్ట్ లెక్చరర్ లకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గంటకు ఇస్తున్న రూ.150 పారితోషికాన్ని రూ.375కు పెంచగా, నెలకు గరిష్టంగా రూ.27,000గా నిర్ణయించింది. తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని తాజాగా విడుదలైన జీఓలో ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని 475 జూనియర్ కాలేజీల్లో పని చేసే 1,177 మంది గెస్ట్ లెక్చరర్లు లబ్ధి పొందనున్నారు.



ఇటీవల జమ్ములో వీరమరణం పొందిన బిఎస్ఎఫ్ జవాన్ ఇంతియాజ్ భౌతిక కాయాన్ని సోమవారం అంత్యక్రియల కోసం పాట్నాకు తీసుకు వచ్చిన దృశ్యం

# పాక్‌తో 'హాట్'లైన్..

## కాల్పుల విరమణపై చర్చించిన ఉభయ డిజిఎంఒలు

**న్యూఢిల్లీ, మే 12:** భారత్‌పాకిస్థాన్ దేశాల డీజీఎంవోల చర్చలు ముగిశాయి. రెండు దేశాల డీజీఎంవోలు హాట్‌లైన్ ద్వారా చర్చలు జరిపారు. వాస్తవానికి ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం డీజీఎంవోలు ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకే చర్చలు జరగాల్సి ఉంది. కానీ అనివార్యంగా చర్చలను సాయంత్రం 5 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఇవాళ వేసారు. సాయంత్రం 5 గంటలకు మొదలైన డీజీఎంల చర్చలు సుమారు గంటలపాటు జరిగాయి. భారత డీజీఎంవో రాజీవ్ ఘాయ్, పాకిస్థాన్ డీజీఎంవో కాశీఫ్ చౌదరిలుఈ చర్చల్లో పాల్గొన్నారు. కాల్పుల విరమణకు ఇరుదేశాలు అంగీకారం తెలిపిన అనంతర పరిస్థితులు, కాల్పుల విరమణ విధివిధానాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.

హాట్‌లైన్‌లో ఇంకా ఏం చర్చించారనే వివరాలు సమగ్రంగా తెలియరాలేదు. చర్చల్లో ప్రధానంగా కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్తతల తగ్గింపు, పివోకే తదితర అంశాలపైనే చర్చలుజరిగాయనిసమాచారం. కాగా ఏప్రిల్ 22న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం సమీపంలోగల బైసరన్ లోయలో పర్యాటకులే లక్ష్యంగా కాల్పులకు తెగబడ్డారు. ఆ కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అందుకు ప్రతీకారంగా భారత్ పాక్‌లోని, పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరుతో సర్జికల్స్ స్ట్రైక్స్ చేసింది. అదే సమయంలో పాకిస్థాన్ సైన్యం అత్యుత్సాహంతో భారత్‌పై దాడులకు పాల్పడింది.

ఈ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. రెండు దేశాల మధ్య దాడులు, ప్రతి దాడులతో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ డీజీఎంవో భారత్‌కు కాల్పుల విరమణ ప్రతిపాదన చేశారు. అందుకు భారత్ కూడా అంగీకరించింది. సోమవారం మధ్యాహ్నం డీజీఎంవోలు చర్చలకు ప్లాన్ చేశారు. అయితే మధ్యాహ్నం జరగాల్సిన చర్చలు సాయంత్రానికి వాయిదాపడ్డాయి. సాయంత్రం ఇరుదేశాల డీజీఎంలోలు చర్చలు జరిపారు.

# మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డిని విచారణ చేసిన పోలీసులు

>> చేయడానికి ప్రయత్నించాను. పోలీసుల భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే నా పై కేసులు నమోదు చేశారు. వైసీపీ అధినేత జగన్‌కు భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారు. దీనిని మేము ప్రశ్నిస్తే మా పై కేసులు పెట్టారు అని ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. తమనేత వైఎస్ జగన్ పర్యటన కోసం రామగిరి మండలంలో హెలిప్యాడ్ ఏర్పాట్లు నేను పర్యవేక్షించలేదని, ఇందుకోసం పోలీసుల అనుమతిని కూడా నేను కోరలేదని ఆయన చెప్పారు. హెలికాప్టర్‌పై అభిమానులు చొచ్చుకు వచ్చే సమయంలో డీఎస్పీ దగ్గరున్నా మైకు తీసుకొని నేనే కంట్రోల్ కూడా చేశానని, అయితే నేనే రెచ్చగొట్టినట్టు పోలీసులు నాపై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. సికేపల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసుల విచారణలో మొత్తం 102 ప్రశ్నలు అడిగారు అని, అన్నింటికీ సమాధానం చెప్పాను అని ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చెప్పారు. మొత్తం మీడియా, పోలీసులు పాపిరెడ్డి పల్లెలో జరిగిన కురుబ లింగమయ్య హత్యను పక్కదారి పటిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చమీడియా ఈ కేసును సైడ్ ట్రాక్ చేస్తోందని, లింగమయ్య హత్య సంఘటనను, పక్కనపెట్టి హెలికాప్టర్ ఘటనని చూపిస్తోందని ఆయన ప్రశ్నించారు. మీడియానే అన్నీ డిసైడ్ చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. హెలికాప్టర్‌పై దాడి కేసులో హైకోర్టు 41ఎ నోటీసులు ఇచ్చి విచారించమని చెప్పింది అని, అయితే నన్ను అరెస్ట్ చేయమని, లాక్కురండి అని చెప్పారని మీడియాలో ప్రచారం చేశారని ఆయన ఆక్రోసం వెళ్ళగక్కారు.అసలు లింగమయ్య హత్య పరిటాల శ్రీరామ్ పై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు.లింగమయ్య హత్య జరిగిన తర్వాత శ్రీరామ్ విదేశాలకు పారిపోయాడని, చంద్రబాబు హయాంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉందా ఆయన ప్రశ్నించారు.

# పూర్తిగా గిరిజనులకే

>> సూచించారు. ఈ నేపథ్యంలో తిరిగి ఈ ఉత్తర్వుల ద్వారా లభించే లబ్దిని గిరిజ నులకు తిరిగి అందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఇందులో భాగంగా న్యాయ పరమైన అంశాలు, సుప్రీంకోర్టు తీర్పు, గిరిజన హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేయాలని సిఎం అన్నారు.

**ముఖ్యమంత్రి ముందు మూడు ఆప్షన్లు**

జీవో నెంబర్ 3 పునరుద్ధరణపై ప్రస్తుతం ఉన్న మూడు అవకాశాల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొదటి ఆప్షన్‌గా ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో 100 శాతం రిజర్వేషన్లు స్థానిక గిరిజనులకు కల్పించడం, రెండవ ఆప్షన్‌గా స్థానిక గిరిజనులకు వారి యెక్క జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం, మూడవ ఆప్షన్‌గా సుప్రీంకోర్టు సూచించినట్టు 50 శాతం మించకుండా స్థానిక గిరిజనులకే రిజర్వేషన్లు కల్పించి వారి హక్కులను పరిక్షించడం వంటి అవ కాశాలను అధికారులు సిఎం దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై సిఎం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో గిరిజనుల హక్కులకు కట్టుబడి ఉన్నామని ఎన్నికలసమయంలో చెప్పినట్లు జీ.వో నెంబర్ 3 పునరుద్దరించడం లేదా అదే స్థాయిలో గిరిజను లకు న్యాయం చేయడానికి కట్టుబడి ఉన్నాం. ఈ విషయంలో జాతీయ స్థాయిలో రాజ్యాంగ, న్యాయ నిపుణులతో కూడా సంప్రదిం పులు జరపాలి" అని సిఎం అన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు విద్యవైద్య సదుపా యాలు కల్పిస్తూ, ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని సీఎం అన్నారు. వారికి న్యాయం చేసేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని వదులుకునే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ఎపి భవన్‌కు చేరిన 400మంది విద్యార్థులు

>> సరిహద్దుల్లోని రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న ఏపీ వాసులు ఎలాంటి ఇబ్బందుల్లో ఉన్నా సాయం కోసం 011-23387089, మొబైల్ నెంబర్లు 9871999430, 9871999053లలో సంప్రదించవచ్చని ఏపీ భవన్ రెసిడెంట్ కమీషనర్ తెలిపారు. ఏదైనా అదనపు సమాచారం,సహాయం కావాలంటే ఏపీ భవన్ డిప్యూటీ కమీషనర్ ఎంవీఎస్ రామారావు 9871990081,లైజన్ ఆఫీసర్ వి.సురేష్‌బాబు 9818396787లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 13-05-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.పాడ్యమి రా.12.35
విశాఖ ఉ.9.08
వర్జ్యం మ.1.34-3.21
దు.ఉ.8.13-9.05, 2) రా.11.40-12.32
శుభసమయం : ఉ.7.30-8.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** బంధువులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**వృషభం :** ఉద్యోగాలలో స్వల్పమార్పులు వుంటాయి. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**మిథునం:** బాకీలు వసూలవుతాయి. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభం.

**కర్కాటకం:** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో అంచనాలు నిజం చేసుకుంటారు.

**సింహం:** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలలో పదోన్నతులు, హోదాలు పొందుతారు.

**కన్య :** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**తుల :** అనుకోని అవకాశాలు పొందుతారు. వాటిని సద్వినియోగం చేసుకోండి. ప్రయాణాలు లాభిస్తాయి.

**వృశ్చికం:** నిరుద్యోగుల యత్నాలు మందగిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**ధనుస్సు:** ఉద్యోగాలలో సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**మకరం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**కుంభం:** మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మీనం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కాలువల తవ్వకం పనులు మే నెలాఖరుకు పూర్తి చేయాలి

### - జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



ఇరిగేషన్ అధికారుల టెలీకాన్ఫరెన్స్ లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా కాలువల్లో పూడిక తీత, గుర్రపుడెక్క,తూటికాడ తొలగింపు,షట్టర్లు, గేట్ల మరమ్మత్తులు, గ్రీజు పెట్టడం వంటి నిర్వహణ పనుల కోసం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 344 కోట్ల రూపాయలు విడుదల చేశారని,ఈ పనులను స్వీయ పర్యవేక్షణ చేస్తూ, మే చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. సోమవారం విజయవాడలో జలవనరుల క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలు, ఎస్ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారాయన.ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, కడా కమీషనర్ రాంసుందర్ రెడ్డి, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వర రావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. గుర్రపుడెక్క, తూటికాడ వంటి వాటి తొలగింపుకోసం, మందుల పిచికారీకి డ్రోన్లు సైతం వినియోగించుకోవాలని సూచించారాయన. అవసరమైన చోట్ల 7 రోజుల వ్యవధితో షార్ట్ టెండర్లు పిలవడానికి అనుమతిచ్చిందని, నిర్వహణ మరియు మరమ్మత్తు పనులను చేపట్టడం యొక్క ప్రధాన లక్ష్యం, 2025 ఖరీఫ్ ప్రారంభానికి ముందు నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్థితికి తీసుకురావడం అని ఆయన అధికారులకు సూచించారు. గేట్లు, షట్టర్లు, వంటి మెకానికల్ పనులను తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజనీర్ పరిశీలించి, సక్రమంగా పనిచేసే స్థితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని, చీఫ్ ఇంజనీర్ కు ఇవ్వాలని ఆదేశించారు. సాగు నీటి సంఘాలు ఆధ్వర్యంలో, వారి పరిధిలోని పనులను, మే నెలాఖరుకు పూర్తిచేయాలి.ఇలా పనులను సకాలంలో పూర్తిచేయడానికి చీఫ్ ఇంజనీర్లు, సూపరిండెంట్ ఇంజనీర్లు నిరంతరంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని పనులూ, సీజన్ మొదలయ్యే నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రి నిమ్మల రామానాయుడు, గతంలో మాదిరిగా కాకుండా మే చివరి నాటికి, అన్ని అత్యవసర పనులు, నాణ్యత తో పూర్తి చేయాలన్నారు.




## పొరుగు దేశాల మధ్య సమస్యల పరిష్కారానికి యుద్ధమే కీలకం కాదు

### - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** పొరుగు దేశాల మధ్య సమస్యలను పరిష్కరించుకోవడాని యుద్ధమే కీలకం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యానించారు.మన దేశంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ఉన్మాదాల శిబిరాలపై ఆపరేషన్ సింధూరను సీపీఐ సమర్ధించిందన్నారు.అయితే యుద్ధంపై తమ పార్టీ లైన్ తమకుందన్నారు.అందుకే అనివార్యమైతే తప్ప యుద్ధం సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వద్దన్నారు.దీనిపై ఆయనను పాకిస్థాన్‌కు పంపించాలంటూ బీజేపీ సీనియర్ నేత ఎమ్మెల్సీ సోము వీర్రాజు మతిభ్రమించి విమర్శలు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఖండించారు.ట్రంప్ చెబితే ప్రస్తుతం భారత్ పాక్ యుద్ధం ఆగిందా? లేదా?, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, ప్రజల విచక్షణను గాలికి వదిలి ట్రంప్ చెప్పిన మాటలు విని యుద్ధం ఆపేయడం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి అమెరికా వెళ్లి గురువు ట్రంప్‌తో ఉంటే మంచిదని హితవు పలికారు.దేశం ఉనికి ప్రమాదం వస్తే వామపక్షాలు ప్రభుత్వానికి మద్దతుగా ఉంటామన్నారు.మన దేశ ప్రజలపై యుద్ధం ప్రభావం ఉండకూడదన్నారు.

## ఎపి-ఇఎపిసెట్ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

**విజయవాడ,మే 12,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ-ఈఏపీసెట్-2025కు సంబంధించిన హాల్‌టిక్కెట్లను ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇంజనీరింగ్ అగ్రికల్చర్,ఫార్మసీ విభాగాలకు కలిపి మొత్తం 3,61,299 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 19 నుండి ప్రారంభం కానున్నాయి. సందేహాలకు 0884-2359599,2342499 నంబర్లలలో సంప్రదించాలని అధికారులు సూచించారు.



## అమరావతి నిర్మాణపనులు పునఃప్రారంభం ఆనందం

### - మంత్రులు అచ్చెన్న, కొల్లురవీంద్ర

**తిరుమల,మే 12 ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అభివృద్ధి పనులు కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పునఃప్రారంభం కావడం ఆనందంగా ఉందని రాష్ట్రమంత్రులు కె. అచ్చెన్నాయుడు, కొల్లురవీంద్ర తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని మంత్రులు ఉద్ఘాటించారు. రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. ప్రతిష్ఠాత్మకమైన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులు అమలవుతున్నాయన్నారు. పోలవరం కూడా పూర్తిచేసేలా సిఎం చంద్రబాబుకు శక్తిని ఇవ్వాలని వేడుకున్నామన్నారు. సోమవారం ఉదయం తిరుమలేశుని ఆలయంలోనికి చేరుకున్న మంత్రులు విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# తిరుపతి ఐఐటికి మహర్దశ

## రూ.2300కోట్లు నిధులు మంజూరు

### అంతర్జాతీయ స్థాయికి తీర్చి దిద్దుతాం: డైరెక్టర్ ప్రొ.సత్యనారాయణ



తిరుపతి ఐఐటి దృశ్యం

**శ్రీకాళహస్తి,మే 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తిరుపతి ఐఐటికి మహర్ధశ వస్తుందని రాబోవు రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో ఐఐటిని తీర్చి దిద్దుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయనను ప్రభాతవార్త పలకరించినపుడు ఐఐటి రాబోవు 4 సంవత్సరాల్లో చేపట్టబోయే ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వివరించారు. రాబోవు నాలుగు సంవత్సరాలకు గాను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తిరుపతి ఐఐటికి రూ.2300కోట్లు నిధులు మంజూరు చేసినట్లు సమాచారం అందిందన్నారు. రాబోవు నాలుగుసంవత్సరాల్లో ఐఐటికి మహర్ధశ వస్తుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 2015లో మంజూరు చేసిన ఐఐటిల్లో తిరుపతి పేరుతో ఒక ఐఐటిని, అలాగే ఐసర్‌ను ఏర్పాటుకు మంజూరు చేసారన్నారు. ఐఐటిని 539 ఎకరాల్లో నిర్మాణానికి ప్రణాళికలు రచించి అమలు చేసామన్నారు. 2017నుంచి నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. సుమారు 4 సంవత్సరాల పాటు తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలతో అతిధిగా విద్యాసంవత్సరాలను గడిపామన్నారు.అలాగే హాస్టల్‌ను ప్రైవేటు భవనాల్లో గడిపామన్నారు. రెండేళ్ళ క్రితం ఏర్పేడు మండల కేంద్రంలో సొంత భవనాల్లోకి ప్రవేశించామన్నారు. 2017 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సర వరకు రూ.1100 కోట్లు వెచ్చించినట్లు ఓ ప్రశ్నకు సమాధానంగా డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. సకల సదుపాయాలతో సంపూర్ణ స్థాయిలో తిరుపతి ఐఐటి నిర్వహిస్తున్నామని వివరించారు. సొంత భవనాల్లోకి ప్రవేశించిన తరువాత ఎన్నో ఆవిష్కరణలు ఎన్నో ఒప్పందాలు జరిగాయన్నారు.అంతేకాక విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దుటకు ప్రయత్నిస్తున్నామని అయితే తన సిబ్బంది సహకారం ఎంత చెప్పినా తక్కువే అన్నారు.

# మాజీ ఎంపి దరూరు పుల్లయ్య గుండెపోటుతో కన్నుమూత

### - కాంగ్రెస్ నుండి రెండు సార్లు ఎంపిగా ఎన్నిక

**ఉరవకొండ, మే 12 ప్రభాతవార్త** అనంతపురం మాజీ పార్లమెంటు సభ్యులు, సాగునీటి రంగ నిపుణులు దరూరు పుల్లయ్య (86) గుండె పోటుతో సోమవారం మధ్యాన్నం కన్నుమూశారు. కంప్లి కొట్టాల గ్రామంలోగల తమ పంట పొలాలను చూడటానికి వెళ్లి అక్కడే గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. ఆయన స్వగ్రామం ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం. ఆయనకు భార్య దరూరు సత్యవతి, కుమారుడు దరూరు రమేష్ (ఛాయాపురం గ్రామం మాజీ సర్పంచ్), ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. చాలా కాలంగా ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. దరూరు పుల్లయ్య 1939 జూన్ 20న మద్రాసు ప్రెసిడెన్సీ లో జన్మించారు. చెన్నైలోని లయోలా కళాశాలలో చదువుకున్నారు. మద్రాసు న్యాయ కళాశాలలో న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన 1977, 1980లో రెండుసార్లు 6వ, 7వ లోక్‌సభకు అనంతపురం నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. 1994లో కాంగ్రెస్ పార్టీ తరపున ఉరవకొండ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ చేతిలో ఓడిపోయారు. కొన్ని సంవత్సరాల తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటూ ప్రత్యేక వర్గాన్ని నిర్వహించారు. సాగునీటి రంగంపై అపారమైన అనుభవం కల్గిన దరూరు పుల్లయ్య రాష్ట్రంలోని ప్రధానమైన జలాశయాలు,

ప్రాజెక్టులు వాటి పుట్టుపూర్వోత్తరాలపై అనేక అధ్యయనాలు చేశారు. కరువు పీడిత రాయలసీమ, ముఖ్యంగా అనంతపురం జిల్లాలో కరువును, వెనుకబాటు తనాన్ని రూపుమాపడానికి ప్రభుత్వాలకు ఎంతో విలువైన సలహాలు, సూచనలు చేసి అనేక ఉద్యమాల్లో సైతం పాల్గొని తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు.

హంద్రీనీవా సుజల స్రవంతి పథకంకు అమలుకు ఆయన కృషి చేశారు. జిల్లా అభివృద్ధి కోసం పార్టీలు పక్కనబెట్టి కమ్యూనిస్టు యోధులు వి.కె.ఆదినారాయణరెడ్డితో కలిసి పనిచేశారు. వి.కె మరణానంతరం వి.కె.ట్రస్టు ఏర్పాటు చేయడంతోపాటు ఆయన పేరుమీద వి.కె ట్రస్టు భవనం నిర్మాణానికి ఎంతో కృషి చేశారు. దాదాపు 15 సంవత్సరాలుగా ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా బళ్లారిలోనే నివశిస్తున్నారు.

## రాజకీయ కక్ష సాధింపులకు పోలీసులా? దిగజారిన శాంతిభద్రతలు : సజ్జల

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను నీరుగారుస్తూ, రాజకీయ కక్షసాధింపులకు వినియోగిస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలపై వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం అందుబాటులో ఉన్న పార్టీ నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాజకీయ కక్షసాధింపు చర్యలు, పోలీసులను వినియోగించుకుంటున్న తీరు, దిగజారిన శాంతిభద్రతలు, తాజాగా మాజీ మంత్రి విడదల రజిని పట్ల స్థానిక సీఐ అమానుషంగా వ్యవహరించిన వైనంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు రాష్ట్రంలో పోలీసులు పరిధి దాటి వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటూ, రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థనే నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ విధానాలపై ఉదాహరణలతో సహా సమావేశంలో ప్రస్తావించారు. తాజాగా మాజీ మంత్రి విడదల రజిని పట్ల పోలీస్ అధికారి వ్యవహరించిన తీరు రాష్ట్రంలో పోలీసుల ద్వారా ప్రభుత్వం చేయిస్తున్న దౌర్జన్యకాండకు నిదర్శనమని పలువురు నాయకులు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలు, పోలీస్ యంత్రాంగాన్ని తప్పుదోవలో నడిపిస్తున్న వైనంను ప్రజలు ముందు పెట్టేందుకు వైయస్ఆర్‌సీపీ ఒక కార్యాచరణను సిద్దం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి సర్కార్ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులను నొక్కేస్తోందని, ఎవరైనా ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తే పోలీసులను ప్రయోగించి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు సైతం కేసుల నమోదులో చట్టపరమైన నిబంధనలను పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం దారుణని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో పరిస్థితులు దిగజారి పోయాయని, డీజీపీకి ఫిర్యాదు చేసే అవకాశం కూడా ఇవ్వక పోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నిసార్లు డీజీపీ అపాయింట్‌మెంట్ కోరినా స్పందించ పోవడం దేనికి సంకేతమని నిలదీశారు. ఈ మొత్తం వ్యవహారంను వైయస్ఆర్‌సీపీ సీరియస్‌గా తీసుకుంటోందని, వ్యవస్థలను కాపాడేందుకు బాధ్యత గల ప్రతిపక్షంగా దీనిపై స్పందిస్తుందని అన్నారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున, జోగి రమేష్, విడదల రజిని, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహన్‌రావు, అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నాయకులు దేవినేని అవినాష్, వేమారెడ్డి, పోతిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల వివరాలు

**విజయవాడ,మే12.ప్రభాతవార్త ప్రతినిధి:** టైపురైటింగ్ మరియు షార్ట్ హ్యాండ్ పరీక్షల తేదీలను ప్రకటించినట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ బోర్డు కార్యదర్శి జి.వి.రామచంద్ర రావు, సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్ హ్యాండ్ పరీక్షను ఈ ఏడాది జూలై 12 మరియు 13వ తేదీలలో, టైప్ రైటింగ్ పరీక్షను, ఈ ఏడాది జూలై 19 మరియు 20 వ తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ను మే నెల చివరి వారంలో జారిచేయనున్నట్లు ఆయన చెప్పారు. పూర్తి వివరాలు మరియు పరీక్షలకు సంబంధించిన తాజా సమాచారం కొరకు అభ్యర్థులు రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ బోర్డు, మంగళగిరి, అధికారిక వెబ్ సైట్ ను సందర్శించాలని జి.వి.రామచంద్ర రావు కోరారు.

## పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్ టిక్కెట్లు రెడీ


**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల హాల్ టికెట్లు విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ హాల్ టికెట్లను సంబంధిత వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకో వచ్చని విద్యార్థులకు ప్రభుత్వం సూచించింది. విద్యార్థులు.. తమ వివరాలను ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపింది. అలాగే మన మిత్ర యాప్ ద్వారా వాట్సాప్‌లో సైతం ఈ హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని వివరించింది. రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఎవరైనా వీటి ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. విద్యార్థులు.. తమ వివరాలను ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపింది. అలాగే మన మిత్ర యాప్ ద్వారా వాట్సాప్‌లో సైతం ఈ హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని వివరించింది. రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఎవరైనా వీటి ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది.పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది.



## తిరుమల రెండో ఘాట్‌లో 'చిరుత'!

### - ద్విచక్రవాహనదారులు బెంబేలు

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి కాలంలో అటవీప్రాంతంలో నీరు,ఆహారం దొరకక దారితప్పిన చిరుతపులులు ఏకంగా ఘాట్‌రోడ్లపై, కాలినడక మార్గాల్లో భక్తులకు కనిపిస్తున్నాయి. అటవీప్రాంతం వదలి భక్తుల సంచారం ప్రాంతాల్లో వచ్చేస్తుండటంతో భయంతో వణికిపోతున్నారు. తాజాగా సోమవారం ఉదయం 9గంటల ప్రాంతంలో తిరుపతి నుండి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో వినాయకుడి గుడి సమీపంలో ఓ చిరుతపులి అడవిలోంచి ఘాట్‌రోడ్డు దాటడాన్ని ద్విచక్రవాహనదారులు గమనించారు. వెంటనే భయంతో విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. సాధారణంగా శేషాచలంఅటవీ ప్రాంతంలో ఆగస్ట్-సెప్టెంబర్ మాసాలు వన్యప్రాణుల సంతానోత్పత్తి జరుపుకునే అవకాశం ఉన్నందున తిరుమల ఘాట్‌రోడ్లలో చిరుతపులుల సంచారం ఉంటుంది. అయితే వేసవిలో వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక,ఆహారం దొరక్క జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి.



డిఆర్ఎంచే మ్యాన్ ఆఫ్ ది మంథ్ అవార్డును అందుకుంటున్న రైల్వే సిబ్బంది

## ప్రయాణికుల భద్రతే ప్రధానం

### 15మందికి మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులు

**గుంతకల్లు రైల్వే,మే 12,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవికాలంలో రైలు ప్రయాణికుల భద్రత, రక్షణలకై రైల్వే సిబ్బంది నిబద్ధత మరింత చిత్తశుద్ధిలతో పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. స్థానిక డిఆర్ఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన భద్రతా, సమయపాలన సమీక్ష సమావేశంలో అదనపు డిఆర్ఎం సుధాకర్, సీనియర్ డిఎస్‌ఓడి సూర్యనారాయణలతో కలిసి డివిజన్ పరిధిలో జరుగుతున్న రైల్వే పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతా నిమిత్తం అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో మార్గదర్శకాల మేరకు పనిచేయాలని సూచించారు.

# తిరుమల సమాచారం

## కల్తీనెయ్యి ఘటనపై ఛార్జిషీటు!

### - 15మంది నిందితులుగా పేర్కొన్న సిట్

**తిరుమల,మే 12 ప్రభాతవార్తప్రతినిధి:** హిందువులకు ఎంతో విశ్వాసమున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదం తయారీలో కల్తీనెయ్యి వినియోగించారనే సంచలన కేసులో సిబిఐ సిట్ అధికారులు ఛార్జిషీటు దాఖలుచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నెల్లూరు ఏసిబి కోర్టులో సిట్ దాఖలు చేసిన మొదటి ఛార్జిషీట్‌లో 15మందిని నిందితులుగా పేర్కొంది. ఇందులో ఆరుగురిని ఇప్పటికే సిట్ అరెస్టుచేసి, అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ చేపట్టి ఆధారాలు సేకరించింది. మిగిలిన వారిలో నెయ్యిసరఫరాకు



చెందిన సరఫరాదారులు, నిర్వాహకులు, ఉద్యోగులు ఉన్నారు. ఏఆర్‌డైయిరీ, బోలేబాబాడెయిరీ, వైష్ణవిడెయిరీల ఉద్యోగులను నిందితులుగా చేర్చిన విషయం తెలిసిందే. ఇద్దరు టిటిడి ఉద్యోగులును ఇప్పటికే అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచింది.20మందిని టిటిడి ఉద్యోగులను సాక్షులుగా పేర్కొంది. సిబిఐ సిట్ అధికారులు పూర్తిగా గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని పూర్వటిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొనుగోలుకమిటీ ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల వివరాలు సేకరించారు. కల్తీనెయ్యికి సూత్రధారులు,పాత్రధారులు ఎవరని తేల్చేపనిలో మూలాలు కదిలించనున్నారు. ఇప్పుడు నెయ్యిసరఫరాకు కీలకంగా అనుమతించడంలో పూర్వ టిటిడి బోర్డు పెద్దలు, ఓ ఉన్నతాధికారికి నోటీసులు ఇవ్వాలని ఆలోచనలో ఉన్నారనేది సమాచారం.

## నిండుపౌర్ణమిన వేడుకగా గరుడసేవ



**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** చల్లటివాతావరణంలో ఆకాశం ప్రశాంతంగా మబ్బులతో ఉన్న వేళ పౌర్ణమి ఘడియల్లో పున్నమివెలుగుల్లో సోమవారం రాత్రి శ్రీమలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు విశేషఅలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగింది. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అర్చకులు,ఆలయ పేష్కార్ రామకృష్ణ,భక్తులు పాల్గొన్నారు.

## స్వర్ణరథంపై పద్మావతి అమ్మవారు

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిలో తిరుచానూరు పద్మావతిఅమ్మవారికి వేడినుండి ఉపశమనం కల్పించడానికి జరుగుతున్న వసంతోత్సవాల్లో రెండవరోజు సోమవారం ఉదయం స్వర్ణరథంపై సిరులతల్లి ఊరేగారు. ఉదయం పద్మావతిదేవిని సుప్రభాతంతో మేల్కొలిపిన ఆలయ అర్చకులు నిత్యకైంకర్యాలు ముగించారు.

## రెండుటన్నుల పుష్పాల, పత్రాలతో కపిలేశ్వరునికి పుష్పయాగం

**తిరుమల,మే 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 2టన్నులు పత్రాలు, 2టన్నులు పుష్పాలతో శోభాయమానంగా పుష్పయాగ మహోత్సవం నిర్వహించారు. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, కనకాంబరాలు, జాజి,రోజా,తామర, మల్లి, వృక్షి, బిల్వపత్రం, తులసి, పన్నీరు ఆకులతో కపిలేశ్వరస్వామి, కామాక్షిఅమ్మవారి ఉత్సవమూర్తులకు పుష్పాలతో స్పృశించారు.

**EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LTD**
Corporate Office, P&T Colony, Seethammadhara, Visakhapatnam-530 013.

**Tender Notice**

Open tenders are invited through E-Procurement for the works of: Extension of addl. CMD of 1281 KVA with CL 1281 KW over the existing CMD of 990 KVA with CL 990 KW aggregating to a total CMD of 2271 KVA with Change in CL 2271 KW to HT SC No.RJY959, M/s. Airports Authority of India, Rajahmundry Airport, Madhurapudi (V), Korukonda (M), under HT Category-IIA(i) duly conversion of 11KV potential with 33KV Potential (Dedicated Feeder) in Korukonda Section of operation Division Rajamahendravaram Rural in East Godavari District in APEPDCL.(Partial Turnkey basis).
Bid No:CGM/O&CS/APEPDCL/VSP/5/2025-26
Further details can be viewed in www.apeprocurement.gov.in & www.apeasternpower.com
Contact Phone No:0891-2582207, 7382585503
Advt-26 Sd/- Chief General Manager/O&CS

**AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)**
(CIN Number : U93000AP2015SGC105535), Email : ccdmc.amaravati@gmail.com
54-15-1, Venkateswara Nagar, Ring Road, Vijayawada, NTR Dist, Andhra Pradesh-520008.

**Request for Proposal**

NIT No. 409/ADCL/IPO/2025 Dated: 12.05.2025

Request for Proposal (RFP) for Engagement of Project Management Consultant (PMC) for (i) Construction of Roads, Storm Water Drains, Water Supply Network, Sewerage Network, Utility Ducts for Power & ICT, Reuse Waterline, Pedestrian Tracks, Cycle Track, Avenue Plantation & Street Furniture in E16, N1, N2, N3A&3B, N5 Roads in Amaravati and (ii) Construction of Road, Storm water Drainage, and Utilities for (a) E15 Road Extension to Old National Highway Mangalagiri and (b) E13 Road Extension to National Highway-16; including DLP 2 years in Andhra Pradesh.

The RFP can be downloaded on AP e-procurement portal from 13.05.2025 to 04.06.2025 up to 15.30 Hrs. Due date for submission of Bid is 04.06.2025 up to 16.00 Hrs, Technical Bid opening is on 04.06.2025 @16.30 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in

Sd/- Chairperson and Managing Director, ADCL, Vijayawada

**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ - విశాఖపట్నం**
గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్, 31-31-21, సాయిబాబా వీధి, నారాయణ భవన్, దాబా గార్డెన్స్, విశాఖపట్నం - 530 020.

**ఓ.ఎ.నెం.87/2025**

డెట్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రక్రియ) రూల్స్, 1993 యొక్క సబ్-రూల్ (2ఎ)తో చదువబడే, చట్టం యొక్క సెక్షన్ 19 లోని సబ్ సెక్షన్ (4) ప్రకారం సమన్లు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (గణపవరం), ప్రాతినిధ్యం వహించువారు మేనేజర్ & అధీకృత సంతకందారు ... దరఖాస్తుదారు
మరియు
నందమూరి అంజనా దేవి మరియు వేరొకరు
టు,
1. శ్రీమతి నందమూరి అంజనా దేవి, భర్త : నందమూరి మురళీ నాగేంద్ర వెంకట సత్య వర ప్రసాద్, డి.నెం.12-4-44, నల్లం వారి వీధి, గుణుపూడి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా - 534201.
2. నందమూరి మురళీ నాగేంద్ర వెంకట సత్య వర ప్రసాద్, తండ్రి : శ్రీహరి ఉదయ భాస్కర మోహనరావు, డి.నెం.12-4-44, నల్లం వారి వీధి, గుణుపూడి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా - 534201. ... ప్రతివాదులు

**పేపరు ప్రచురణ ద్వారా ప్రతివాదులకు సమన్లు**

గౌరవనీయ ప్రిసీడింగ్ ఆఫీసర్ / రిజిస్ట్రార్ వారి సమక్షమున ఓ.ఎ.నెం.87/2025, తేది.28.05.2025న జాబితా (లిస్టెడ్) చేయటమైనది.
రుణం రూ.30,39,893.42 పై వసూలు కొరకు మీ పైన వేసిన దావా (ఓ.ఎ) ననుసరించి, చట్టం యొక్క 19(4) సెక్షన్ క్రింద సదరు దరఖాస్తు పైన గౌరవనీయ ట్రిబ్యునల్ సమన్లు / నోటీసు జారీ (దరఖాస్తు డాక్యుమెంట్లు కాపీలు వగైరాతో మా సమక్షమున అందచేయబడతాయి) చేయబడినది.
చట్టం యొక్క 19వ సెక్షన్ (4) వ సబ్-సెక్షన్ తదనుగుణంగా, మీరు, ప్రతివాదులు ఈ క్రింది అంశాలు గమనించవలెను:
1) సమన్లు జారీ చేసిన 30 రోజులలోగా కోరిన ఉపశమనం ఎందుకు మంజూరు చేయకూడదో కారణం చూపాలి.
2) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన ఎస్సెట్స్ లేదా ఆస్తులు కాకుండా ఇతర ఆస్తులు మరియు ఎస్సెట్స్ వివరాలను వెల్లడించాలి.
3) ఆస్తులు ఎటాచ్‌మెంట్ కొరకు దరఖాస్తు విచారణ మరియు డిస్పోజల్ పెండింగ్‌లో ఉన్నందున, సెక్యూర్డ్ ఎస్సెట్స్ లేదా అటువంటి ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన వాటితో లావాదేవీలు చేయుట లేదా విక్రయించుట నుండి మిమ్మల్ని నిరోధించడమైనది.
4) ఒరిజినల్ దరఖాస్తు వరుస సంఖ్య 3ఎ లో సూచించిన లేదా బహిరంగ పరచిన సెక్యూర్డ్‌గా ఇచ్చిన ఎస్సెట్స్ మరియు / లేదా ఇతర ఎస్సెట్స్ మరియు ఆస్తులు పైన మీరు సాధారణ వ్యాపారం మినహా, వాటిని ట్రిబ్యునల్ ముందస్తు అనుమతి లేకుండా విక్రయించుట, లీజు లేదా ఇతరత్రా లావాదేవీల ద్వారా మీరు బదిలీచేయ వీలులేదు.
5) సెక్యూర్డ్ ఆస్తులు లేదా ఇతర ఆస్తులు అమ్మకం ద్వారా వచ్చిన అదాయానికి మీరు బాధ్యత వహించాలి మరియు అట్టి విక్రయ ఆదాయాన్ని సదరు ఆస్తులు సెక్యూరిటీ ఇంటరెస్ట్ కలిగియున్న బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థలు నందు నిర్వహిస్తున్న ఖాతా నందు జమ చేయవలెను.
ఇందుకు సంబంధించి లిఖిత స్టేట్‌మెంట్‌ను దాని కాపీని దరఖాస్తుదారునికి దాఖలు చేస్తూ తేది.28.05.2025న ఉదయం 10.30 గంటలకు ప్రిసైడింగ్ ఆఫీసర్/ రిజిస్ట్రార్ సమక్షంనకు హాజరు కావలసినదిగా కూడా మీకు సూచించడమైనది అట్లు చేయనిచో దరఖాస్తు మీ పరోక్షమున విచారించబడుతుంది మరియు నిర్ణయించబడుతుంది.
(ఇది నా స్వహస్తాలతో మరియు ట్రిబ్యునల్ ముద్రికతో 05 మే, 2025న ఇవ్వడమైనది)
సం/- అధీకృత అధికారి వారి సంతకం
సమన్లు జారీ చేయు వారు

వార్త

ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఈ మూడింటితోనే చాలా మంది సామాన్యులు నాయకులైనారు.

-మహాత్మాగాంధీ

# దాయాదికి తీవ్ర హెచ్చరికలు!

భారత్‌పాక్ పరస్పర దాడుల తర్వాత ప్రధాని మోడీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగం ఉగ్రవాదులకు ఒక హెచ్చరిక చేసినట్లయింది. అదే క్రమంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఉగ్రస్థావరాలకు అన్ని హంగులు కల్పిస్తున్న దాయాదికి తీవ్ర స్థాయి హెచ్చరికలు కూడా చేసింది. పహల్గావ్ దాడి ప్రపంచాన్ని మొత్తం కుదిపేసిందని, మన మహిళల నుదుట సింధూరం దూరంచేస్తే మూల్యం ఏ స్థాయిలో ఉంటుందో కూడా చూపించామని చెపుతూనే మోడీ ఉగ్రవాదులకు, పాకిస్తాన్ పాలకులకు గట్టి హెచ్చరికలు పంపించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా కూడా మట్టిలో కలిపేస్తామని ముందు నుంచీ చెపుతున్న మోడీ పొరుగుదేశంతో చర్చలంటూ ఉంటే కేవలం ఉగ్రవాదం, ఉగ్రవాదుల దుశ్చర్యలపైనే ఉంటాయని, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను అప్పగించిన తర్వాతనే ఏ చర్చలయినా ఉంటాయని చెపుతూ వచ్చారు. సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా మోడీ ఇచ్చిన సందేశం ఉగ్రవాదంపై మరింత స్పష్టతనిచ్చింది. కేవలం ఒక్కరాత్రిలోనే భారత సత్తాను చూసిన పాకిస్తాన్ బెంబేలెత్తిపోయిందని, అగ్రరాజ్యాలను ఆశ్రయించి ప్రాధేయపడిందని ఇదంతా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంవల్లనే కాదా అన్న ప్రశ్నలు కురిపించారు. పాక్ స్వయంగా కాల్పుల విరమణకు వద్దామని ప్రాధేయపడితేనే అంగీకరించామన్న సంకేతాలు కూడా ఇచ్చారు. కాల్పుల విరమణ తర్వాత మరే ఇతర చిన్న సంఘటన జరిగినా కూడా కూకటివేళ్లతో ఇకపై పెకలించివేస్తామన్నారు. ఆపరేషన్ సింధూర్ అంటే ఒక పేరు కాదని, ఒక ప్రతిజ్ఞ అని అది ఎలా ఉంటుందో ఈ మూడు రోజుల దాడుల్లోనే తెలిసివచ్చేలా చేసామని, భవిష్యత్తులో దాడులుచేయాలంటే ఇకపై ఎలా ఉంటుందో పాక్ తెలుసుకోవాలన్న సంకేతాలు మోడీ ప్రసంగంలో కనిపించాయి. ఒక్కరాత్రిలోనే పాక్ గుండెలను ఎగిసి తన్నామని భయంతో, రక్షణ కోసం ప్రపంచదేశాలను ఆశ్రయించిందని కూడా గుర్తుచేసిన మోడీ ఉగ్రవాదంపై భారత్ విధివిధానాలు ఇక ఎంతమాత్రం మారబోవని తెగేసి చెప్పారు. ఇదే సంకేతాలు ఇతర ప్రపంచదేశాలకు కూడా పంపించారు. అటు చైనా అయినా ఇటు బంగ్లా దేశ్‌కు కూడా ఈ సంకేతాలు బలంగా వెళ్లాయనే చెప్పాలి. యుద్ధరంగంలో ప్రతిసారి ఓటమి చవిచూసినా పాకిస్తాన్‌కు బుద్ధిరాలేదు. ఇపుడు ఆపరేషన్ సింధూర్‌లో కూడా పలాయనం తప్పలేదు. అణ్వాయుధాలను బూచిగా చూపించి ఉగ్రవాదులను పంపిస్తామన్నా, దాడులు చేస్తామంటే ఎంతమాత్రం భారత్ ఉపేక్షించదని, భారత్ అందుకు సర్వసన్నద్ధంగా నిరంతరం ఉంటుందన్న హెచ్చరికలను మోడీ పంపించారు. ఉగ్రస్థావరాలను ధ్వంసంచేసి 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని, ఉగ్రవాదుల మృతదేహాలను చూసి పాక్ ఆర్మీ అధికారులు కన్నీళ్లు పెట్టుకున్నారంటే ఉగ్రవాదాన్ని ఆదేశం ఎంతమేర ప్రోత్సహిస్తున్నదో అవగతం అవుతోందని, ప్రపంచదేశాలు పాకిస్తాన్ వైఖరిని కూడా అర్థంచేసుకోవాలని మోడీ తన ప్రసంగంలో పిలుపునిచ్చినట్లయింది. వాస్తవానికి ఓ పక్క దాడులు జరుగుతున్నా మరోపక్క నిరంతరం డిజిఎంఒలు, త్రివిధ దళాల అధిపతులు, రక్షణమంత్రి, విదేశాంగ మంత్రులతోపాటు జాతీయభద్రతా సలహాదారులతో నిత్యం సమీక్షలు జరిపిన మోడీ ఎప్పటికప్పుడు దాడుల సమాచారాన్ని రప్పించుకున్నారు. యుద్ధతంత్రంలో అనుసరించాల్సిన వ్యూహాలు కూడా వారితో చర్చించారు. పాకిస్తాన్ వైపు నుంచి ఒక్కతూటా పేలితే మీరు క్షిపణిని పేల్చండంటూ త్రివిధ దళాలకు స్వేచ్ఛనిచ్చారు. భారత్ పాక్‌ల మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరళ్ల హాట్‌లైన్ చర్చలపరంగా అనుసరించాల్సిన వ్యూహాలను కూడా వారికి ఉద్బోధించారు. తర్వాత కూడా మోడీ అత్యున్నతస్థాయి సమీక్షలు నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణను కూడా సిద్ధంచేయాలని సూచించారు. మూడురోజుల పాటు పాకిస్తాన్‌పై జరిపిన దాడుల్లో కేవలం పౌరజీవనానికి అంతరాయంలేని విధంగా లక్ష్యాలను ధ్వంసం చేసిన విధానాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. అదే క్రమంలో సరిహద్దుల్లో కాల్పులకు తెగబడటం, 26 కీలక స్థావరాలను టార్గెట్ చేసుకుని ఉపక్రమించడం వంటి చర్యలతోపాటు భారత్‌లోని విద్యాసంస్థలు, మందిరాలు, మసీదులు గురుద్వారాలపైనా పాక్‌చేసిన దాడులను దృశ్యమాధ్యమంలో కూడా ప్రపంచానికి చేరవేసేలా వ్యూహాలు అమలుచేయడం వెనుక ప్రధాని ఆలోచనే ఉందని తెలుస్తోంది. భారత్‌పై ఇప్పటి వరకూ మూడు సార్లు యుద్ధాలుచేసిన పాకిస్థాన్ ఏ ఒక్క యుద్ధంలో కూడా గెలవలేదు సరికదా తోకముడిచింది. ఇపుడు ఆపరేషన్ సింధూర్‌లో కూడా అదేతీరులో వ్యవహరించింది. ఇకపై దాడులతీరును పరికిస్తే భారత్ తన స్వదేశీ తయారీ ఆయుధ సామగ్రిని వినియోగించ డం ద్వారా రక్షణరంగ వ్యవస్థలో కూడా భారత్ స్వయం సమృద్ధితో కొనసాగుతున్నదన్న సందేశంఇచ్చారు. డిఆర్డీవో రూపొందించిన ఆకాశ్ క్షిపణి అయినా ఇజ్రాయిల్ పరిజ్ఞానంతో భారత్‌లోనే తయారుచేసిన డ్రోన్లు అయినా మన రక్షణ రంగం ఇతర దేశాలకు తీసిపోదన్న భావనను కూడా కల్పించారు. ఈ క్రమంలో కాల్పుల విరమణ జరిగినప్పటికీ ఆపరేషన్ సింధూర్ ఇక్కడితో ఆగిపో లేదని చేసిన హెచ్చరికలు కూడా పాక్‌కు అనునిత్యం భయంతో వణికించేవేనని చెప్పవచ్చు. ఇకపై ఎలాంటి దాడులు జరిగినా యుద్ధచర్యలుగానే పరిగణిస్తామని, పర్యవసానాలు ఇలాగే ఉంటాయని, మోడీ తన ప్రసంగంద్వారా భారత్‌ను శాసించాలనిచూసే వారికి హెచ్చరికలు పంపించినట్లయింది.

జీవించడం వల్ల గొప్పగా ఏదీ గణనలోకి రాదు. కాని మన అల్పకాలపు జీవితంలో మనం ఏం చేశాం అన్నదే గణనలోకి వస్తుంది.



నెహ్రూ

ఒకరితో స్నేహం చేసేటప్పుడు నెమ్మదిగా ప్రారంభించాలి. స్నేహం కలిసిన తర్వాత మరెన్నడూ విడిచిపెట్టకూడదు.



సోక్రటీస్

# క్రమబద్ధీకరణలో నిరుద్యోగులకూ న్యాయం జరగాలి

*రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో నియామకాలపై వైస్ ఛాన్సలర్లతో సమీక్ష నిర్వహించారని, కాంట్రాక్టు ఉద్యోగుల్ని మినహాయించి మొత్తం 1588 పోస్టుల్లో కేవలం 402 సహాయ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు వార్తలువచ్చాయి. ఇదే జరిగితే ఏండ్ల తరబడి అధ్యాపక వృత్తిలో కొనసాగా లని ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు మరోసారి నిరాశే మిగులుతుంది. గతంలో ఆర్థికశాఖ చేత ఆమోదం పొందిన పోస్టులు కాకుండా చాలా మంది అధ్యాపకులు ఇటీవలి కాలంలో పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో మరొక సారి ఖాళీలను గుర్తించి పూర్తి స్థాయిలో యూనివ ర్సిటీ అధ్యాపకుల్ని భర్తీ చేసినపుడే బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించినట్లు అవుతుంది. యూజీసీ నుండి కూడా రావాల్సిన నిధులు సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి పారదర్శకంగా అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని తెలంగాణ నిరుద్యోగ యువత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది.*

**డాక్టర్. అశోక్ మంద**

తెలంగాణ ఉద్యమానికి ఆయువు పట్టుగా నిలిచిన యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీ జరిగి దాదాపు 14 ఏండ్లు గడిచింది. గత ప్రభుత్వం అధ్యాపకుల భర్తీ కోసం యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బిల్లు తెచ్చినా అది పలు కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీ కోసం జి.వో నం.21 తీసుకువచ్చింది. ఈ జీ.ఓ. నిబంధనల ప్రకారమే నియామకాలు జరుగుతాయి. జి.వోలో వంద మార్కులకు గాను డిగ్రీ, పీజీలకు కలిపి 20 మార్కులు కేటాయిస్తూ, పీహెచ్‌డికి కేవలం పది మార్కులే కేటాయించడం, వివిధ సబ్జెక్టుల్లో జాతీయ స్థాయిలో నెట్ ఉత్తీర్ణతకు, రాష్ట్ర స్థాయిలో సెట్ ఉత్తీర్ణతకు సమానంగా మార్కులు కేటాయించడం వల్ల ఉద్యోగార్థులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్(నెట్)లో ఉత్తీర్ణత సాధించడం, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్(సెట్)తో పోల్చితే కఠినంగా ఉంటుంది. ఇదిలా ఉంటే ఏండ్ల తరబడి అధ్యాపక పోస్టుల భర్తీ చేయకపోవడం వల్ల యూనివర్సిటీలతో పాటు వాటి అనుబంధ కళాశాలల్లో కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులతో విద్యార్థులకి బోధించడం అనివార్యమైంది. ఇప్పుడు వాళ్లు కూడా తమకు ఉద్యోగ భద్రత కావాలంటూ, రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన చేపడుతున్నారు. యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్, పార్ట్ టైం లేదా తాత్కాలిక అధ్యాపకుల క్రమబద్ధీకరణ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 16లో పేర్కొన్న సమాన అవకాశాల సూత్రాన్ని ఉల్లంఘిస్తుంది. ఈ ఆర్టికల్ ప్రకారం ప్రతి పౌరుడికీ ప్రభుత్వ ఉద్యోగాలకు సమాన హక్కు ఉండడమే కాకుండా నియామకాలు పారదర్శకంగా, పోటీ ఆధారంగా జరగాలి. కాంట్రాక్టు లేదా తాత్కాలిక అధ్యాపకులను నేరుగా క్రమబద్ధీకరిస్తే, యూజీసీ నిబంధనల ప్రకారం నెట్/సెట్, పిహెచ్‌డి వంటి అర్హతలు సాధించిన అభ్యర్థులకు అవకాశాలు తగ్గుతాయి. తెలంగాణలో వేలాది మంది అభ్యర్థులు జే.ఆర్ ఎఫ్, నెట్ ఉత్తీర్ణతతో పాటు పిహెచ్‌డి పూర్తి చేసి యూనివర్సిటీ అధ్యాపక ఉద్యోగాల కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. ఒక వేళ క్రమబద్ధీకరణద్వారా ఈ ఖాళీలు భర్తీ అయితే ఇక నిరుద్యోగులకు మిగిలేది ఏముంటుంది?. ఆయా సబ్జెక్టుల్లో విషయ పరిజ్ఞానం, నెట్/సెట్, పీహెచ్‌డి లేని వారిని క్రమబద్ధీకరిస్తే, అది విద్యా ప్రమాణాలను తగ్గించడమే కాకుండా, అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేసినట్లు అవుతుంది. దీనివల్ల యూనివర్సిటీలలో బోధనా నాణ్యత కూడా దెబ్బ తినే ప్రమాదం ఉంది. క్రమబద్ధీకరణకు వ్యతిరేకంగా గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు నిరుద్యోగ యువత పక్షాన నిలిచి వారికి అనుకూలంగా ఉన్నాయి. 2024 నవంబర్‌లో తెలంగాణ హైకోర్టు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జివో నం.16ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ జివో ద్వారా విద్యాశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. అయితే హైకోర్టు, ఈ ప్రక్రియ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16లకు విరుద్ధమని, సమాన అవకాశాలను హరిస్తుందని స్పష్టం చేసింది. ఈ తీర్పు యూనివర్సిటీ నియామకాలకు కూడా వర్తిస్తుంది. ఎందుకంటే యూనివర్సిటీలు కూడా ప్రభుత్వ నిధులతో నడుస్తాయి. నిమాయక ప్రక్రియ నియమ నిబంధనలు



రాజ్యాంగ మౌలిక సూత్రాలకు కట్టుబడి ఉండాలి. గతంలో సుప్రీంకోర్టు కూడా ఇలాంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు తప్పనిసరిగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా ఇతర ప్రభుత్వ నియామక సంస్థల ద్వారా పారదర్శకంగా జరగాలని ఉన్నత న్యాయస్థానాలు సూచించాయి. యూనివర్సిటీల విషయంలో, యూజీసీ నిబంధనల ప్రకారం నియామకాలు జరగాలని, ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగులకు ప్రత్యేక హక్కు ఉండదని కూడా కోర్టులు వివిధ సందర్భాల్లో స్పష్టం చేశాయి. ఆయా ఉద్యోగాలకు కావాల్సిన అర్హతలు, అభ్యర్థుల మధ్య పోటీ ఆధారంగా నియామకాలను చేపట్టాలని తెలిపాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవలే అధ్యాపకుల భర్తీ కోసం తీసుకువచ్చిన జి.వో 21లో కొన్ని మార్పులు చేయాలని ఉద్యోగార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. వారి సూచనలకు సానుకూలంగా స్పందించి యూజీసీ నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేస్తే వేలాది మంది అభ్యర్థులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. కాంట్రాక్టు లేదా తాత్కాలిక అధ్యాపకుల క్రమబద్ధీకరణ వల్ల పోరాడి సాధించుకున్న తెలంగాణ స్వరాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాల్ని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అంతేకాకుండా, క్రమబద్ధీకరణ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, రాజకీయ ఒత్తిళ్లు, నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తిని పెంచుతాయి. కొంతమంది పైరవీల ద్వారా కూడా గతంలో అర్హతలు లేకుండానే కాంట్రాక్టు ఉద్యోగులుగా చెలామణి అవుతున్నారనే వాదనలు కూడా ఉన్నాయి. వీటన్నిటి వల్ల నిరుద్యోగ యువత నుండి ప్రభుత్వం మీద వ్యతిరేకత వ్యక్తం అయ్యే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వ యూనివర్సిటీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలంటే, అత్యుత్తమ ప్రతిభావంతులైన అధ్యాపకుల్ని భర్తీ చేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకుల్లో కూడా చాలామంది ప్రతిభావంతులు, అన్ని అర్హతలు కలిగిన వాళ్లు కూడా ఉన్నారు. కానీ వీరి కన్నా ఎన్నో రెట్ల మంది అభ్యర్థులు అధ్యాపక వృత్తిలో కొనసాగటానికి కావాల్సిన అన్ని అర్హతలున్నా కూడా జీవనోపాధి లేకుండా నిరుద్యోగులుగా బయట మిగిలే ఉన్నారు. వారి పరిస్థితిఅగమ్య గోచరంగా మారింది. యూనివర్సిటీ స్థాయి బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచాలంటే పారదర్శకతతో కూడిన నియామక ప్రక్రియ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకుల సేవలను గౌరవిస్తూనే, నిరుద్యోగ యువతకు న్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషించాలి. ఉదాహరణకు, కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకులకు పోటీ పరీక్షల్లో వయో పరిమితి సడలింపుతోపాటు బోధనా అనుభవానికి గాను మార్కులు ఇవ్వడం ద్వారా వారికి అవకాశం కల్పించవచ్చు. ఈ మధ్యే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో నియామకాలపై వైస్ ఛాన్సలర్లతో సమీక్ష నిర్వహించారని, కాంట్రాక్టు ఉద్యోగుల్ని మినహాయించి మొత్తం 1588 పోస్టుల్లో కేవలం 402 సహాయ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు వార్తలువచ్చాయి. ఇదే జరిగితే ఏండ్ల తరబడి అధ్యాపక వృత్తిలో కొనసాగాలని ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు మరోసారి నిరాశే మిగులుతుంది. గతంలో ఆర్థికశాఖ చేత ఆమోదం పొందిన పోస్టులు కాకుండా చాలా మంది అధ్యాపకులు ఇటీవలి కాలంలో పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో మరొక సారి ఖాళీలను గుర్తించి పూర్తి స్థాయిలో యూనివర్సిటీ అధ్యాపకుల్ని భర్తీ చేసినపుడే బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించినట్లు అవుతుంది. యూజీసీ నుండి కూడా రావాల్సిన నిధులు సకాలంలో విడుదలయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి పారదర్శకంగా అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని తెలంగాణ నిరుద్యోగ యువత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది.

# శాంతి చర్చలు సఫలమయ్యేనా?

**కనుమ ఎల్లారెడ్డి**

దాదాపు మూడు సంవత్సరాలకు పైగా జరుగుతున్న రష్యా, ఉక్రెన్ యుద్ధంలో ఇరుదేశాలు నష్టపోయాయి. కాకపోతే ఉక్రెన్‌కు భారీ నష్టం సంభవించింది. యుద్ధ నిర్వహణలో రెండు దేశాల సైనిక వ్యవస్థ పలు సమస్యలు ఎదుర్కొన్నాయి. యుద్ధవీరుల లక్ష్యం కూడా శాంతిని కోరు కోవడమే. ఈ దిశలో టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ రెండు దేశాలను సమన్వయ పరచి చర్చలు ప్రారంభిస్తారు. ఈ చర్చలకు పుతిన్, జెలెన్ స్కి ఒప్పుకోవడం ముదావహం. ఈ గురువారం నుంచి ఇస్తాం బుల్‌లో చర్చలు మొదలవుతాయి. మేం మానవతా దృక్ప థంతో వ్యవహరిస్తున్నాం. అందుకే ఈస్టర్ డే, విక్టరీ డే సందర్భంగా కాల్పుల విరమణ పాటించి తమ పారదర్శకత నిరూపించుకున్నాం అని పుతిన్ వ్యాఖ్యణించారు. కాని దురదృష్టం ఉక్రెన్ వీటిని పెడ చెవిన పెట్టిందని పుతిన్ వాపోయారు. అయినా సమర్థవంతంగా ఉక్రెన్ దాడులను అడ్డుకున్నామని పుతిన్ చెప్పారు. ఇప్పుడు రష్యా ప్రకటించిన శాంతి చర్చలకు సిద్ధం అని జెలెన్‌స్కి వ్యాఖ్యానించడం అతనికి యుద్ధంపై గల నష్టం తెలిసి వచ్చినట్లుంది. యుద్ధం ద్వారా అశాంతే రగులుతుందని, అభివృద్ధి కుంటు పడుతుందని అటు జెలెన్ స్కికి ఇటు పుతిన్‌కు తెలియడం గమనార్హం. ఇరు దేశాలు పట్టు విడుపులకు, మాటల పంతాలకు పోక శాంతిని కాంక్షించాలి. రష్యా, ఉక్రెన్ యుద్ధం ముగింపుకు విశ్వం అంతా ఎదురుచూస్తోంది. దానికిమొదటి అడుగు కాల్పుల విరమణ. రెండు దేశాలు కాల్పుల విరమ ణకు చర్యలు తీసుకోవాలి. అందుకు ఉక్రెన్ అంగీకరించడం, సోమవారం నుంచి మొదలయ్యే ముప్పై రోజుల కాల్పుల విరమణకు రెండు దేశాలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఒక వేళ ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఉల్లం ఘిస్తే ఆంక్షలు విధిస్తాం అని బ్రిటన్ వెల్లడి చేయగా, పలు వురు ఐరోపా నాయకులు కూడా కాల్పుల విరమణే శాంతి ని ప్రొది చేస్తుందని వక్కాణించారు. ఇప్పుడు బంతి రెండు దేశాల మధ్య ఉంది. శాంతా, యుద్ధామా అనేది రష్యా, ఉక్రెన్ దేశాలు నిర్ధారించుకోవాలి. అంది వచ్చిన అవకాశాన్ని ఎవరు వదులుకోకూడదు. యుద్ధం ఆగాలని టర్కీ చేస్తున్న రాయబారం ఫలించాలని, ఇస్తాంబుల్‌లో శాంతి చర్చలు ఫలించాలని కొరుకుందాం. ఈ దిశలో రష్యా, ఉక్రెన్ దేశాలు కూడా శాంతికి ప్రాముఖ్యత ఇవ్వడం శుభ పరిణామం. మూడు ఏళ్లకు పైగా సాగుతున్న యుద్ధంలో ముఖ్యంగా పౌరులు, వారి బంధువులు నష్టపోయారు. రెండు దేశాలలో పసి పిల్లలు, గర్భిణీస్త్రీలు మరణించారు, వారు ఎదుర్కొన్న అవస్థలు వర్ణించలేం. యుద్ధం ఎప్పుడు ఆగునా అని ఎదురు చూస్తున్నారు. రెండు దేశాలకు పర్యాటకులు రాక పోవడంతో ఆదాయం కూడా గణనీయంగా తగ్గి పోయింది. యుద్ధ నష్టం పూడ్చుకోవటంతోనే సరిపోయింది. అనేక చారిత్రక కట్టడాలు, సుందర భవనాలు నేల మట్టం కావడం దురదృష్టం. ఈ విపత్కర పరిస్థితులు చూసే టర్కీ ముందుకు వచ్చి రెండు దేశాల అధ్యక్షులతో చర్చించి

# సోషల్ మీడియా వేదికగా అమరావతిపై మరో కుట్ర?

**అన్నవరపు బ్రహ్మయ్య**

అధికారం కోల్పోయినప్పటికీ వైఎస్ఆర్ నేతలు ప్రజలను భయపెట్టే విధంగా మాట్లాడుతూనే వున్నారు. అయినా ప్రధాన మంత్రి పర్యటన అనంతరం వైఎస్ఆర్‌సిపి నాయకుల వ్యాఖ్యాలను, మాటలను ప్రజలు అవాకులు చవాకులుగానే భావిస్తున్నారు. మరల ఏదో రకంగా అమరావతిపై, అధికార తెలుగుదేశం పార్టీపై సోషల్ మీడియా వేదికగా కుట్రపన్నుతున్నారు. ఉదాహరణకి విశాఖపట్నంలో ఉర్సా సంస్థకు ఎకరం 50నుంచి కోటి రూపాయల వంతున స్థలం కేటాయిస్తే 99 పైసలకే ఎకరం కేటాయించినట్టు అభూతకల్పనలు ప్రచారం చేశారు. ఒక మతప్రచారకుడు మద్యం మత్తులో రోడ్డు ప్రమాదంలో మరణిస్తే దానిని హత్యగా ప్రచారం చేస్తున్నారు. ముంబాయి నటి కాదంబరి జత్వాని కేసులో అరెస్టు అయినా పోలీసు ఉన్నతాధికారి అడ్డుపెట్టుకొని కులపరమైన విద్వేషాలు ప్రచారం చేసే పనిలో వున్నారు. నటి జత్వానిపై ఫిబ్రవరి 2వ తేదీన ఉదయం 6.30 గంటలకు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కేవలం అర గంటకే అంటే 7 గంటలకు పోలీసులు విమానంలో ముంబాయి బయలు దేరి వెళ్లారు. కేసు బుక్ చేసిన అరగంట ముంబాయి వెళ్లడం ఒక వింత అయితే, ఫిబ్రవరి 2వ తేదీన నమోదు చేసిన కేసు నిమిత్తం జనవరినెలలో విమాన టిక్కెట్లు బుక్ చేయడం మరో వింత. ఈఅంశాల గురించి వివరణ ఇవ్వ కుండా పిఎస్ఆర్ ఆంజనేయులు సత్యసంధుడు అంటూ అరెస్టును కులపరమైన విషయంగా ప్రచారం చేయడానికి సిద్ధం అయ్యారు. అమరావతి వరదలకు మునిగిపోయిందని, అమరావతి ప్రాంత భూములు నిర్మాణాలకు పనికి రావంటూ అవాకులు చవాకులు పేలుతున్నారు. తాజాగా తెలంగాణ నుంచి విడిపోయిన సమయంలో కూడా ఆంధ్ర లో నూతన రాజధాని ప్రాంతం నిర్ణయంకోసం ఏర్పాటు చేసిన కమిషన్ ఎంపిక చేసిన అయిదు ప్రాంతాలలో విజయవాడగుంటూరు ప్రాంతం కూడా వుంది. ప్రధాన మంత్రి మోడీ అమరావతి పనుల పునః ప్రారంభించిన అనంతరం రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ నేతల తీరు చూస్తుంటే మూడు రాజధానుల భ్రమనుంచి బయటకు వస్తున్నట్టు కనిపించడం లేదు. నాడు అధికారంలో వుండగా సజ్జల రామకృష్ణారెడ్డి నిర్వహించిన పాత్రను నేడు అంబటి రాంబాబు నిర్వహిస్తున్నారు. అమరావతి అభివృద్ధికి వైఎస్ ఆర్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తే నాడు ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశంపార్టీ అడ్డుపడింది అంటూ ప్రధాన మంత్రి పర్య టన అనంతరం అంబటి మాట్లాడిన తీరుతో ప్రజలు విస్తు పోతున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలో వున్న అయిదు సంవత్సరాలు చంద్రబాబు నిర్మించిన సచివాలయ భవనాల నుంచి పరిపాలన సాగించిన బొత్స సత్యనారాయణ, అంబటిరాంబాబు, గుడివాడ గుర్నాథం వంటి మంత్రులు అమరావతిలో భవనాలు ఎక్కడ వున్నాయి. అంతా స్మశానమే అని వ్యాఖ్యానించిన నేతలు, తాము అధికారంలో వుండగా అమరావతి అభివృద్ధికి కృషి చేశామనని చెప్పడం చూస్తుంటే నవ్విపోదురుగాక నాకేమి సిగ్గు అన్నట్టువుంది. రాష్ట్ర విభజన అనంతరం తొలివిడతలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు



నాయుడు ఆ సమయంలో ఎన్డీఎ కూటమిలో సభ్యునిగా లేకపోయినప్పటికీ దేశప్రధాన మంత్రిని గౌరవించాలనే మర్యాదతో మోడీతో అమరావతి పనులకు శంకుస్థాపన చేయించడమే కాకుండా ఆనాటి సభకు తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరును కూడా ఆహ్వానించారు. రెండో విడత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి అమరావతికి ద్రోహం చేస్తూ మూడు రాజధానుల ప్రతిపాదన ముందుకు తెచ్చా రు. అమరావతికి భూములిచ్చిన రైతులుచేసిన తిరుగులేని పోరాటం, న్యాయపరమైన అభ్యంతరాల నేపథ్యంలో జగన్మోహనరెడ్డి అమరావతి అభివృద్ధికి తట్టెడు మట్టికూడా వేయకపోగా ప్రారంభానికి సిద్ధంగావున్న అనేక భవనాలను పాడుపెట్టారు. మూడో విడత తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీలతో కూడిన ఎన్డీఎ కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమిలో భాగస్వామిగా వున్న బిజెపి కేంద్రంలో అధికారంలో వున్న నేపథ్యంలో అందిస్తున్న సహకారంతో రాజధాని అమరావతి మరల ఊపిరిపోసుకోవడం ప్రారంభమైంది. మే 2వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రూ.64,721 కోట్ల రూపాయల అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమ రావతికి అవుటర్ రింగ్ రోడ్, మెట్రో రైల్వే, అమరావతితో జాతీయ రోడ్డుల అనుసంధానం, అమరావతి నూతన రైల్వే లైను ఏర్పాటు వంటి అనేక అభివృద్ధిపనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అమరావతి అభివృద్ధికి ఇంత పెద్దమొత్తం నిధులను సమీకరించడంలో సహకరించిన ప్రధాన మంత్రి మోడీ చేత పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించడాన్ని కూడా రాజకీయం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నిజానికి రాజధాని అమరావతి (విజయవాడ, గుం టూరు)పై కుట్ర ఈనాటిది కాదని చెప్పవచ్చు. 1953లో మద్రాసు రాష్ట్రం నుంచి వేరుపడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన సమయంలో కూడా ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు ప్రకటన వెలువడిన తర్వాత సాంకేతిక అంశాలను నిర్ణయించడానికిభారత ప్రభుత్వం నాడు రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వున్న కె.ఎన్. వాంఛను నియమించింది. మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు తొలిగా రాజధానిగా విజయవాడనే నిర్ణయించారు. కాని, రాజధాని విజయవాడలో ఏర్పాటు చేయడం వల్ల ఒక సామాజిక వర్గం ప్రాబల్యం పెరిగి వారు ఆర్థికంగా స్థిరపడతారనే కారణంతో పాటు కమ్యూనిస్టులు బలపడతారనే ప్రచారంకూడా చేశారు. రాయలసీమకు చెందిన ఆనాటి నాయకులుకర్నూలులో రాజధాని ఏర్పాటు చేయాలని పట్టుపట్టారు. మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు ముందుగా నిర్ణయించినట్టుగా విజయవాడ కాకుండా కర్నూలులో ఏర్పాటు చేయడంలో వివిధ రాజకీయకారణాలతో పాటు సామాజికవర్గాల రాజకీయపోరు కూడా వుందనినాడు పలుపత్రికల్లో వార్తాకథనాలువచ్చాయి. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధానిగా అమరావతి ఎంపికకు అసెంబ్లీ సాక్షిగా మద్దతు పలికారు. రాజధాని పరిధిలోని ఉండవల్లిలో ఇల్లు నిర్మించు కున్నానంటూ ఎన్నికల వేళ జగన్మోహనరెడ్డి మోసపూరిత మాటలను నమ్మిప్రజలు అధికారం కట్టపెట్టారు. ఏరుదాటేవ రకు ఓడమల్లన్న ఏరుదాటిన తర్వాత బోడిమల్లన్న అన్న రీతిలో జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని ఒక రియల్ ఎస్టేట్అని లేనిపోని సాకులు చెబుతూ మూడురాజధానులు అంటూ మాటమార్చారు. అమరావతి కోసం ఉద్యమం నిర్వహించిన రైతులు, ప్రధానంగా మహిళలను అధికార బలంతో అణచివేయాలని చూశారు. చివరకు రాజధాని కోసం భూములు ఇచ్చిన ఎస్సిల రైతులపై ఎస్‌సి, ఎసిటి అట్రా సిటీకి పెట్టారు. చూసిన నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో సాధారణ, తటస్థ ప్రజలు ఆపార్టీ నేతల చేష్టలు, మాటలకు, భీతిచెందారు. ఆ కారణంగా చంద్రబాబు ఏమిస్తారు, ఏమిచేస్తారు అని కాకుండా రాజ ధాని నిలిస్తే

# ప్రజావాక్కు



## డ్రాగన్ విషపు చూపు

**కేవలం** ఇరవై అయిదు నిముషాలలో ఆపరేషన్ సింధూర్ తొమ్మిది ఉగ్రవాదుల ప్రదేశాలలో కాల్పులు జరిపి వంద మందిని చంపామని భారత్ ప్రకటించింది. చాలా సంతోషం. ఇంకా వందలకొద్ది మిగిలే ఉన్నారని అంటున్నారు. పాకిస్తాన్ తాను తలచుకుంటే ప్రపంచాన్నే నాశనం చేయగలమని అంటున్నది. మన ప్రధాని మోడిని ఒదలిబెట్టబోమని అని ఏవేవో కారు కూతలు కూస్తున్నది. వీటిని తేలిగ్గా తీసిపారవేయక నిత్యం అప్రమత్తతను కలిగివుండాలి. దొంగదెబ్బలు తీయడంలో ఘటికురాలీ ఉగ్రదేశం. ఎన్నో అనుభవాలను చవి చూసింది మన దేశం. అలాగే డేంజరస్ డ్రాగన్ విషపు చూపుల పట్ల కూడా అహర్నిశలుజాగ్రత్తలు పాటించాలి. మన పూర్వ ప్రధాని ఇందిరా గాంధి ఈ రెండు సరిహద్దు దేశాల కదలికల్ని ఎప్పటికప్పుడు ఓ కంటితో గమనిస్తూండాలనే వారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఐక్యత ముఖ్యం

**తాము** మాత్రమే దేశ సమస్యలను పరిష్కరించగల సమర్థులమని మరొకరికి అది చేతకాదని గొప్పలు చెప్పుకోవటం పార్టీలను, వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడం రాజకీయాలు మాట్లాడటం తప్పు. దేనికైనా సమయం, సందర్భం ఉంటుంది. దేశంపై ఉగ్రదాడి జరిగినప్పుడు పార్టీ నాయకులు సంయమనం పాటించాలి. అన్ని పార్టీల వారు ఉగ్రవాద సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేయాలి.

-మిథునం, హైదరాబాద్

## పథకాలతో ప్రయోజనాలు

**ఇటీవల** తెలంగాణ ప్రభుత్వము తెస్తున్న రెండు పథకాలలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇది భూమి లేని నిరుపేదల పాలిట వరం. ఎందుకంటే రాజ్యగంలో ప్రస్తావించిన అధికరణ 41 ద్వారా పౌరుల పనికి హక్కును కల్పిస్తూ మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా పౌరులను కనీస సమయం పనిలో కచ్చితంగా భాగస్వాములను చేస్తూ మీవెంట మేమున్నాం అనే భరోసాను కల్పిస్తుంది. మరొకవైపు వడ్డీలేని రుణాలను మహిళలకు పెద్దమొత్తంలో అందిస్తూ మహిళలలో నాయ కత్వ బాధ్యతను సమిష్టి తనాన్ని పెంచుతూ మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయాలి.

-భారత అవినాష్, జనగామ

## కులగణన

**తెలంగాణ** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ఎప్పటి నుంచో కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. దేశంలోని ప్రతిపక్ష పార్టీలు కూడా ఇదే కోరుతూవస్తున్నాయి. ఎంత మంది కోరినా కేంద్రంలో పనిచేస్తున్నదిబిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదు. కులగణన చేపట్టే ప్రయత్నాలు చేయలేదు. తమకసలు కులగణన చేపట్టే ఉద్దేశ్యమే లేనట్టు వ్యవహరించింది. అలాంటిది హఠాత్తుగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలనే నిర్ణయం ఎందుకు తీసుకుంది. పహల్గాం దాడి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికా? లేక బీహార్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికా? లేక మరైదానా కారణం ఉందా? అనే అనుమానాలు చాలా మందికి కలుగుతున్నాయి. ఈ నిర్ణయం ఎప్పుడో తీసుకుని ఉంటే ఎవరికి ఎలాంటి అనుమానాలు వచ్చేవి కావు.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## ప్రజలు అన్ని గమనిస్తున్నారు

**తెలంగాణలో** కె.సి.ఆర్, ఆంధ్రలో జగన్ పదవుల్లో ఉన్నంత కాలం ఇష్టానుసారంగా ప్రవర్తించారు. ప్రజలను నానా కష్టాలు పెట్టారు. అందుకే ప్రజలు వారిని చాపలా చుట్టి మూలన పడేశారు. మోడీని హెచ్చరించి వదిలేశారు. అధికారం శాశ్వతమనుకుంటు అహంకారం ప్రదర్శిస్తే వారికి పట్టిన గతే ప్రస్తుత పాలకులకీ పడుతుంది.

-ఎం.ఎస్.శర్మ, హైదరాబాద్

## సీనియర్లకు ఎక్కువ వేతనాలుండాలి

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రంలో విద్యా శాఖకు సంబంధించి మే జూన్ నెలల్లో స్కూల్స్ ప్రారంభమయ్యే నాటికి టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వడానికి, ట్రాన్స్ఫర్లు చెయ్యడానికి ప్రభుత్వం సమాయత్తమవుతుంది. ఈ నేపథ్యంలో ఎవరు ప్రాతినిధ్యం వారు చేస్తూ ఉన్నారు. ప్రమోషన్లు ఇప్పుడు ప్రాతిపదిక సీనియారిటీ అవ్వాలి కానీ గత కొన్ని దశాబ్దాలుగా అలా జరగడం లేదు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు, కుంటివారు గుడ్డివారు మొదలగు అంగవైకల్యం ఉన్నవారు, మనోవైకల్యం ఉన్నవారు, ఆటగాళ్ల పాటగాళ్ల అనేక రకాల చట్టాలను లోని లోపాలను అడ్డుగా పెట్టుకుని ప్రమోషన్లు పొందుతూ ఉన్నారు. తత్ఫలితంగా పాఠశాల పర్యవేక్షణ సమంగా జరగడం లేదు. ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభించినప్పుడు ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు డైరెక్ట్ రిక్రూట్మెంట్ వాళ్ళకి పోస్టింగ్ ఇవ్వరాదు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# మా దాడులు ఉగ్రవాదం పైనే..

## పాక్ ఆర్మీ వైఖరివల్లే ఉద్రిక్తతలు ఉధృతం

### దాయాది దాడులను సమర్థంగా తిప్పికొట్టాం: ఎయిర్ మార్షల్ ఎకె భార్తి




**న్యూఢిల్లీ, మే 12:** పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఫైట్ చేశామని, కానీ పాకిస్థాన్ మిలిటరీ ఆ ఉగ్రవాదులకు సపోర్టు ఇచ్చిందని, దీంతో ఉద్రిక్తతలు ఉధృతమైనట్లు ఎయిర్ మార్షల్ ఏకే భార్తి తెలిపారు. ఆపరేషన్ సింధూర్ గురించి ఇవాళ త్రివిధ దళాలు మీడియా సమావేశం నిర్వహించాయి. మూడు దళాలకు చెందిన డీజీ ఎంవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉగ్రవాదులను టార్గెట్ చేసిన సమయంలో పాకిస్థాన్ మిలిటరీ జోక్యం చేసుకున్నదని, ఉగ్రవాదులకు అనుకూలంగా వ్యవహరించిందని, అందుకే తాము రెస్పాండ్ అయినట్లు ఆయన తెలిపారు. పాకిస్థాన్‌లో జరిగిన నష్టాలకు ఆ దేశ ఆర్మీదే బాధ్యత అని ఆయన అన్నారు. తాము కేవలం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా మాత్రమే పోరాడినట్లు చెప్పారు. భారతీయ వైమానిక రక్షణ వ్యవస్థ పాకిస్థాన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టిందన్నారు. ఆకాశ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అద్భుతంగా పనిచేసినట్లు భార్తి తెలిపారు. గత దశాబ్ధ కాలంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్ల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ బలంగా తయారైందన్నారు. భారీ సంఖ్యలో డ్రోన్లు, ఏరియల్ వెహికిల్స్‌తో పాకిస్థాన్ దాడి చేసిందని, స్వదేశీయంగా అభివృద్ధి చేసిన యూఏఎస్ సిస్టమ్స్, శిక్షణ పొందిన ఇండియన్ ఎయిర్ డిఫెన్స్ సిబ్బంది తిప్పికొట్టినట్లు చెప్పారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ఇండియా టార్గెట్ చేసిన కేంద్రాల ఫోటోలను ఎయిర్ మార్షల్ ఏకే భార్తి ప్రదర్శించారు. మన మిలిటరీ బేస్‌లు, మన వ్యవస్థలన్నీ పూర్తిగా ఆపరేషన్‌లో ఉన్నాయని, భవిష్యత్తులో ఎటువంటి మిషన్ అయినా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని భార్తి తెలిపారు. మీడియా సమావేశంలో చైనాకు చెందిన పీఎల్15 ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్ శకలాలను చూపించారు. ఇండియాపై అటాక్ చేసిన సమయంలో పాకిస్థాన్ ఆ మిస్సైల్‌ను వాడినట్లు తెలుస్తోంది. టర్కీకి చెందిన వైఐహెచ్, సోన్‌గార్ డ్రోన్ల శకలాలను కూడా ఇండియా ప్రదర్శించింది.

**ఆపరేషన్ సింధూర్ సూపర్ సక్సెస్**

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని రక్షణ శాఖ అధికారుల వెల్లడించారు. ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. పాక్ భూభాగంలో నష్టానికి బాధ్యత వారి ఆర్మీదేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ సందర్భంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను రక్షణశాఖ అధికారులు ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పాకిస్థాన్ ప్రయోగించిన డ్రోన్లు, మానవరహిత వైమానిక వాహనాలు, క్షిపణులను సమర్థవంతంగా అడ్డుకున్నట్లు ఎయిర్ మార్షల్ ఏకే భార్తి వెల్లడించారు. మన సైన్యానికి, ప్రజలకు పెద్దగా నష్టం జరగకుండా చూశామని తెలిపారు. గగనతల రక్షణ వ్యవస్థలో స్వదేశీ తయారీ ఆకాశ్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. చైనా తయారీ పిఎల్15 వంటి క్షిపణులను పాకిస్తాన్ ప్రయోగిస్తే వాటిని కూల్చివేసినట్లు తెలిపారు. పౌర నివాసాలకు దూరంగానే దాడులు చేశామని, భారత్ దాడులపై పాకిస్థాన్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

**ఏదో లేయర్ వాటిని అడ్డుకుంటుంది: లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్:** గత కొన్నేళ్లుగా ఉగ్రవాద కార్యకలాపాల తీరు మారినట్లు DGMO లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ తెలిపారు. అమాయక పౌరులను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకుంటున్నారని చెప్పారు. భారత్ ఎయిర్‌ఫీల్డ్‌లను, లాజిస్టిక్స్‌ను లక్ష్యంగా చేసుకోవడం చాలా కష్టమని అన్నారు. గ్రిడ్ సిస్టమ్‌లో అన్ని లేయర్లు దాటగలిగినా ఏదో లేయర్ వాటిని అడ్డుకుంటుందని వెల్లడించారు. పాకిస్థాన్ జరిపిన గగనతల దాడులను తక్షణమే పసిగట్టి నిలువరించామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్లు, రాడార్లు ఉపయోగించామని చెప్పారు. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించామని పేర్కొన్నారు డ్రోన్లు, హైస్పీడ్ మిస్సైళ్లను వినియోగించినట్లు వెల్లడించారు. నౌకాదళ అడ్వాన్స్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించగలిగినట్లు తెలిపారు.

**19 రోజుల తర్వాత ప్రశాంతం**

భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లోని నియంత్రణరేఖ వెంబడి ప్రశాంత వాతావరణం నెలకొంది. గతరాత్రి ఇక్కడ ఎలాంటి కాల్పుల మోత మోగలేదని, షెల్లింగ్ జరగలేదని భారత సైన్యం వెల్లడించింది. పహల్గాం దాడి తర్వాత నుంచి ఎల్ఓసి వద్ద అలజడి నెలకొనగా 19 రోజుల తర్వాత నిన్న రాత్రి ప్రశాంతంగా గడిచిందని తెలిపింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత సైనిక ఘర్షణను ఆపేందుకు భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని గంటలకే పాక్ దాన్ని ఉల్లంఘించి కాల్పులకు పాల్పడింది. దీనిపై భారత్ తీవ్రఆగ్రహం వ్యక్తంచేయడంతో దాయాది దేశం వెనక్కి తగ్గింది. దీంతో జమ్మూకశ్మీర్‌లో నిన్న రాత్రి ఎలాంటి కాల్పులు జరగలేదని భారత సైన్యం వెల్లడించింది. ఘర్షణలు తీవ్రస్థాయికి చేరడంతో భద్రతా దళాలు సరిహద్దు ప్రాంతాల నుంచి పౌరులను ఖాళీ చేయించారు. దీంతో గత కొద్ది రోజులుగా వారు సురక్షిత ప్రాంతాల్లోనే తలదాచుకుంటున్నారు. అయితే ఇప్పుడే స్వస్థలాలకు వెళ్లవద్దని సరిహద్దు గ్రామప్రజలను జమ్మూకశ్మీర్ యంత్రాంగం హెచ్చరించింది. పేలని షెల్స్ ఇంకా ఉంటాయని, వాటిని గుర్తించాల్సి ఉందని పేర్కొంది. ఇక, పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న ఇతర రాష్ట్రాల్లోను నిన్న రాత్రి పరిస్థితులు సాధారణస్థితికి వచ్చాయి. డ్రోన్లు, కాల్పులు, బాంబుదాడులు జరగలేదు. అయినప్పటికీ భద్రతా బలగాలు పూర్తిస్థాయి అప్రమత్తతతో ఉన్నాయి.



## భారత్-పాక్ ప్రత్యక్ష చర్చలకు

# మా మద్దతు : యుఎస్

**వాషింగ్టన్, మే 12:** భారత్, పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమని ప్రకటించిన అమెరికా తాజాగా ఇరుదేశాల మధ్య ప్రత్యక్ష చర్చలకు తాము మద్దతిస్తామని ప్రకటించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్-పాక్ అంశంపై యుకె విదేశాంగ మంత్రి డేవిడ్ లామీతో మాట్లాడారు. కాల్పుల విరమణ కొనసాగించడం, రెండు దేశాల మధ్య కమ్యూనికేషన్ మార్గాలను తెరిచి ఉంచడం ఎంతో ముఖ్యమని ఈ భేటీలో ఇరువురు నేతలు అభిప్రాయపడినట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ తెలిపారు. కాల్పుల విరమణ తర్వాత ఇరు దేశాలు ప్రత్యక్షంగా చర్చలు జరపడానికి అమెరికా సాయం చేస్తుందని మార్కో రూబియో ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి కొనసాగుతున్న ప్రయత్నాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భారత్, పాక్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా విదేశాంగ శాఖ స్వాగతించింది. భారత్, పాక్ సంఘర్షణ నివారణకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించింది. భారత ప్రధాని నరేంద్రమోడీ, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శాంతిమార్గాన్ని ఎంచుకోవడాన్ని అభినందిస్తున్నామని వ్యాఖ్యానించింది. భారత్, పాక్ ప్రత్యక్ష చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలు కోరుకుంటున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇటీవల భారత విదేశాంగ మంత్రి జైశంకర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. అవసరమైతే భారత్, పాకిస్థాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తానని ఆయన ప్రతిపాదించారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని మార్కో రూబియో స్పష్టం చేశారు.



## పాక్ మిరేజ్‌ను కూల్చివేసిన భారత్

**న్యూఢిల్లీ, మే 12:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియోను భారత ఆర్మీ తాజాగా విడుదల చేసింది. పాకిస్థాన్‌కు చెందిన మిరాజ్ యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఈ వీడియో ద్వారా భారత్ స్పష్టం చేసింది. 'గగనతలంలో శత్రువును ధ్వంసం చెయ్' అన్న క్యాప్షన్‌తో వీడియోను పంచుకుంది. ఈ వీడియోలో పాక్ మిరాజ్ శిథిలాలను కూడా చూపింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. మరోవైపు ఆపరేషన్ సిందూర్ గురించి ఇవాళ త్రివిధ దళాలు మీడియా సమావేశం నిర్వహించాయి. మూడు దళాలకు చెందిన డీజీఎంవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## భారత్ దాడులకు బంకర్‌లో దాక్కున్న పాక్ ఆర్మీచీఫ్



**ఇస్లామాబాద్, మే 12:** ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టినట్లుగా భారత ఆర్మీ విడుదలచేసిన విడియోలను బట్టి అర్థం అవుతోంది. భారత్ చేసిన దాడులకు సంబంధించిన చిత్రాలను, విడియోలను భారత్ డిజిఎంఒ విడుదలచేసారు. విడియోల్లో పాకిస్థాన్‌కు భారీ నష్టం జరిగినట్లు కనిపించింది. ఇదిలా ఉండగా భారత్ జరిపిన దాడుల్లో నూర్‌ఖాన్ వైమానికస్థావరం తీవ్రంగా నష్టపోయి నట్లు చైనా విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక ఆ సమయంలో పాకిస్థాన్ ఆర్మీ ఆసిమ్ మునీర్ బంకర్‌లో దాక్కునట్లు తెలుస్తోంది. శనివారం తెల్లవారు ఝామున భారత క్షిపణులు నూర్‌ఖాన్ వైమానిక స్థావరంపై విరుచుకుపడి ఊహించనిరీతిలో దెబ్బతీసాయి. దీనితో ఆసిమ్‌మునీర్ బెంబేలెత్తి పోయాడు వెంటనే రావల్పిండిలోని జనరల్ హెడ్‌క్వార్టర్స్‌లోని స్ట్రాంగ్ బంకర్‌లోకి తీసుకెళ్లిపోయినట్లు సమాచారం. నూర్‌ఖాన్ అత్యంత సున్నితమైన సైనిక ప్రాంతం. ఇక్కడ చాలా ప్రధానమైన స్క్వాడ్రాన్‌లు ఉంటాయి. సైనిక సరకు రవాణా సదుపాయాలు ఉంటాయి. సీ-130 ట్రాన్స్‌పోర్టర్‌ల వంటి కీలకమైన ఆస్తులను కలిగి ఉంటుంది. అంతేకాకుండా సాబ్-2000 సైనిక ఉపకరణాల రవాణా విమానాలు కూడా నిలిపి ఉంచుతారు. ఇక గాల్లోనే విమానాలకు ఇంధనాన్ని నింపే ఐఎల్-78 వంటి రీఫ్యూయలర్ విమానాలతోపాటు వివిఐపిలకు సంబంధించిన చిన్న విమానాలకు ఇదే కీలక స్థావరం. అలాగే భవిష్యత్ వైమానిక దళ నాయకులకు శిక్షణాస్థలం కూడా ఇక్కడే ఉంది. ఈ ప్రాంతం పాకిస్థాన్ వ్యూహాత్మకప్రణాళికలకు కీలకమైన ప్రాంతం. ఇక్కడినుంచే అణ్వాయుధ సామగ్రిని పర్యవేక్షిస్తుందిభద్రపరుస్తుంది. ప్రస్తుతం పాక్‌లో 170 లేదా అంతకంటే ఎక్కువ వార్‌హెడ్‌లు ఉన్నట్లు అంచనా. ఈ వార్‌హెడ్‌లు పాక్ వ్యాప్తంగా వివిధప్రాంతాల్లో ఉన్నట్లు సమాచారం. కేవలం 3 గంటల్లోనే నూర్‌ఖాన్, రఫీఖీ, మరిద్, సుక్కూర్, సియాల్‌కోట్, పస్రూర్, చునియన్, సర్గోధ, స్కారు, భోలారి జాకోబాద్‌లతోసహా 11స్థావరాలపై భారత్ దాడిచేసినట్లు మే 11న జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో డిజిఎంఒ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్‌ఘాయ్ అన్నారు. పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది.

## ఉగ్రవాదిని మౌలానాగా చూపించే యత్నం

### అడ్డంగా బుక్ అయిన పాక్

**న్యూఢిల్లీ, మే 12:** సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషించే క్రమంలో పాకిస్థాన్ తప్పుల మీద తప్పులు చేస్తోంది. తాజాగా ఆ దేశం మరో తప్పు చేస్తూ అడ్డంగా దొరికిపోయింది. అగ్రరాజ్యం అమెరికా ప్రకటించిన ఉగ్రవాది హాఫీజ్ అబ్దుర్ రవుఫ్‌ను మోలానాగా చిత్రీకరించే ప్రయత్నాన్ని పాక్ చేసింది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ఉగ్రవా దులకు పాకిస్థాన్‌లో ఇటీవల అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ అబ్దుర్ రవుఫ్ మోలానాగా వ్యవహరించారు. అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. అంతేకాదు ఈ ఆపరేషన్‌లో మరణించిన ఉగ్రవాదుల శవ పేటికలకు పాకిస్థాన్ జాతీయ జెండాలను చుట్టారు. అదే సమయంలో హాఫీజ్ రవుఫ్ పక్కనే ఆర్మీ అధికారులు సైతం ఉన్నారు. అయితే మీడియా ముందుకు వచ్చే సమయంలో హాఫీజ్ టోపి ధరించాడు. ఆర్మీ అధికారులు సూచన మేరకే అతడు టోపీ ధరించాడనే చర్చ అయితే జరుగుతోంది. హాఫీజ్ రవుఫ్ చిత్రాలు బహిర్గతం కావడంతో భారత్ అధికారులు న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పందించారు. ఈ ఫోటోను వివరిస్తూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని బహిరంగంగా ప్రోత్సహిస్తుందనడానికి ఇది తిరుగులేని రుజువు అని వారు కుండబద్దలు కొట్టారు. మరోవైపు హాఫీజ్ రవుఫ్ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉగ్ర వాద సంస్థలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై సర్వత్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అంతేకాదు జైషే మహమ్మద్ మసూద్ అజార్ సోదరుడే ఈ హాఫీజ్ రవుఫ్.

## మూడు రోజులు అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు

**న్యూఢిల్లీ, మే 12:** భారత వాతావరణ శాఖ ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పలు చోట్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరుగా వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే రానున్న మూడు రోజుల పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ ఐఎండి హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిస్తే, మరోవైపు వేడి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఐఎండీ అంచనా ప్రకారం మే 12 నుంచి 15 వరకు ఉరుములు మెరుపులతో పాటు బలమైన గాలులు వీస్తాయి. ఇవి కొన్ని ప్రాంతాల్లో ఉపశమనం కలిగించేలా ఉంటే, మరికొన్ని చోట్ల ఆందోళనకరంగా ఉంటాయని ఐఎండీ పేర్కొంది. దేశరాజధాని దిల్లీలో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణం చల్లగా ఉంటుందని సూచించింది. తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది. విభిన్న వాతావరణ మార్పులు కారణంగా మే 11,12 తేదీల్లో జమ్మూకశ్మీర్, లద్ధాఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో 40-60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అంచనా వేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలున్నాయని, ఈ రాష్ట్రాలైన అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ముఖ్యంగా అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో వర్షపాతం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు ఐఎండీ అంచనా వేసింది. బెంగాల్, బిహార్, ఝార్ఖండ్ తూర్పు ఉత్తరప్రదేశ్‌లో వేడి గాలులు వీస్తాయని పేర్కొంది. ఇక ఉత్తరప్రదేశ్‌లోని 20 జిల్లాలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది ఐఎండీ. ఆదివారం ఆగ్రాలో గంటకు 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. దీంతో హోర్డింగ్స్, చెట్లు కూలిపోవడం వంటివి జరిగాయి.

## టిబెట్, పాక్‌లో భూకంపం: తీవ్రత 5.7గా నమోదు



**టిబెట్, మే 12:** టిబెట్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలు పై భూకంప తీవ్రత 5.7గా నమోదు అయింది. సోమవారం తెల్లవారుజాము 2.41 గంటలకు ఈ భూకంపం సంభవించింది. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణ నష్టం లేదని అక్కడి అధికారులు వెల్లడించారు. అర్ధరాత్రి 2.41 గంటల సమయంలో భూకంపం వచ్చినట్లు జాతీయ భూకంప పరిశోధనా కేంద్రం వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రకంపనలు వచ్చినట్లు పేర్కొంది. మూడు రోజుల కిందట కూడా టిబెట్‌లో భూకంపం వచ్చింది. అయితే, అది రిక్టర్ స్కేల్‌పై 3.7గా నమోదైంది. ఎన్‌సీఎస్ తెలిపిన వివరాల ప్రకారం.. భూకంపం 10 కిలోమీటర్ల లోతులో సంభవించిందని, దీనివల్ల భూకంపం తర్వాత ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. కాగా మే 8న భూకంపం వచ్చిందని, అది 3.7 తీవ్రతతో ఈ ప్రాంతాన్ని కుదిపేసిందని పేర్కొంది. ఇలాంటి భూకంపాలు భూమి ఉపరితలానికి దగ్గరగా ఎక్కువ శక్తిని విడుదల చేయడం వల్ల లోతైన భూకంపాల కంటే ప్రమాదకరమైనవని, ఇది బలమైన భూప్రకంపనలకు భవన నిర్మాణాలు కూలిపోయి ప్రాణ నష్టాన్ని కలిగిస్తుందని ఎన్‌సీఎస్ తెలిపింది. పాక్‌ను వణికించిన భూకంపం భారత్ చేపట్టిన ప్రతీకార దాడులతో అల్లాడిపోయిన పొరుగు దేశం పాకిస్థాన్‌ను వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. శనివారం ఉదయం పాక్‌లో భూ ప్రకంపనలు నమోదైన విషయం తెలిసిందే. మూడు రోజుల వ్యవధిలోనే తాజాగా మరోసారి అక్కడ భూమి కంపించింది. సోమవారం మధ్యాహ్నం 1:26 గంటల సమయంలో భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.6గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. ఈ భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. అంతకుముందు శనివారం తెల్లవారుజామున 01.44 గంటలకు పాకిస్థాన్‌లో భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. రిక్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 4.0గా నమోదైంది. ఇటీవల పాక్‌లో వరుస భూకంపాలు సంభవిస్తున్నాయి. పాక్ యురేషియన్, ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్లు కలిసే ప్రదేశంలో ఉంది. దాంతో తరచుగా అక్కడ భూకంపాలు వస్తుంటాయి. బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తున్ఖ్వా, గిల్గిట్‌బాల్టిస్థాన్ తదితర ప్రాంతాలు యురేషియన్ ప్లేట్ దక్షిణ అంచున ఉండడం వల్ల భూకంపాల బారినపడుతున్నాయి.

## రహస్యాలకు యత్నిస్తున్న పాక్ గూఢచారులు



### వెల్లడించిన భారత నిఘా వర్గాలు

**న్యూఢిల్లీ, మే 12:** భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి ఇరుదేశాలు ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో పాక్ గూఢచారులు మాత్రం భారత రహస్యాలను తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు తాము భారత్ రక్షణ శాఖ అధికారులుగా పేర్కొంటూ జర్నలిస్టులకు ఫోన్‌చేసి 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించి సైనిక అధికారులు చేసే బ్రీఫింగ్, పాక్ విషయంలో చేసే ప్రణాళికలు మొదలైన సమాచారాన్ని సేకరిస్తున్నారని భారత నిఘా వర్గాలు పేర్కొన్నారు. పాక్ దాడిలో భారత్‌లోని ఏయే ప్రాంతాల్లో ఎంత నష్టం జరిగిందనే విషయాలపై కూడా వారు ఆరా తీస్తున్నట్లు వెల్లడించాయి. ఇతర జర్నలిస్టులు, పలువురు పౌరులకు కూడా గూఢచారుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నట్లు సమాచారం. ఈ కాల్స్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నుంచి వస్తున్నట్లు చూపిస్తున్నాయని, కానీ భరాత అధకారులెవరూ అటువంటి కాల్స్ చేయరని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అటువంటి కాల్స్ వస్తే ఆన్సర్ చేయవద్దని తమకు సమాచారం ఇవ్వాలని సూచించాయి. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది.

ఇందులో భాగంగా నేడు ఇరుదేశాల సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్‌ల మధ్య హాట్‌లైన్‌లో చర్చలు జరగనున్నాయి. భారత్, పాక్ చర్చల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోబాల్, త్రివిధ దళాధిపతులు, పలువురు ఉన్నతస్థాయి సైనికాధికారులతో సమావేశమయ్యారు.

## మా యుద్ధవిమానం ధ్వంసమైంది

### దాయాది దేశం అంగీకారం

**ఇస్లామాబాద్, మే 12:** ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించామని, ఆ దేశ అత్యాధునిక యుద్ధ విమానాలను నేలకూల్చామని భారత సైన్యం వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా పాకిస్థాన్ ఆర్మీ స్పందించింది. తమ ఫైటర్ జెట్ ఒకటి ధ్వంసమైన మాట వాస్తవమేనని అంగీకరించింది. అయితే, అది స్వల్పమేనని పేర్కొనడం గమనార్హం. పాక్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్‌చౌధరీ.. తమ దేశ ఎయిర్‌ఫోర్స్, నేవీ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ 'భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణల్లో మన వాయుసేనకు చెందిన ఓ యుద్ధ విమానం స్వల్పంగా ధ్వంసమైంది' అని వెల్లడించారు.

## 17మంది నవజాత శిశువులకు సిందూర్ పేరు




**లక్నో,మే 12:** దేశవ్యాప్తంగా ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ పేరు మారుమోగుతోంది. పహల్గాం ఉగ్రదాడితో రగిలిపోతున్న భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్ర శిబిరాలపై దాడి చేసి 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. పాక్ వెన్నులో వణుకుపుట్టిస్తూ ఇండియన్ ఆర్మీ చేపట్టిన ప్రతీకార చర్యపై దేశవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తున్నాయి. కొందరైతే తమ నవజాత శిశువులకు సింధూర్ అనే పేర్లు పెడుతూ సైనిక జవాన్ల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కుషీనగర్ జిల్లాలో అసాధారణ రీతిలో ఈ సెంటిమెంట్ కనిపిస్తోంది. కేవలం రెండు రోజుల్లో 17 మంది ఆడ శిశువులకు వారి కుటుంబ సభ్యులు సిందూర్ అంటూ నామకరణం చేశారు. ఆపరేషన్ సిందూర్ తమ జీవితాల్లో ఎంతటి ప్రాముఖ్యత సంతరించుకుందో చాటుకున్నారు. సిందూర్ అనేది ఇప్పుడు కేవలం ఒక పేరు కాదని, ఒక భావోద్వేగానికి, దేశం పట్ల గౌరవానికి ప్రతీక అని కుషీనగర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే షాహి తెలిపారు. బెడిహరి గ్రామానికి చెందిన అర్చనా షాహి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల ఆడశిశువుకు ఆమె జన్మనిచ్చారు. పాపకు సిందూర్ పేరు పెట్టాలని ముందే నిర్ణయించుకున్నట్టు చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిలో పలువురు మహిళలు తమ భర్తలను పొగొట్టుకుని పసుపుకుంకుమలను కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్ అందర్నీ గర్వంగా తలెత్తుకునేలా చేసిందని చెప్పారు. ఆ కారణంగానే తమ ఆడబిడ్డకు సిందూర్ పేరు పెట్టుకున్నామని చెప్పారు. కాగా, సిందూర్ పేరు తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె భర్త అజిత్ షాహి తెలిపారు. పడ్రౌనా ఏరియాలోని మదన్ గుప్తా కుటుంబ సభ్యులు కూడా ఇదే సెంటిమెంట్ వ్యక్తం చేశారు. గుప్తా కోడలు కాజల్ గుప్తా కొత్తగా పుట్టిన తన ఆడశిశువుకు సిందూర్ పేరు పెట్టారు. ఈ పేరుతో ఆపరేషన్ సిందూర్ ఎప్పటికి తమకు గుర్తుండిపోతుందని, అందరూ గర్వించే క్షణాలుగా తాము ఆ సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకుంటామని చెప్పారు. తనకు పుట్టిన ఆడశిశువుకు సిందూర్ పేరు పెట్టుకోవడం గర్వకారణంగా భావిస్తున్నట్టు భతాహి బాబు గ్రామానికి చెందిన మరో మహిళ తెలిపింది. సిందూర పెరిగి పెద్దయిన తర్వాత తన పేరుకు అర్థం తెలుసుకుని భరతమాతకు పేరు తెస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పింది. ఆపరేషన్ సిందూర్‌కు గౌరవ సూచకంగా తన శిశువుకు సిందూర్ పేరు పెట్టుకున్నట్టు పడ్రౌన ప్రాంతానికి చెందిన ప్రియాంక దేవి తెలిపారు.

## పాక్ ఊసరవెల్లి, ఆ మాటలు నమ్మొద్దు

### బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ భారత్‌కు హెచ్చరిక



**క్వెట్టా, మే 12:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ చేపట్టి పాకిస్థాన్ లోని, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పాకిస్థాన్ సైన్యం నియంత్రణ రేఖ వెంట కవ్వింపులకు పాల్పడటంతో భారత్ తిప్పికొట్టింది. ఈ క్రమంలో కాల్పుల విరమణ కోసం పాకిస్థాన్ చేసిన ప్రతిపాదనకు భారత్ అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో బలూచ్ లిబరేషన్ ఆర్మీ స్పందించింది. పాకిస్థాన్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని పరోక్షంగా హెచ్చరించింది. పాకిస్థాన్ ఊసరవెల్లిలా రంగులు మారుస్తుందని వ్యాఖ్యానించింది. పాకిస్థాన్ నుంచి వినిపించే శాంతి, కాల్పుల విరమణ, సోదరభావం ప్రవచనాలు కేవలం మోసమని పేర్కొంది. ఆ దేశంతో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బలూచ్ లిబరేషన్ ఆర్మీకి విదేశీ మద్దతు ఉందంటూ వస్తున్న విమర్శలను బలూచిస్థాన్ తోసిపుచ్చింది. తాము కీలు బొమ్మలం కాదని, పాకిస్థాన్ ఏం చేసినా చూస్తూ మౌనంగా ఉండబోమని పేర్కొంది. ఈ ప్రాంతానికి సంబంధించి ప్రస్తుత, భవిష్యత్తు సైనిక, రాజకీయ, వ్యూహాత్మక నిర్మాణంలో తమకు సరైన స్థానం ఉందని చెప్పింది. తనను తాను డైనమిక్, నిర్ణయాత్మక పార్టీగా అభివర్ణించుకుంది. పాకిస్థాన్లోని బలూచ్ ప్రావిన్స్‌లో చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయువు పుష్కలంగా ఉన్నాయని తెలిపింది. అయితే దేశ వ్యవసాయ యోగ్య భూమిలో బలూచ్ వాటా కేవలం 5 శాతం మాత్రమేనని వెల్లడించింది. బలూచ్‌లో కఠినమైన ఎడారి వాతావరణం ఉంటుందని, అందుకే పేదరికం ఎక్కువని బీఎల్‌ఏ తెలిపింది. ఎడారి ప్రాంతం కావడంతో జనాభా తక్కువగా ఉంటుందని, అందుకే అభివృద్ధికి దూరంగా ఉందని పేర్కొంది. అందుకే బలూచ్‌లో అనిశ్చితి నెలకొని వేర్పాటువాదులు శక్తిమంతమయ్యారని చెప్పింది. ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలని బలూచ్ ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతున్నారని తెలిపింది.

### చత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

## 13 మంది మృతి, మరో 30 మందికి గాయాలు



**నయారాయ్‌పూర్, మే 12:** పెళ్లి వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ శాతం మహిళలే ఉన్నారు. వారితో పాటు నలుగురు చిన్నారులు కూడా ఈ ప్రమాదంలో మరణించారు. ఈ ఘటన చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ బలోదబజార్ రోడ్డులోని సారగావ్ సమీపంలో జరిగింది. ఈ ప్రమాదం సోమవారం తెల్లవారు జామున జరిగినట్టు తెలుస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం చటౌడ్ గ్రామానికి చెందిన కొందరు తమ కుటుంబ సభ్యుల వివాహ వేడుకలో పాల్గొనడానికి చౌతియా ఛత్తీ గ్రామానికి వెళ్లినట్టు తెలుస్తోంది. అయితే వివాహం పూర్తయ్యాక ఓ వాహనంలో రాయ్‌పూర్‌కు బయల్దేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం బలోదబజార్ రోడ్డులోని సారగావ్ సమీపంలోకి రాగానే వేగంగా వచ్చిన ఓ ట్రక్కు ఆ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందగా 30 మందికిపైగా గాయపడ్డారు. అందుకున్న సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలతో పాటు గాయపడిన వారిని స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. అయితే గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇక మృతుల్లో తొమ్మిది మంది మహిళలతో పాటు నలుగు చిన్నారులు ఉన్నట్టు జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయ్‌పూర్ ఎస్పీ లాల్ ఉమ్మెద్ సింగ్ తెలిపారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన కేంద్ర మంత్రి



**భీమవరం మే 12 ప్రభాతవార్త :** భీమవరం నరసయ్య అగ్రహారంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు, డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం భీమవరం మున్సిపాలిటీ ఐదవ వార్డు కుముదవల్లి రోడ్డులో ఆర్టీసీ డిపో అవుట్ గేట్ కార్నర్ నుంచి దుర్గా కర్రీ పాయింట్ వరకు మూడు కోట్ల రెండు లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పరిశీలించారు. ప్రస్తుతం ఆరు మీటర్లు ఉన్న రోడ్డును 11 మీటర్లు సిమెంట్ రోడ్డుగా వెడల్పు చేసే పనులు వేగంగా సాగుతున్నాయని, ఎలక్ట్రికల్ స్తంభాలు అడ్డంగా ఉండటం వల్ల పనులు కొద్దిగా ఆలస్యం అవుతున్నాయని మున్సిపల్ ఇంజనీర్ త్రినాధరావు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ కు వివరించారు. రోడ్డు నిర్మాణానికి ఎలక్ట్రికల్ స్తంభాలు అడ్డు లేకుండా మార్చాలని ఎలక్ట్రికల్ అధికారులను మంత్రి ఆదేశించారు. మరో 15 రోజుల్లో ఎలక్ట్రికల్ స్తంభాల మార్పు పనులు పూర్తి చేస్తామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొత్తపల్లి రాంబాబు కేంద్రమంత్రి వర్మ కు తెలిపారు. మున్సిపల్, ఎలక్ట్రికల్ అధికారులు సమన్వయంతో పనిచేసి కాంట్రాక్టర్ తో వర్షాకాలం ప్రారంభమయ్యేలోపే నిర్మాణం పనులు పూర్తి అయ్యేలా చూడాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ కోరారు. సీసీ రోడ్డు మధ్యలో డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం ద్వారా భీమవరం త్రీటౌన్ అభివృద్ధికి దోహదం పడుతుందని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ మన్నే సతీష్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రవితేజ, ఎలక్ట్రికల్ ఏఈ పద్మావతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కలిదిండి వినోద్ వర్మ, బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ, బిజెపి తూర్పు మండల అధ్యక్షులు అడబాలశివ, షేక్ మొహుద్దీన్, జనార్ధన్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారా తయారీని విడిచిపెట్టిన వారిజీవితాల్లో నవోదయం..



**ఏలూరు మే 12, ప్రభాతవార్త :** నాటుసారా తయారీ, అమ్మకాలు సంపూర్ణంగా స్వస్తిపలికిన వారికి ప్రత్యమ్నాయ ఉపాధి కల్పించే చర్యలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం స్ధానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నాటుసారా తయారీని విడిచిపెట్టినవారికి ఉపాధి కార్యక్రమాలు నిర్వహణపై ఎక్సైజ్, వివిధ సంక్షేమ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా గుర్తించిన



అర్హులైన వారికి ప్రత్యమ్నాయంగా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా డిఆర్డిఏ, వ్యవసాయ, ఉధ్యానశాఖ, పశుసంవర్ధకశాఖ, సెట్ వెల్, స్కిల్ డెవలప్ మెంట్, జిల్లా పరిశ్రమల శాఖ, బి.సి. కార్పోరేషన్, తదితర శాఖల అధికారులు ఎక్సైజ్ అధికారులతో చర్చించి వారంలోగా తుది జాబితా తయారుచేసి నాటుసారా తయారీకి స్వస్తిపలికిన కుటుంబాలకు జీవనోపాధి మార్గం చూపించాలని ఆదేశించారు. ఆకుటుంబాల అందరిని సమావేశ పరిచి వారు ఏ ఉపాధిమార్గం ఎంచుకున్నారో జాబితా రూపొందించాలన్నారు. ఆయా పధకాలకు సంబంధించి వారికి రుణాలు ఇప్పించేందుకు ఎల్డిఎమ్ తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. నాటుసారా తయారీదారులలో ప్రత్యమ్నాయ జీవనోపాధి కల్పించి మార్పు తీసుకురావాలని నవోదయం-2.0 భాగంగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అధికారి ఎ. ఆవులయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పాండురంగారావు, లైజన్ ఆఫీసర్ షేక్ రమేష్, పలువురు ఎక్సైజ్ సిఐలు, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, ఎల్డిఎమ్ డి. నీలాద్రి, జిల్లా బి.సి. సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ అభినందనలు: కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం మే 12 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రెడ్ క్రాస్ గోల్డ్ మెడల్ అందుకున్న సందర్భంగా సోమవారం పీజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు జిల్లా అధికారులు పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు తొలుత జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి, మాట్లాడుతూ జిల్లాలో 2024 - 25 సంవత్సరంలో రూ.36 లక్షలు వివిధ శాఖలు సభ్యత్వ రుసుము ద్వారా అందజేయడం జరిగిందని, వినూత్నంగా ప్రభుత్వ శాఖలచే రక్తదాన శిబిరాలు ఏర్పాటు, రూ.3 కోట్లతో బ్లడ్ బ్యాంక్, డేకేర్ తలసేమియా సెంటర్ ఏర్పాటు తదితర రెడ్ క్రాస్ సేవలలో పాలుపంచుకున్నందుకు జిల్లా గోల్డ్ మెడల్ ను సాధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలన్నింటినీ ముందుండి నడిపించిన మన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందనీయులన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షణలో జిల్లా రెడ్ క్రాస్ కు సేవలందిస్తున్న జిల్లా, డివిజన్, మండల అధికారులు, రెడ్ క్రాస్ సభ్యుల సమిష్టి కృషితో జిల్లాకు గోల్డ్ మెడల్ ను సాధించడం జరిగిందని, ఇది వారందరి విజయం అన్నారు. అత్యధిక రెడ్ క్రాస్ సభ్యత్వం రుసుము డిఆర్డిఏ రూ.5,22,531, జిల్లా గ్రామపంచాయతీ రూ.4,26,250, భీమవరం తహసిల్దార్ రూ.2,71500, పరిశ్రమల శాఖ రూ.2,41,000, తాడేపల్లిగూడెం తహసిల్దార్ రూ.2,00,100 వసూలు చేసినందుకు ఆయా శాఖల అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. వీరితోపాటు 37 శాఖలు రెండు లక్షల రూపాయలు లోపు సభ్యత్వ రుసుమును వసూలు చేయడం జరిగిందని తెలిపారు.

# పామాయిలు పెట్టు - పైసలు పట్టు




## - రైతులకు శిరులు కురిపిస్తున్న పామాయిల్
## - మామిడి నరికి పామాయిల్ సాగుకు
## - సిద్ధమవుతున్న రైతులు

**ప్రభాతవార్త చాట్రాయి :** ప్రస్తుతం పామాయిల్ పంట రైతులకు లాభసాటిగా మారింది. పామాయిల్ పంట రైతులుకు సిరులు కురిపిస్తుండటంతో అన్నదాతలు పామాయిల్ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ప్రాంతంలో మామిడి పంటకు ప్రసిద్ధిగాంచినది అయినప్పటికీ రైతులు ఆ పంటకు స్వస్తి పలుకుతున్నారు. మామిడి చెట్లను నరికి పామాయిల్ సాగు చేసేందుకు అధిక సంఖ్యలో రైతులు సన్నాహాలు ప్రారంభించారు. మామిడి పంట ఏడాది కేడాది నష్టాలను తెచ్చి పెడుతూ ఉండటంతో విరక్తి చెందిన రైతులు పామాయిల్ పంట వైపు మొగ్గు చూపిస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి పామాయిల్ మొక్క ఆన్లైన్లో బుక్ చేసుకునే కేవలం రెండు రూపాయలకే సరఫరా చేస్తుండటంతో రైతులు ఆపంట వైపు దృష్టి సారించారు. గత వైసిపి ప్రభుత్వం లో పామాయిల్ మొక్క దొరకకపోగా మొక్క 150 రూపాయలు పైగా వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఈ ప్రభుత్వం పామాయిల్ కు మద్దతు ధర కూడా ప్రకటించడంతో రైతులకు కాసుల కోసం కురిపిస్తోంది. ప్రస్తుతం పామాయిల్ ధర టన్ను 20 వేలకు పైగా పలుకుతుండడంతో ఐదు ఎకరాలు సాగు చేసే రైతు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవనం సాగించుకోవచ్చని పలువురు తెలియజేస్తున్నారు. పామాయిల్ వేసిన తర్వాత అంతర పంటగా మూడు సంవత్సరాల పాటు మొక్కజొన్న మొదలగు ఆరుతడి పంటలను సాగు చేసుకునేందుకు అవకాశం ఉండటంతో పామాయిల్ చేతికి వచ్చే సమయానికి కుటుంబ పోషణకు కూడా ఇబ్బంది ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నీటి సౌకర్యం మెండుగా ఉన్న ప్రతి మేరక తోటలో రైతులు పామ్ ఆయిల్ వేసి ప్రశాంతమైన జీవనాన్ని సాగిస్తున్నారు. యాడాది పాటు మామిడి పంట కోసం ఎదురుచూసి పైసా రాకపోగా లక్షలు నష్టాలను తెచ్చిపెడుతున్నందున పామాయిల్ ఎంతగానో ఉపయోగపడుతోందని అన్నదాతలు అంటున్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ కూడా ప్రాధాన్యత ఇస్తూ సబ్సిడీపై అందిస్తుండగా రైతులకు మరింత మేలు జరుగుతోంది. మూడు సంవత్సరాల నుండి కాపు ప్రారంభం అవుతుండగా మొదట్లో కొద్ది మొత్తంలో పైకం వచ్చినప్పటికీ ఐదు సంవత్సరాలు దాటిన నాటినుండి రైతుకు డోకా లేదు. పామాయిల్ తోటలను కూడా చాలామంది కౌలుకు తీసుకుని ముందుగానే రైతులకు పైకం చెల్లించి తోటకు బలం వచ్చే విధంగా మందులు వాడి మరింత దిగుబడిని పెంచుతున్నారు. ఏది ఏమైనా మెట్ట ప్రాంతమైన చాట్రాయి మండలంలో పామాయిల్ సాగు రోజురోజుకు పెరుగుతుందనటంలో అతిశయోక్తి లేదు. ఈ పరిస్థితి చూస్తే ఈ ప్రాంతానికి పేరు తెచ్చిన నూజివీడు మామిడి కనుమరుగయ్యే పరిస్థితి స్పష్టంగా కనబడుతోంది.

# ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ఏకంగా ఏడు పదవులు





**జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. కూటమి పార్టీల్లో క్రియాశీలకంగా ఉంటూ విధేయతగా పనిచేసిన వారి సేవలను గుర్తించి పదవులను కట్టబెట్టింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ఏకంగా ఏడు పదవులు లభించడం విశేషం. ఆప్కాబ్,డిసీసీబి చైర్మన్ గా ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులైన గన్ని వీరాంజనేయులకు పదవి లభించింది. డీసీఎంఎస్ చైర్మన్ గా నరసాపుర మండలం లక్ష్మణేశ్వరానికి చెందిన చాగంటి మురళీకృష్ణ కు పదవి వచ్చింది, ఈయన జనసేన పార్టీ నాయకులు. రాష్ట్ర మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ కు చైర్ పర్సన్ గా రాష్ట్ర మాజీ మంత్రి పీతల సుజాతను నియమించారు. ఈమెను మొదటి విడత లోనే నామినేటెడ్ పోస్టుల భర్తీలో వినియోగదారుల రక్షణ మండలి చైర్మన్ గా నియమించారు. సాంకేతిక సమస్యల వల్ల ఆమె ఈ బాధ్యతలు చేపట్ట లేకపోయారు. ఇప్పుడు ఆమెకు కీలకమైన మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్ పర్సన్ గా నియమించారు. తాడేపల్లిగూడెంనకు చెందిన టిడిపి నాయకులు వలవల బాబ్జి కి భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డుకు చైర్మన్ గా నియమించారు. తాడేపల్లిగూడెంనకు చెందిన తెలుగుదేశం నాయకులు ఆకాశపు స్వామికి టైలర్ అభివృద్ధి సహకార సమాఖ్యకు చైర్మన్ గా నియమితులయ్యారు. గతంలో ఇదే కార్పొరేషన్ కు చైర్మన్ గా వ్యవహరించారు. మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్యకు కొల్లు పెద్దిరాజు(నరసాపురం) నియమితులయ్యారు. తెలుగుదేశం పార్టీ నరసాపురం ప్రధాన కార్యదర్శిగా ఈయన ఉన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(ఇడా)కు పెన్ను బోయిన వాణి వెంకట శివప్రసాద్(ఏలూరు) చైర్మన్ పదవి లభించింది. ప్రస్తుతం ఈయన ఏలూరు టిడిపి నగర అధ్యక్షునిగా ఉన్నారు. వీరిని సోమవారం పలువురు టిడిపి నాయకులు,ఎమ్మెల్యేలు,ఎంపీలు అభినందించారు.

# ఈనెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెకు పిలుపు



**వేలేరుపాడు, మే 12, ప్రభాత వార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా చట్టాలు చేస్తున్నాయని వేలేరుపాడు మండలంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం.ధారయ్య, సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు మడివి దుర్గారావు, సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్ అన్నారు. ఈనెల నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్రం కార్మికులకు 29 చట్టాలను 4 లేబర్ కోడలుగా చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికులకు స్వేచ్ఛయుత హక్కులు లేకుండా చేసిన కేంద్రంపై కార్మిక వర్గాలు అందరూ వ్యతిరేకించి సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిత్యవసర సరుకులు ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచుతున్నారని, ఇచ్చేది గోరంతా లాగేది కొండంత అన్నట్లు కేంద్రం వైఖరి ఉందని అన్నారు. ఆదాని అంబానీలకు దోచిపెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తుంది అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టాలని కార్మికులకు తెలియజేశారు. దేశవ్యాప్త కార్మిక సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు సభలు సమావేశాలు నిర్వహించి సమాయత్వం కావాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అనేకసార్లు పోరాటం చేసిన ఘనచరిత్ర వామపక్ష పార్టీలకు ఉందని, ఈనెల 20న జరిగే కార్మిక దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరు కూడా పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కురుమేల్ల. శ్రీను, సిఐటియు మండల కార్యదర్శి బోగరి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా నాయకురాలు కె. సైదమ్మ,అంగనవాడి మండల కార్యదర్శి సిహెచ్ రమాదేవి, ఆశ మండల అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, పిట్ట ముత్తమ్మ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పరిశ్రమల విస్తరణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత




నరసాపురం: మే 12, ప్రభాతవార్త : నరసాపురం మండలం లిఖితపూడి గ్రామంలో ఏపీ ఐఐసి నిధులు రూ.13.60 కోట్లతో నిర్మించే ప్లాంటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణమునకు సోమవారం నరసాపురం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, రాష్ట్ర ఏ పి ఐ ఐ సి చైర్మన్ మంతెన రామరాజు, టిడిపి ఇంచార్జ్ పొత్తూరి రామరాజు కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరసాపురం శాసనసభ్యులు మరియు రాష్ట్ర ప్రభుత్వ విప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సహాయ సహకారాలతో నరసాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. రాష్ట్రంలో ఎం ఎస్ ఎం ఈ ల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తో పాటు మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని లక్ష్యంతో పారిశ్రామిక పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి కుటుంబం చిన్న ఇండస్ట్రియల్ గా అభివృద్ధి చెందాలని రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో మంచి ఆలోచనతో ఎం ఎస్ ఎం ఈ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. యువతకు యువతకు ఉపాధి కల్పించి ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో175 నియోజకవర్గాల్లో భాగంగా 16 చోట్ల నిర్మించే ఎం ఎస్ ఎం ఈ లో మన జిల్లాలో నరసాపురం, ఉండి నియోజకవర్గాలకు రావడం జరిగిందన్నారు. నరసాపురం నియోజకవర్గం ఇండస్ట్రియల్ గా వెనుకబడి ఉన్నదని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ వద్ద అనేక మార్లు ప్రస్తావించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా మండలంలోని లిఖితపూడి గ్రామానికి ఈ అవకాశం రావడం జరిగిందన్నారు. ఈ గ్రామంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణము చేయుట వలన ఈ ప్రాంతం అభివృద్ధితో పాటు స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి కలుగుతుందని చెప్పారు. గత ప్రభుత్వంలో నోచుకోలేదని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి గతంలో ఎన్నో ఎన్నడూ లేని విధంగా ముందుకు

7వ పేజీలో

# నేడు హెూంమంత్రి అనిత తణుకు రాక

## ఆరిమిల్లి ఆద్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



**తణుకు, మే 12 ( ప్రభాత వార్త) :** తణుకు నియోజకవర్గంలో ఈనెల 13న మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. తణుకు ఇరగవరం అత్తిలి మండలాల పరిధిలో మొత్తం రూ. 4.09 కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర హెూం మంత్రి అనితతో పాటు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొంటారని చెప్పారు. తణుకు పట్టణంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాలు పాలూరు, అత్తిలి, కేవస్ గట్టు, వేల్పూరు, కె. ఇల్లింద్రపర్రు గ్రామాల్లో జరుగుతాయని వివరించారు. ఆయా కార్యక్రమాలలో కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సతీమణి సునీత



మొగల్తూరు మే 12 (ప్రభాతవార్త) 216 నేషనల్ హైవే ను అనుకొని ఉన్న ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసియున్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహెూత్సవములు పురస్కరించుకుని అఖండ జ్యోతి రూపంలో దర్శనమిస్తున్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని సోమవారం నరసాపురం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ సతీమణి సునీత జ్యోతి రూపంలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సతీమణి సునీత కు ఆలయ మర్యాదలతో పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు దాసరి శ్రీను దాసరి ముత్యాలరావు సర్పంచ్ అడ్డాల సూరిబాబు అడ్డాల వెంకటేశ్వరరావు బొల్లం శ్రీనివాసరావు అడ్డాల రామచంద్రరావు బిఎల్ నరసింహారావు కొల్లు రాజశేఖర్ వారితో పాటుగా నరసాపురం కౌన్సిలర్లు కొప్పాడు కృష్ణవేణి తోట అరుణ ఒడుగు పుష్పవల్లి మల్లిపూడి జ్యోతి పెమ్మాడి కిరణ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# డీఈవో కార్యాలయం నందు యుటిఎఫ్ ఉపాధ్యాయులు ధర్నా



మొగల్తూరు మే 12 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా భీమవరం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయము నందు సోమవారం ఉపాధ్యాయులు బదిలీలు పదోన్నతులు షెడ్యూల్ విడుదల చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మొగల్తూరు మండల శాఖ ఉపాధ్యాయులు చింతపల్లి కృష్ణమోహన్ కొల్లాటి బ్రహ్మయ్య తాతారావు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# తణుకు మునిసిపాలిటీలో సమ్మె సైరన్

## -నోటీసులు అందజేసిన మున్సిపల్ కార్మికులు



**తణుకు, మే 12 (ప్రభాత వార్త):** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 20న సమ్మె చేపడుతున్నట్టు ఏఐటీయూసీ నాయకులు బొద్దాని నాగరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ తెలిపారు. సోమవారం మునిసిపల్ కమిషనర్ రామ్‌కుమార్‌కు ఏఐటీయూసీ%-%సీఐటీయూ సంఘాలు తరపున సమస్యలతో కూడిన సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గత 20 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ నేటికీ పర్మినెంట్ చేయకపోవడం అన్యాయం అన్నారు. ఇప్పటి వరకు కార్మికులు, ఉద్యోగులకు రక్షణగా ఉన్న ఆప్కాస్ నేటి ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తుందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు, సౌకర్యాలు పెంచాలని కోరారు. పాత కార్మిక చట్టాలు ప్రకారం కొద్దో గోప్పో జీవనం సాగిస్తున్నారని, లేబర్ కొడ్స్ కారణంగా అన్ని హక్కులు పోతాయని అన్నారు. పోరాటాలు ద్వారా వచ్చిన హక్కులు, పోరాటాలు ద్వారానే నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు గార రంగారావు, వి.రమేష్, జి.వెంకటేశ్వరావు, నూకరాజు, ఆంజనేయులు, రవికుమార్, శ్రీనివాస్, రాములమ్మ, దుర్గారావు, బొద్దాని మురళి, నాగరాజు పాల్గొన్నారు.

# వైభవంగా ఉయ్యాల ఊగిన లక్ష్మమ్మ అంకమ్మ



చాట్రాయి, మే 12, ప్రభాతవార్త : చాట్రాయి మండలంలోని పాల్గొనరుపేట గ్రామంలో వేంచేసియున్న లక్ష్మమ్మ అంకమ్మ అమ్మ వాళ్ళ తిరునాళ్ల కార్యక్రమం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారికి పవళింపు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయంలో ఉయ్యాలలో లక్ష్మమ్మ అంకమ్మ అమ్మవారిని ఉంచి మహిళలు పెద్ద ఎత్తున ఉయ్యాల ఊపుతూ అమ్మవారి భజన కీర్తనలు పాడుతూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఆరుగొలను పేట గ్రామంలోని మహిళలు లేకుండా ఆ గ్రామానికి చెందిన ఇతర ప్రాంతాలలో ఉన్న ఆడపడుచులు చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న ఆడపడుచులు విరివిగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం మొత్తం కిటకిటలాడింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

**నేడే మంత్రి సారధి రాక**

ఆరుగొలను పేట గ్రామంలో జరుగుతున్న తిరునాళ్లకు మంత్రి పార్థసారథి మంగళవారం అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్నారు. తిరునాళ్లకు రావాలని ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు కూడా మంత్రి పార్థసారధిని ఆహ్వానించడంతో మంగళవారం సాయంత్రం అమ్మవారి సేవలో పాల్గొంటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాల్గొని హాలో సాంస్కృతిక కార్యక్రమాల్లో వీక్షించనున్నట్టు కమిటీ తెలియజేసింది.

## బాధ్యతాయుతంగా, నాణ్యతతో అర్జీలు పరిష్కరించాలి..



ఏలూరు,మే,12: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తోపాటు డిఆర్వో వి. విశ్వేశ్వరరావు, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, ఎస్ఈ కార్పొరేషన్ ఈడి యం. ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె. భాస్కర్, శ్రీనివాసరావులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం 258 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో అందిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందిన ప్రతి అర్జీకి అర్ధవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈనెల 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్రాథీమ్ భావన వేడిని తగ్గించేందుకు అనే కార్యక్రమంపై విస్తృతంగా అనేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజల నుండి అందిన సమస్యలను సొంత సమస్యగా భావించి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార తీరుపై ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి అర్జీదారుడు సంతృప్తిచెందేలా పరిష్కారం ఉండాలన్నారు. జిల్లా అధికారులు తమ శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలుతీసుకోవాలని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కార ధ్యేయంగా అధికారులు పనిచేయాలని ఆమె తెలిపారు.

**అందిన అర్జీలలో కొన్ని..**

కలిదిండి మండలం కొచెర్ల గ్రామ నివాసి దాసరి వరహాలు తన భూమిని ప్రక్క వారు ఆక్రమించుకున్నారని, అధికారులు విచారణ చేసి తిరిగి తన భూమిని ఇప్పించమని కోరుతూ అర్జీ అందజేశారు. పెదవేగి మండలం నడుపల్లి గ్రామ నివాసి కొల్లి మణికుమార్ తండ్రి దుర్గారావు తన కుమారుడు దివ్యాంగుల పెన్షన్ రూ 6 వేలు మాత్రమే వస్తుందని, మంచానికే పరిమితమం అయ్యాడని స్వయంగా పరిశీలించి సదరమ్ సర్టిఫికెటు జారీచేసి రూ 15 వేలు పెన్షన్ ఇప్పించాలని కోరారు. దెందులూరు గ్రామ నివాసి కె.త్రిలోక నాథ చౌదరి అర్జీనిస్తూ పంట బోదె ఆక్రమణకు గురైందని, పంట సాగు చేసేందుకు సాగునీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, తగు పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు.

## అర్జీదారులకు నాణ్య మైన సేవాలాందించాలి
## :కలెక్టర్ చదలవాడనాగరాణి



భీమవరం మే 12 ప్రభాతవార్త: పిజిఆర్ఎస్ అర్జీలకు నిర్ణీత గడువులోపుగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. సమస్య తమ శాఖ పరిధిలోనికి రాని పక్షంలో నిర్ణీత గడువు వరకు ఉంచకుండా వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిస్వీకరించి పరిష్కారానికి ఆదేశించారు. సోమవారం జరిగిన పి జి ఆర్ ఎస్ ద్వారా 187 అర్జులను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, వయోవృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గా ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పరిశుద్ధ మందిరం ప్రారంభం



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : లింగపాలెం మండలం కే గోకవరం పుప్పాల వారి గూడెం సెంటర్ నందు కల్వరి గ్రేస్ ఫెలోషిప్ పరిశుద్ధ మందిరం ప్రతిష్ట ఆరాధన మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పాల్గొన్నారు. ఈ పరిశుద్ధ మందిరాన్ని ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రారంభించారు. ఆయన తోపాటు బయేర్షబా మినిస్ట్రీస్ కే సల్మాన్ రాజు, వ్యవస్థాపకులు కె కుటుంబరావు కే మేరీ సత్యవతి పలువురు దైవజనులు కూటమి నాయకులు పాల్గొన్నారు. శాసనసభ్యులు గురించి ఆయన చేయబోయే కార్యక్రమాల భవిష్యత్తు గురించి ప్రార్థనలు చేశారు.

# వై వి సుబ్బారెడ్డి కి సత్కారం



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: ఉమ్మడి కృష్ణ,గుంటూరు జిల్లాల వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వై వి సుబ్బారెడ్డి ని సోమవారం విజయవాడలోని తాడేపల్లి లో వారి నివాసం వద్ద పలువురు నాయకులు,పార్లమెంటు పరిశీలకులు సత్కరించారు. వై వి సుబ్బారెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు,ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్,మాజీ మంత్రి మేరుగ నాగార్జున,మచిలీపట్నం గుంటూరు విజయవాడ పార్లమెంటు పరిశీలకులు జెట్టి గురునాధరావు, పోతన రమేష్,మోదుగుల వేణుగోపాల రెడ్డి, తదితర ప్రతినిధులు పాల్గొన్నారు. వై వి సుబ్బారెడ్డిని సమావేశంలో సత్కరించారని ఏలూరు జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు జంగారెడ్డిగూడెంలో మీడియకు తెలిపారు.

## రాష్ట్రంలో పరిశ్రమల విస్తరణకు

తీసుకెళ్లడం జరుగుతుందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ మన రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడు ఇండస్ట్రియల్ గా హైదరాబాదు, విశాఖపట్నం మాత్రమే అభివృద్ధి చెందటం జరిగిందని అన్నారు. ఒక ప్రాంతం కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, ప్రాంతాలు అభివృద్ధి చెందాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, పారిశ్రామికంగా ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేసి నైపుణ్యం కలిగిన వారికి స్థానికంగా ఉపాధి కల్పించే ఆలోచనతో ఎం ఎస్ ఎం ఈ నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 175 ఎం ఎస్ ఎం ఈ పార్కులు స్థాపించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పదంలో నడిపించే లక్ష్యంతో పెట్టుకుందని అన్నారు. 50 పార్కులకు 11 పార్కులు ప్రారంభించడం జరిగిందని 39 పార్కులకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు జిల్లాలో ఉండి, నరసాపురం నియోజకవర్గం లో పార్కులు రావడం జరిగిందన్నారు. నర్సాపురం మండలం లికితపూడి గ్రామంలో రూ. 13.60, కోట్లతో నిర్మించే ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ 11 ఎకరాలు భూమిలో రెండు ఎకరాలు విడదీసి 26 వేల స్క్వేర్ ఫీట్ లో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ పార్క్ ను దశలవారీగా అభివృద్ధి చేసి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాలను మహిళలు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్కిల్ అభివృద్ధి చేసుకొని అధునాతన టెక్నాలజీతో ఇండస్ట్రియలను డెవలప్ చేసి యువతికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు,ఆర్డిఓ దాసిరాజు, జోనల్ మేనేజర్ కె.బాబ్జి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ జి జ్యోతి, తహసిల్దార్ అయితం సత్యనారాయణ, కోటిపల్లి వెంకటేశ్వరరావు వలవల నాని ఆకన చంద్రశేఖర్ బందెల జక్కం శ్రీమన్నారాయణ రవీంద్ర ఎంపీపీ మైల బత్తుల సోనీ, జడ్పిటిసి బొక్క రాధాకృష్ణ, కొల్లు పెద్ది రాజు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నియోజవర్గం జనసేన టిడిపి బిజెపి నాయకులు జన సైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు హెూమ్ మంత్రి అత్తిలి రాక.

అత్తిలి – మే 12 ( ప్రభాత వార్త ):రాష్ట్ర హెూమ్ శాఖా మంత్రి వంగలపూడి అనిత , తణుకు శాసన సభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ , ఏపీ ఐసీసీ చైర్మన్ మంతెన రామరాజు అత్తిలి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారని అత్తిలి ఎంపిడిఓ పి సామ్యూల్ తెలిపారు. పాలూరు గ్రామములో 10 గంటలనుండి కార్యక్రమాలు ప్రారంభమవు తాయ ని తెలిపారు. అనంత రం అత్తిలి , కే. ఎస్. గట్టు గ్రామములో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

## కాలుష్యనివారణకు చెట్లు నాటండి

అత్తిలి – మే 12 ( ప్రభాత వార్త ): కాలుష్య నివారణకు చెట్లు నాటాలని రిసోర్స్ పర్సన్ కె. కోమలి అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా అత్తిలి శాఖా గ్రంధాలయంలో కాలుష్యకారకాలను వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు. చెట్లు పర్యావరణాన్ని కాపాడతాయని తెలిపారు. రిటైర్డ్ గ్రంథ పాలకుడు గంధం శేష వేంద్రరావు జీవకోటికి అవసరమైన ఆక్సిజెన్ చెట్లనుండి లభిస్తుందని తెలిపారు. గ్రంధాలయాధికారి డి.కృష్ణారావు, వి. లక్ష్మణరావు , ఆర్. దాన కృష్ణ , పి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ చక్ర స్నానం

అత్తిలి – మే 12 ( ప్రభాత వార్త ): అత్తిలి లో గల వేణుగోపాల స్వామి వారి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాలు సందర్భంగా శ్రీ చక్ర స్నానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు

మొగల్తూరు మే 12 (ప్రభాతవార్త) కాళీపట్నం పడమర పంచాయతీలో పల్లవ పాలెం సమీపంలో వెలసి ఉన్న శ్రీ కాళికాంబ సమేత కాళేశ్వర స్వామి వారి ఆలయమునందు సోమవారం భక్తులుపలు గ్రామాలు నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయ అర్చకులు కొత్తలంక మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు మరియు అభిషేకములు నిర్వహించారు కమిటీ వారు భక్తులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా దగ్గరుండి చూసుకున్నారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేశారు

## శ్రీ ఉమా రామేశ్వర స్వామికి పుష్పోత్సవం



పెనుమంట్ర, మే–12, ప్రభాతవార్త: మండలంలోని సత్యవరంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమా రామేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా ఆఖరి రోజైనా సోమవారం ఐదవ రోజు స్వామివారికి నైవేద్యాలు పుష్పోత్సవం మిరియాల వెంకట శ్రీనివాస్ గంగ మసేనమ్మ దంపతులు జరిపారు. అనంతరం భక్తులకు దంపత తాంబూలాలు ఇచ్చారు. అనంతరం ప్రసాద వికరణ చేశారు. అర్చకులు కొండవీటి సాయి ఆధ్వర్యంలో ఈ పూజలు అభిషేకాలను నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కళ్యాణ మహోత్సవాలకు సహకరించిన వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు మిరియాల శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 216 నేషనల్ హైవేపై బొలెరో వాహనం ఢీకొని ఒక వ్యక్తి దుర్మరణం



మొగల్తూరు మే 12 (ప్రభాతవార్త) 216 నేషనల్ హైవేపై దారతిప్ప వెళ్లే రహదారిలో ఏపీ 16 టీ ఎఫ్ 48 35 గల బొలెరో వాహనం తూర్పు గోదావరి జిల్లా అంతర్వేది పల్లవ పాలెం గ్రామస్తుడు కామాడి దుర్గాప్రసాద్ 30 సంవత్సరా లు తండ్రి శ్రీనుదార తిప్ప సమీపంలో బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు బులెరా డ్రైవర్ కం ఓనర్ పులపర్తి సూర్యనారాయణ పరారీలో ఉన్నాడు మొగల్తూర్ పోలీసు వారు సంఘటన స్థలానికి చేరుకుని నర్సాపురం సిఐ జి దుర్గాప్రసాద్ మొగల్తూరు సబ్ ఇన్స్పెక్టర్ వై నాగలక్ష్మి ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు

# కాలినడకన భద్రాచలం పయనం



చాట్రాయి, మే 12, ప్రభాతవార్త : చాట్రాయి మండలం చాట్రాయి శివారు గొల్లగూడెం 15 మంది భక్తులు కాలినడకన భద్రాచలం తరలి వెళ్లారు. ఆ శ్రీరామచంద్రమూర్తి దర్శనం చేసుకునేందుకు ఏడేళ్లుగా ఈ ప్రాంతం నుండి ఎంతోమంది భక్తులు కాలినడకున్నాం భద్రాచలం వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. రామచంద్ర ప్రభు కృప కటాక్షాలు మెండుగా ఉ ంటాయని విశ్వసిస్తున్నట్లు భక్తులు చెప్పారు. ప్రతి ఏటా కాలినడకన తినటం వల్ల మా కుటుంబాలకు మేలు జరిగే సుభిక్షంగా ఉంటున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోగుల నాగు, మైథిలి తదితర భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు తొలగింపు



చాట్రాయి, మే 12, ప్రభాతవార్త : చాట్రాయి నుండి పోలవరం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డులో మర్రిచెట్టు కొమ్మ పడి రాకపోకలకు ఆటంకం జరగటంతో చాట్రాయి ఎస్సై రామకృష్ణ తక్షణమే జెసిబి ని తీసుకువచ్చి చెట్టును తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడటంతో పాటు ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతుందని కొమ్మను తొలగించినట్లు అని చెప్పారు. మండలంలో ఏ రోడ్డులోనైనా ఇటువంటి పరిస్థితి ఏర్పడితే తక్షణమే తమకు తెలియజేయాలని ఆయన కోరారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని సదుద్దేశంతో పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం

చాట్రాయి, మే 12, ప్రభాతవార్త : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం సప్లమెంటరీ పరీక్షలు సోమవారం చాట్రాయి జిల్లా పరిషత్ హై స్కూల్ లో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు సోమవారం మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం జరుగుతుండగా రాసేందుకు 11 మంది రాయాల్సి ఉండగా 9 మంది హాజరైనట్లు ఆయన చెప్పారు. రెండో సంవత్సరం ముగ్గురు విద్యార్థులు హాజరు కావలసి ఉండగా అందరూ హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి వి బ్రహ్మచారి చెప్పారు.

# ముగ్గురు నేరస్తులకు రిమాండ్



చాట్రాయి, మే 12, ప్రభాతవార్త గతములో ఎక్సైజ్ నేరములకు పాల్పడి నేర స్థలము నుండి పారిపోయిన చాట్రాయి మండలం పోతనపల్లి చిన్న తండాకు చెందిన ధారవతు చంటి, పోతనపల్లి పెద్ద తండాకు చెందిన ధారవతు దేవి మరియు చిన్నంపేట గ్రామమునకు చెందిన పరసా నాగేశ్వర రావు అను ముగ్గురిని అదుపులోనికి తీసుకోని రిమాండ్ నిమిత్తం తిరువూరు కోర్టుకు తరలించినట్లు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఏ.మస్తానయ్య తెలిపారు.

## అమెరికాలో టాప్ ర్యాంక్ సాధించిన సింధు



చాట్రాయి, మే 12, ప్రభాతవార్త : చాట్రాయి మండలం చీపురు గూడెం గ్రామానికి చెందిన మందలపు సింధు అమెరికాలో ఎమ్మెస్ చేసేందుకు వెళ్లి టాప్ ర్యాంకు సాధించింది. ఈ మేరకు యూనివర్సిటీ నుండి పట్టా అందుకుంది. చిన్నప్పటినుండి కష్టపడి చదువుతూ మంచి మార్కులు సాధించిన సింధు అన్ని తరగతులలోనూ ప్రథమ స్థానంలో నిలిచింది. దిగ్విజయంగా మంచి మార్కులతో ఎమ్మెస్ పూర్తి చేయడం పట్ల తల్లిదండ్రులు జగదీష్, తాత మందలపు ప్రసాదరావు, చీపురుగూడెం గ్రామంలోని పలువురు అభినందనలు తెలియజేశారు.

## రెడ్ క్రాస్ అవార్డులు అందుకున్న కలెక్టర్ కు రెవిన్యూ సంఘం శుభాకాంక్షలు



పెనుమంట్ర, మే–12, ప్రభాతవార్త: రాష్ట్ర గవర్నర్ చేతులు మీదుగా రాష్ట్ర స్థాయిలో రెండు రెడ్ క్రాస్ సొసైటీ అవార్డులు అందుకున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జకరయ్య సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ కష్టపడి జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని కోరడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షులు రవీంద్ర రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ స్ఫూర్తితో గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ కష్టపడి జిల్లాకి మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భీమవరం డివిజన్ అధ్యక్షులు కెనడి, నరసాపురం డివిజన్ అధ్యక్షులు సత్తిబాబు, అత్తిలి మండల విఆర్ఓ లు రామకృష్ణ, గోపికృష్ణ కుమార్ భీమవరం వీఆర్వోలు ప్రజ్యోతన, పార్వతి ,విజయ, కిరణ్ మై సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయలుకు అభినందనలు



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త :రాష్ట్ర అప్కాబ్ చైర్మన్, డిసిసిబి చైర్మన్ పదవులు పొందిన ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయలు ను చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు, నాయకులతో కలిసి భీమడోలులోని ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయలు చేసిన సేవలను గుర్తించి పార్టీ ఆయనకు ఈ పదవులు ఇచ్చిందని అభినందించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జగ్గవరపు మొత్తారెడ్డి, గుత్తా పెదబాబు జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ ,మండల అధ్యక్షులు సాయిల సత్యనారాయణ, రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు, పరిమి సత్తిపండు, కొంద్రెడ్డి కిషోర్ ,తూటికుంట రాము, పెనుమర్తి రామకుమార్, చెరుకూరి శ్రీధర్, ఆకుమర్తి రామారావు , మహంకాళి రామ్మోహనరావు, కరణం రాంబాబు ,గుమ్మడి ప్రసాద్ ,అల్లూరి రామకృష్ణ , కొఠారి ప్రసాద్ , తాళ్లూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : ఈనెల 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్ టి యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.వి రమణ పిలుపునిచ్చారు. కార్మిక ఉ ద్యోగ రైతు సమస్యలపై 20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్ టి యు,ఏఐకెఎంఎస్ రాష్ట్ర కమిటీలు ముద్రించిన గోడ పత్రికలను సోమవారం ధర్మన భవనం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా కెవి రమణ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు ఈ కార్యక్రమంలో యు.ఏసుబాబు,తీయాలా గణేశ్,బాలిన ధర్మరాజు ,కోట శివకృష్ణ ,డి శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు ఉపాధ్యాయులే

జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం మరో విడత నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది ఎస్ సి కమిషన్ ,ఎస్ టి కమిషన్ ,మహిళా కమిషన్ ప్రెస్ అకాడమీ వంటి 22 కార్పొరేషన్లకు చైర్మన్లు నిర్మించింది. ఈ 22 మంది చైర్మన్లలో ముగ్గురు ఉ పాధ్యాయులు వృత్తి నుండి వచ్చినవారే కావటం విశేషం, రాష్ట్ర మహిళ సహకార ఆర్థిక కార్పొరేషన్ కు చైర్మన్ పర్సన్ గా నియమించబడిన పీతల సుజాత వీరవాసరం మండలంలో ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ గా నియమించిన కేఎస్ జవహర్ కూడా కొవ్వూరు మండలంలో ఉపాధ్యాయునిగా పనిచేశారు.

# విడుదలకు 'దీక్ష' రెడీ

ఆర్ కె ఫిలిమ్స్, సిద్ధ క్రియేషన్స్ బ్యానర్‌లో డా. ప్రతాని రామకృష్ణ గౌడ్, పి.అశోకుమార్ నిర్మాతలుగా, ఆర్ కె గౌడ్ దర్శకత్వంలో కిరణ్, ఆలేఖ్యరెడ్డి హీరో హీరోయిన్స్‌గా ఆక్స ఖాన్, తులసి, అనూష,కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ ప్రధాన పాత్రలలో నటించిన చిత్రందీక్ష. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపు దిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. జూన్ నెలలో సినిమా విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమ వారం చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించ వచ్చు అనే మంచి పాయింట్‌తో ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందించాం. చాలా అందమైన లొకేషన్స్‌లో, చిత్రీకరణ పూర్తి చేసుకున్నాం. అలాగే మైథలాజికల్ ను జోడించి నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరో కిరణ్ భీముడు పాత్రలో అద్భుతమైన నటన కనపరచాడు. మా చిత్రం ద్వారా హీరో కిరణ్‌కి మంచి పేరు, గుర్తింపు వస్తాయి. ఆక్స ఖాన్ స్పెషల్ సాంగ్‌లో, తనదైన శైలిలో డాన్స్ ఆదరగొట్టింది. మా చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో దీక్షతో పనిచేసారు. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ అద్భుతమైన 5 పాటలు అందించారు. మధుప్రియ తదితర ముఖ్య గాయనీ గాయకులు తమ స్వరాన్ని అందించారు. ఆర్ ఆర్ ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. ఈ చిత్రంలో 5ఫైట్స్ ఉన్నాయి. రోహిత్ శర్మను విలన్ క్యారెక్టర్‌తో ఇంట్రడ్యూస్ చేస్తున్నాము.



అలాగే ఈ చిత్రంలో నటించిన నటీనటులందరికీ, సాంకేతిక నిపుణులందరికీ మంచి పేరు తీసుకొస్తుంది. మా బ్యానర్‌లో రాబోతున్న 41వ చిత్రమిది. చాలా పట్టుదలతో తీశాం. ప్రేక్షకుల సపోర్ట్ మాకు అందుతుందని భావిస్తున్నాం. దీని తర్వాత కబడ్డీ అనే చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఏడాదికి కనీసం రెండు సినిమాలైనా చేయాలని ప్లాన్ చేస్తున్నాం అని చెప్పారు. హీరో కిరణ్ మాట్లాడుతూ, ఆర్‌కే గౌడ్ ఎంతోమంది కొత్త నటీనటులను ఎంకరేజ్ చేశారు. అందులో నేను కూడా ఉండటం అదృష్టంగా భావిస్తున్నా. ఆయన డైరెక్షన్‌లో హీరోగా నటించడం చాలా హ్యాపీగా ఫీలవుతున్నాను. ఇందులో నటించిన నటీనటులు, టెక్నీషియన్స్ అందరూ చాలా ప్యాషనేట్‌గా వర్క్‌గా చేశారు. దీక్ష టైటిల్‌కు తగ్గట్టే.. అందరూ చాలా కష్టపడ్డారు. దీంతో పాటు తర్వాతి సినిమాలోనూ నాకు అవకాశం ఇచ్చిన రామకృష్ణ గౌడ్‌కి ధన్యవాదాలుఅని అన్నారు. నటి ఆక్స ఖాన్ మాట్లాడుతూ, నా కెరీర్ స్టార్టింగ్ నుంచి నాకు సపోర్ట్‌గా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ఇందులో మంచి పాత్రను పోషించాను. హీరో కిరణ్‌తో పాటు నా తోటి నటీనటులందరూ బాగా నటించారు.

# నందమూరి హరికృష్ణ మనవడు గ్రాండ్ ఎంట్రీ

తెలుగు చిత్రసీమలో విశిష్టమైన నందమూరి వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ, లెజెండరీ శ్రీ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, దివంగత శ్రీ జానకిరామ్ తనయుడు యంగ్ చాప్ నందమూరి తారక రామారావు ఫిలిమ్స్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నారు. డైనమిక్ డైరెక్టర్ వైవిఎస్ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌ని న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మించనున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన నందమూరి తారక రామా రావు ఫస్ట్ దర్శన్‌కి వరల్డ్ వైడ్ ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ద్వారా ప్రతిభావంతులైన కూచిపూడి డ్యాన్సర్, తెలుగు అమ్మాయి వీణారావు కథానాయికగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా గ్రాండ్ ముహూర్తం షూట్ హైదరాబాదులోని ఎన్టీఆర్ ఘాట్‌లో వైభవంగా జరిగింది. ప్రారంభోత్సవ వేడుకకు శ్రీమతి గారపాటి లోకేశ్వరి, శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి, శ్రీమతి నారా భువనేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి హీరో హీరోయిన్లపై నారా భువనేశ్వరి క్లాప్ కొట్టారు. దగ్గుబాటి పురందేశ్వరి కెమెరా స్విచాన్ చేశారు. లోకేశ్వరి గౌరవ దర్శకత్వం వహించగా, నందమూరి సుహాసిని, నందమూరి మోహన్ రూప, శ్రీమంతిని, నందమూరి వసుందర బాలకృష్ణ, దగ్గుబాటి నివేదిత, నందమూరి దీపిక, చలసాని చాము, నందమూరి జయశ్రీ, నందమూరి లక్ష్మీ హరి కృష్ణ, కంటమెన్ని దీక్షిత స్క్రిప్ట్‌ని అందించారు. నందమూరి మోహన్ కృష్ణ డీవోపీ చేశారు. నందమూరి కుటుంబ సభ్యులతో పాటు ఇండస్ట్రీ ప్రముఖులు పాల్గొన్న ఈ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ముహూర్తం షాట్‌లో ఈవెంట్‌లో గారపాటి లోకేశ్వరి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. నాన్న ఆయనకు ఆయనే సాటి అని నిరూపించుకున్న మహా మనిషి. ఆయన లెగసీని ముందుకు తీసుకువెళ్లడానికి ఆయన కుమారులు, మనవళ్లు ఎంతో కృషి చేస్తున్నారు. వారంతా కూడా స్టార్‌లుగా దూసుకెల్తున్నారు. ఇప్పుడుఆయన మునిమనవడు ఇండస్ట్రీలోకి వస్తున్నారు. మీ అందరి ప్రోత్సాహం అతడికి చాలా అవసరం. అందరూ తారక రామారావును ఆశీర్వ దించాలని కోరుకుంటున్నాను. అతన్ని పరిచయం చేస్తున్న వైవీఎస్ చౌదరికి, గీతకి థాంక్యూ అన్నారు. దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈరోజు నందమూరి కుటుంబం నుంచి మరో తరం తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టింది. కళాకారుడు ఎంతో తపస్సు చేయాలి. కళామతల్లి ఆశీర్వాదం ఉంటే ఉన్నతశిఖరాలు అధిరోహిస్తాడు. మా నాన్న ఒక కళాతపస్వీ. ఆయన క్రమశిక్షణతో చలనచిత్ర రంగానికి తన జీవితాన్ని అంకితం చేశారు. అందుకే ఆయన పేరును భారతీయ సినీ రంగంలో సువర్ణాక్షరాలతో లిఖించారు. తర్వాత బాలకృష్ణ, హరికృష్ణ ఇద్దరూ కూడా చలనచిత్ర రంగంపై చెదరని ముద్ర వేశారు. ఆ తర్వాత తరం నందమూరి కల్యాణ్‌రామ్, నందమూరి తారకరామారావు కూడా అంకితభావంతో తమ ఉనికికి చాటుకున్నారు. అలానే ఇప్పుడు మరో తరం పరిశ్రమలోకి వస్తోంది. మేమంతా రామ్ అని పిలుచుకునే ఎన్టీఆర్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్నాడు.



# 23న 'వైభవం'

నూతన నిర్మాణ సంస్థ రమాదేవి ప్రొడక్షన్స్ ద్వారా రూపొందుతున్న వైభవం చిత్రం మే 23, 2025న థియేటర్లలో విడుదలకు సిద్ధమయ్యింది. రుత్విక్, ఇక్రా ఇద్రిసి హీరో హీరోయిన్లుగా పరిచయం కానున్న ఈ చిత్రంలో ఒక ప్రత్యేక కాస్టింగ్ కాల్ ద్వారా ఎంపిక చేయబడిన ఎంతో మంది ప్రతిభావంతులైన నటులు ఇతర పాత్రల్లో కనిపిస్తారు. ఇటీవలే సెన్సార్ పనులు పూర్తి చేసుకున్నఈ ఫీల్ గుడ్ కామెడీ ఎంటర్టైనర్‌కు సెన్సార్ బోర్డ్ నుండి ఇటీవల కాలంలో అరుదైపోయిన క్లీన్ యు సర్టిఫికెట్ లభించింది.



ఇదివరకే విడుదలైన రెండుపాటలకీ ప్రేక్షలుల నుండి విశేషస్పందన లభించిందని మేకర్స్ ఆనందాన్ని వ్యక్తంచేశారు. మంచి సినిమాలని ఆదరిచడంలో తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారన్న సంగతి మరోసారి ఈ చిత్రంతో నిరూపితమవుతుందని దర్శకుడు సాత్విక్ తెలిపారు.

# తెలుగులోకి రావడం నా డ్రీమ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ హీరోలుగా నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం. విజయ్ కనకమేడల దర్శకత్వంలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్ అధినేత డా. జయంతి లాల్ గడా సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా అదితి శంకర్, ఆనంది, దివ్యా పిళ్ళై నటిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై భారీ బజ్ క్రియేట్ చేశాయి. భైరవం ఈ సమ్మర్ బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌గా మే 30న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అదితి శంకర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. **ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?** నేను తమిళ్‌లో చేసిన తొలి సినిమాని డైరెక్టర్ విజయ్ చూశారు. భైరవంలో క్యారెక్టర్‌కు నేనైతే యాప్ట్‌గా ఉంటుందని భావించారు. ఆయన కాల్ చేసి ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు. అలా ఈ ప్రాజెక్టులోకి రావడం జరిగింది. **ఇది మీ ఫస్ట్ తెలుగు సినిమా కదా... ఎలాంటి ఛాలెంజెస్ ని ఎదుర్కొన్నారు?** లాంగ్వేజ్ పరంగా ఒక బ్యారియర్ ఉంటుందని ముందుగా భావించాను. అయితే మా డైరెక్టర్, రైటర్ సత్య చాలా హెల్ప్ చేశారు. వారి హెల్ప్‌తో ఈ జర్నీ చాలా స్మూత్‌గా జరిగింది. **ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?** ఇందులో బోల్డ్ అండ్ హానెస్ట్, అదే సమయంలో బబ్లీగా ఉండే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. ఇది నా ఒరిజినల్ క్యారెక్టర్‌కి దగ్గరగానే ఉంటుంది. **నిరూపించుకోవడానికి ఎలాంటి ఛాలెంజ్ ఎదుర్కొంటారు?** రియల్లీ ఇది నైస్ ఛాలెంజ్. నాన్న ఇమేజ్‌ని ఒక గౌరవంగానే భావిస్తాను కానీ అది ఎప్పుడూ ఒత్తిడిగా తీసుకోను. **ఇది మల్టీ స్టార్ సినిమా కదా.. ముగ్గురు హీరోలతో మీ జర్నీ ఎలా ఉండేది?** ఇది రియల్లీ వెరీ ఫన్ ఎక్స్పీరియన్స్. మనోజ్ నాకు తెలుసు. ఆయన నన్ను సెట్‌లో చూసి ఇక్కడ ఏం చేస్తున్నావ్ అని అడిగారు. తర్వాత ఈ సినిమాలోని నటిస్తున్నానని చెప్పాను. అది రియల్లీ ఫన్ మూమెంట్. **మ్యూజిక్ గురించి?** శ్రీ చరణ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఇప్పటికే రిలీజ్ అయిన సాంగ్స్‌కి అద్భుతంగా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఆ పాట కూడా చాలా వండర్ఫుల్‌గా ఉండబోతుంది. **మీరు తెలుగు సినిమాలు చూస్తుంటారా? మీ ఫేవరేట్ మూవీ?** చూస్తాను. నా ఫేవరెట్ మూవీ మగధీర. ఎందుకంటే నేను ఫస్ట్ థియేటర్లో చూసిన తెలుగు సినిమా అది. అలా రాజమౌళికి రామ్ చరణ్‌కి నేను బిగ్ ఫ్యాన్‌గా మారిపోయాను.



# 'భైరవం' నుంచి 'డుమ్ డుమారే' విడుదల

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ హీరోలుగా నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం ఈ సమ్మర్ బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌గా మే 30న థియేటర్లలో విడుదల కానుంది. విజయ్ కనకమేడల దర్శకత్వంలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్ అధినేత డా. జయంతిలాల్ గడా సమర్పిస్తున్నారు. శ్రీ చరణ్ పాకాల సంగీతం ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది, విడుదలైన తొలి రెండు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. తాజాగా మేకర్స్ మూడవ సింగిల్ డుమ్ డుమారేని విడుదల చేశారు, ఇది స్నేహానికి అంకితంగాఉన్న ఒక వైబ్రెంట్ సాంగ్. కలర్ ఫుల్ కార్నివల్ నేపథ్యాన్ని కళ్లకు కట్టించిన ఈ సాంగ్, చిత్రంలో ముగ్గురు హీరోల మధ్య ఉన్న స్నేహాన్ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. శ్రీ చరణ్ పాకాల లైవ్లీ బీట్‌లతో కూడిన సంగీతాన్ని అందించగా, మధురమైన ఇంటర్ల్యూడ్‌తో భావోద్వేగాన్ని మేళవించారు. లిరిక్ రైటర్ భాస్కరభట్ల స్నేహం యొక్క గొప్పతనాన్ని అద్భుతంగా రాయగా, గాయకులు రేవంత్, సాహితి చాగంటి తమ పవర్ ఫుల్ వోకల్స్‌తో ఆలపించారు. గణేష్ మాస్టర్ కొరియోగ్రఫీ ఆకట్టుకునే విధంగా వుంది. బెల్లంకొండ శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ, స్నేహబంధం, పాటని మరింత అద్భుతంగా మార్చింది. డుమ్ డుమారే పాట కేవలం మ్యూజిక్ మాత్రమే కాదు, నిజమైన ఫ్రెండ్షిప్‌ని సెలబ్రేట్ చేసుకునే ఓ వేడుక. ఇది బిగ్ స్క్రీన్‌పై మరింత ఇంపాక్ట్ ఫుల్‌గా వుండబోతోంది. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా అదితి శంకర్, ఆనంది, దివ్యా పిళ్ళై నటిస్తున్నారు. హరి కె వేదాంతం సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బ్రహ్మ కడాలి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. సత్యర్షి, తూమ్ వెంకట్ డైలాగ్ రైటర్స్.

నటీనటులు:బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్, ఆదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్ళై, సాంకేతిక బృందం: కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: విజయ్ కనకమేడల, నిర్మాత: కెకె రాధామోహన్, సమర్పణ: డా.జయంతిలాల్ గడా (పెన్ స్టూడియోస్) సినిమాటోగ్రఫీ: హరి కె వేదాంతం.



# 'శుభం'కు అద్భుతమైన స్పందన..

ప్రముఖ నటి, నిర్మాత సమంత రుత్‌ప్రభు నిర్మాణంలో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై రూపొందించిన తొలి చిత్రం శుభం. మే9న ఈ ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమాకు ప్రీమియర్స్ నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. తొలిరోజున సినిమాకు ప్రేక్షకుల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. తొలి రోజున రూ.1.5 కోట్లు గ్రాస్ కలెక్షన్స్‌ను సినిమా రాబట్టింది. రెండో రోజున కూడా అదే రెస్పాన్స్‌ను రాబట్టుకుంటుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ విజయవాడలో కొన్ని థియేటర్స్‌ను సందర్శించింది. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియా కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండెపూడి, వంశీధర్ గౌడ్, డైరెక్టర్ ప్రవీణ్ కండ్రేగుల తదితరులు ఇన్‌స్టా లైవ్ ద్వారా ప్రేక్షకులను పలకరించారు. సినిమాను ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రేక్షకులకు చిత్ర యూనిట్ ధన్యవాదాలను తెలియజేసింది. సినిమా నిర్మాతగానే కాకుండా, గెస్ట్ రోల్ పోషించిన సమంత ఎంటైర్ టీమ్ సాధించిన విజయం పట్ల గర్వంగా ఉన్నట్లు తెలియజేశారు. చిత్ర యూనిట్ అంతా ప్రతిభావంతులుగా, బహుముఖ ప్రజ్ఞాశాలురని సమంత పేర్కొన్నారు. చిత్ర యూనిట్‌లోని నటీనటుల చక్కటి నటన, డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన శుభం సినిమా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అందరినీ అలరిస్తోంది. రచన, దర్శకత్వం చక్కగా ఉందని అందరూ అప్రిషియేట్ చేస్తున్నారు. ఈ క్రమంలో చిత్ర యూనిట్ ఇన్‌స్టా లైవ్‌లోకి వచ్చినప్పుడు ప్రేక్షకులు సినిమాకు సీక్వెల్ ఉంటుందా? అని ప్రశ్నించారు. దానికి సమంత స్పందిస్తూ అవునని బదులివ్వటం ద్వారా భవిష్యత్తులో శుభం2 సినిమా ఉంటుందని తెలియజేశారు. శుభం సినిమాలో శ్రావణి తన భర్త పాత్రలో నటించిన శ్రీనివాస్ గవిరెడ్డిని రిమోట్ కావాలనే సన్నివేశం తనకెంతో ఇష్టమని సమంత తెలియజేసింది. ఈ సీన్‌కు ఎంతో కనెక్ట్ అయిన ప్రేక్షకుల నుంచి చాలా మంచి స్పందన వచ్చింది. ఈ క్రమంలో సమంత సినిమాలో నటించిన నటీనటులకు... ఏదో సాధించాలనే వారిలో తపన, ఏదో నేర్చుకోవాలనే వారి మనస్తత్వాలను అలాగే కొనసాగించాలంటూ సమంత సలహా నిచ్చారు. సినిమాలో తను చేసిన గెస్ట్ అప్పియ రెన్స్‌లో నటించటంపై సమంత స్పందిస్తూ 'నేను క్యామియో చేయాలని ముందుగా అనుకోలేదు. షూటింగ్ ముందు రోజు కూడా చేయననిచెప్పాను. అయితే ఇప్పుడు ఆ సన్నివేశంలో నటించటంపై చాలా ఆనందంగా ఉంది' అన్నారు. ఇన్‌స్టా లైవ్ చివరలో శుభం మూవీలో మరిడేష్ పాత్రలో నటించిన నటుడు రాగ్ మయూర్ కనిపించారు. తనకంటే సినిమా బండిలో మరిడేష్ బాబు పాత్రలో నటించిన మెప్పించిన రాగ్ మయూర్ ఎంట్రీకే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుందని సమంత ఈ సందర్భంగా పేర్కొన్నారు.






# ఆర్‌ఎస్ నాయుడు సర్వైవల్ యాక్షన్ డ్రామా

కంటెంట్ బేస్డ్ సినిమాలు, భారీ స్థాయిలో మాస్ ఎంటర్టైనర్లు రూపొందించడంలో ప్రత్యేకత కలిగిన క్రేజీ పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నవదళపతి సుధీర్ బాబు హీరోగా తమ 51వ ప్రొడక్షన్‌ను అనౌన్స్ చేసింది. ఈ చిత్రానికి ఆర్‌ఎస్ నాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. పిఎంఎఫ్ఎక్స్ఎస్ చిత్రాన్ని విజినరీ నిర్మాతలు టిజి విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. వైవిద్యమైన పాత్రలను ఎంచుకోవడంలో మంచి పేరు తెచ్చుకున్న సుధీర్ బాబు, ప్రతిసారి కొత్తదనం కోసం వినూత్నమైన కథలను ఎంచుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు అదే ధోరణిలో ఈ కొత్త ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సినిమా అధికారికంగా సుధీర్ బాబు పుట్టినరోజు సందర్భంగా అనౌన్స్ చేశారు. అనౌన్స్మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ఇందులో సుధీర్ బాబు షర్ట్ లెస్‌గా, సాలిడ్ ఫిజిక్‌తో ఇంటెన్స్ లుక్‌లో కనిపించారు. మెట్లపై మృతదేహాలు పడిపోతుండగా, ఆయన ఒక చేతిలో ఆయుధాన్ని పట్టుకుని పైకెత్తుతూ కనిపించడం చాలా క్యూరియాసిటీని పెంచింది. పిఎంఎఫ్ఎక్స్ఎస్ సర్వైవల్ థ్రిల్లర్‌గా రూపొందించబడుతోంది. పోస్టర్‌లోనే ఉత్కంఠను పెంచుతూ, ఇంటెన్స్ మూడ్‌ను సెట్ చేసింది. ఈపాత్ర కోసం మరోసారి సుధీర్ బాబు తన ఫిజిక్‌ని మేకోవర్ చేస్తూ, కండలు తిరిగిన మాచో లుక్‌లో మారిపోయారు. బలమైన యాక్షన్ పాత్ర కోసం ఆయన బీస్ట్ మోడ్‌లోకి వెళ్ళారు. మిగిలిన నటీనటులు, టెక్నీషియన్స్ డీటెయిల్స్ మేకర్స్ త్వరలో తెలియజేస్తారు. తారాగణం: నవదళపతి సుధీర్ బాబు.



# 'ఫ్రైడే' నుంచి సాంగ్ రిలీజ్

దియా రాజ్, ఇనయ సుల్తానా, రిహానా, వికాస్ వశిష్ట, రోహిత్ బొడ్డపాటి హీరో హీరోయిన్స్‌గా నటించిన చిత్రం ఫ్రైడే. ఈచిత్రాన్ని శ్రీ గణేష్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ మీద కేసనకుర్తి శ్రీనివాస్ నిర్మించారు. ఈ సినిమాను డిఫరెంట్ సస్పెన్స్ థ్రిల్లర్ కథతో ఈశ్వర్ బాబు ధూళిపూడి తెరకెక్కించారు. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఫ్రై డే నుంచి వచ్చిన పోస్టర్లు సినిమా మీద అంచనాల్ని పెంచేసాయి. తాజాగా మదర్స్ డే సందర్భంగా అమ్మ ప్రేమను చాటే పాటను రిలీజ్ చేశారు. అమ్మ అంటూ సాగే ఈ పాటను ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత రిలీజ్ చేశారు. అనంతరం ఈ పాటను చూసి చిత్రయూనిట్‌ను అభినందించారు. అమ్మ ప్రేమను చాటి చెప్పేలా ఎంతో అందంగా పాటను చిత్రీకరించారని ప్రశంసించారు. చిత్రయూనిట్ కు ఆమె ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ పాటను స్నిగ్ధ నయని ఆలపించారు. మధు కిరణ్ సాహిత్యం ప్రతీ ఒక్కరి మనసుల్ని కదిలించేలా ఉంది. ప్రజ్వల్ క్రిష్ బాణీ ప్రతీ ఒక్కరి హృదయాన్ని తాకేలా ఉంది. ప్రస్తుతం ఈ పాట మదర్స్ డే స్పెషల్‌గా నెట్టింట్లో వైరల్ అయ్యేలా ఉంది. సాంగ్ లాంచ్ అనంతరం నిర్మాత కేసనకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, డైరెక్టర్ ఈశ్వర్ బాబు వల్లే ఈ ఫ్రై డే చిత్రాన్ని నిర్మించాను. ఆయన చెప్పిన కథ నాకు చాలా కనెక్ట్ అయింది. నేను ఎదిగి ప్రయోజకుడ్ని అయ్యే టైంకి మా అమ్మ గారు చనిపోయారు. నా ఎదుగుదలను మా అమ్మ చూడలేదు. ఇక ఈశ్వర్ చెప్పిన కథ నా మనసుకు తాకింది. మదర్స్ డే సందర్భంగా అమ్మ పాటను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది అని అన్నారు. డైరెక్టర్ ఈశ్వర్ బాబు మాట్లాడుతూ, ఫ్రై డే సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ప్రస్తుతం జరుగుతున్నాయి. పహల్గాం అటాక్ తరువాత నా మనసు కదిలిపోయింది. నాకు సామాజిక బాధ్యత ఉంది. గతంలో నేను గాడ్సే మీద సినిమా తీశాను. ఈ ఫ్రై డే చిత్రంలో మదర్ సెంటిమెంట్ ఎక్కువగా ఉంటుంది. మదర్స్ డే సందర్భంగా అమ్మ పాటను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. మా సినిమాను చూసిన తరువాత ప్రతీ తల్లి తన కొడుకుని ఓ ఛత్రపతి శివాజీలా, మహా రాణా ప్రతాప్ సింగ్‌లా పెంచుతారు. పోరాడే శక్తిని అమ్మ మాత్రమే ఇస్తుంది అని అన్నారు. హీరో రోహిత్ మాట్లాడుతూ, స్నిగ్ధ పాడిన అమ్మ పాట నన్ను కదిలించింది. ఈ కథను ఈశ్వర్ చెప్పినప్పుడు కాస్త షాక్ అయ్యాను. ఈ మూవీలో ప్రతీ సీన్ ఎంగేజింగ్‌గా ఉంటుంది. అమ్మలం దరికీ హ్యాపీ మదర్స్ డే. చిన్నప్పటి నుంచీ నా ప్రతీ అడుగులో మా అమ్మ తోడుగా ఉండేవారు అని అన్నారు. దియా రాజ్ మాట్లాడుతూ, స్నిగ్ధ ప్రాణం పెట్టి అమ్మ పాటను అద్భుతంగా పాడింది. నాకు ఈ చిత్రంలో ఇంత మంచి పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. మా అందరినీ కెమెరామెన్ అందంగా చూపించారు. నాకు ఈ చిత్రంలో సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్ అని అన్నారు. రిహాన మాట్లాడుతూ, ఫ్రై డే సినిమా గురించి ఇప్పుడే ఎక్కువగా చెప్పలేను. స్నిగ్ధ పాడిన అమ్మ పాట అందరినీ కదిలిస్తుంది. నాకు ఈ చిత్రంతో మంచి టీం దొరికింది.



# వేసవి సమస్యలకు చెక్..



చెమట, డీ హైడ్రేషన్.. వేసవిలో ఈ సమస్యలు తప్పవు. ఇక వీటికి తోడు ట్యాన్, సన్‌బర్న్, చెమట కాయలు.. ఇలాంటి సమస్యల జాబితాకు అంతుండదు. మరి వీటికి పరిష్కారం.

**కలబందతో..** సమస్య ఉన్న ప్రాంతంలో కలబంద గుజ్జుని నేరుగా అప్లై చేసి 15 నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వాలి. తర్వాత రోజ్‌వాటర్‌తో కాసేపు మృదువుగా రుద్దుకోవాలి. అనంతరం చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజుకి రెండుసార్లు చొప్పున వారం రోజులపాటు క్రమం తప్పకుండా చేయడం ద్వారా చెమటకాయలు, సన్‌బర్న్.. వంటివి సునాయాసంగా తగ్గుముఖం పడతాయి. అలాగే ట్యానింగ్ సమస్య నుంచి కూడా విముక్తి లభిస్తుంది.

**టీ ట్రీ ఆయిల్‌తో...** వేసవిలో తలెత్తే చర్మ సంబంధిత సమస్యలు తగ్గుముఖం పట్టేందుకు సమర్థంగా ఉపకరించే వాటిలో టీ న్ట్రీ ఆయిల్ కూడా ఒకటి. చెమటకాయలు ఎక్కువగా వచ్చి ఎర్రగా మారినప్పుడు, మంట, దురద వంటివి అధికంగా ఉన్నప్పుడు టీ ట్రీ ఆయిల్‌లో ముంచిన దూదితో వాటిపై మృదువుగా అద్దుకోవడం వల్ల కాస్త ఉపశమనం లభించే అవకాశాలుంటాయి. అలాగే దీనిని ఉపయోగించడం ద్వారా సన్బర్న్, ట్యానింగ్.. వంటి సమస్యల నుంచి కూడా ఉపశమనం పొందచ్చు.

**ఈ ప్యాక్‌లు కూడా..**

★. సమస్య ఉన్న ప్రాంతంలో తేనె రాసి కాసేపు ఆరనిచ్చి శుభ్రం చేసుకోవాలి.

★. గుప్పెడు వేపాకులు తీసుకొని తగినన్ని నీళ్ల జత చేసి మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమన్నా సమస్య ఉన్న ప్రాంతంలో అప్లై చేసి కాసేపు ఆరనిచ్చి చల్లని నీటితో శుభ్రం చేయాలి.

★ రోజ్‌వాటర్‌లో ముంచిన దూదితో సమస్య ఉన్న ప్రాంతంలో రోజుకి 2 లేదా 3 సార్లు మృదువుగా రుద్దుకోవాలి.

★. పుచ్చకాయ గుజ్జు లేదా రసాన్ని సమస్య ఉన్న ప్రాంతంలో అప్లై చేసి కాసేపు ఆరనిచ్చి తర్వాత నీటితో శుభ్రం చేసుకోవాలి.

★. కర్పూరాన్ని పౌడర్‌గా చేసి అందులో కాస్త వేప ఆకు వేసి బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రాన్ని సమస్య ఉన్న ప్రాంతంలో అప్లై చేసి 3 నుంచి 5 నిమిషాల పాటు ఆరనిచ్చి తర్వాత కడిగేసుకోవాలి.



ఈ చిట్కాలన్నీ వేసవిలో ఎదురయ్యే చర్మ సంబంధిత సమస్యలకు సులభంగా చెక్ పెట్టడమే కాదు.. చర్మాన్ని తాజాగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. ఎండాకాలంలో ఈ చిట్కాలు పాటించడంతో పాటు వీలైనంత ఎక్కువ మొత్తంలో నీళ్లు తాగడం ద్వారా డీహైడ్రేషన్ సమస్య నుంచి కూడా విముక్తి పొందచ్చు. చర్మం తాజాగా, ఆరోగ్యంగా మెరిసేలా చేయచ్చు.

# వేల పెళ్లి సంబంధాలు కుదిర్చి..



'పెళ్లిళ్లు స్వర్గంలో నిశ్చయమవుతాయంటారు.. వాటిని ఈ భూమ్మీద నా చేతులతో జరిపించే బాధ్యతను ఆ దేవుడు నాకు అప్పగించడం గొప్ప వరం!' అని చెప్పారు డాక్టర్ ప్రియా షా. గత 34 ఏళ్లుగా మ్యాట్రిమోనీ సేవలందిస్తున్న ఆమె.. ఇప్పటి వరకు సుమారు 12 వేలకు పైగా వివాహాలు వారిలో సామాన్యులే కాదు.. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. ఈ దేశంలోనే అత్యుత్తమ మ్యాచ్‌మేకర్‌గా గుర్తింపు పొందిన ప్రియ.. ప్రపంచవ్యాప్తంగా జంటల్ని వివాహంతో ఒక్కటి చేసారు. ఇప్పుడు వారంతా పిల్ల పాపలతో సుఖంగా జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. 'పెళ్లనేది రెండు మనసుల్ని ముడివేసే వేడుకే కాదు. కుటుంబాలను ఏకం చేసే అద్భుత క్రతువు' అంటూ ఈతరం జంటలకు వివాహం వివరిస్తున్న ప్రియ.. అసలు ఈ రంగంలోకి ఎలా వచ్చారో తెలుసుకుందాం ...

**ఆ స్వేచ్ఛ నివ్వాలని...!** ప్రియది ముంబయిలో స్థిరపడిన గుజరాతీ కుటుంబం. ఆ రోజుల్లో వాళ్ల కుటుంబంలో అమ్మాయిలకు చిన్న వయసులోనే పెళ్లి చేసేవారట! ఒకవేళ పైచదువులు చదవాలన్నా అత్తమామలు, భర్త ఇష్టంతో పెళ్లయ్యాక చదువుకునేలా కట్టుబాట్లు ఉండేవట! ప్రియ కూడా ఇలాంటి ఆంక్షల మధ్యే పెరిగారు. ఇరవయ్యేళ్లు నిండక ముందే వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. అది కూడా తన తల్లిదండ్రులు చూసి నిశ్చయించిన సంబంధమే! ఎందుకంటే ఆ రోజుల్లో అమ్మాయిలకు తనకు నచ్చిన వరుడిని ఎంచుకునే స్వేచ్ఛ కూడా లేదు. కానీ అదృష్టవశాత్తూ ప్రియను పువ్వుల్లో పెట్టి చూసుకునే భర్త దొరకడంతో ఆమె జీవితం సంతోషమయమైంది. నేను అదృష్టవంతురాలినో లేదంటే మా అమ్మానాన్నలే నాకు తగిన సంబంధం ఊరు నాకు తెలియదు కానీ.. నా వైవాహిక జీవితం సక్సెసైంది. అలాగని అందరమ్మాయిలకూ ఈ అదృష్టం ఉండచ్చు.. ఉండక పోవచ్చు. కొన్నిసార్లు తల్లిదండ్రులు తెచ్చిన సంబంధమైనా విఫలమవ్వవచ్చు.. లేదంటే అమ్మాయికి అబ్బాయి నచ్చకపోవచ్చు. అయితే అబ్బాయిలకు ఎలాగైతే తమకు నచ్చే, నప్పే భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉందో.. అమ్మాయిలకు ఈ స్వేచ్ఛను అందించాలనిపించింది. అప్పుడే వివాహ బంధం సంతోషమయం, శాశ్వతమవుతుంది: ఈ ఆలోచనే 1991లో 'ప్రియా షా ది మ్యాచ్ మేకర్ పేరుతో మ్యారేజ్ బ్యూరో ప్రారంభించేలా చేసింది..అని అంటున్నారు ప్రియ.

**మూడు తరాల గురించి తెలుసుకున్నాకే..!**

అమెరికాలో 'మ్యారేజ్ కన్సల్టెన్సీ' వేదిక ఏ, పీహెచ్‌ఏ పూర్తిచేసిన ప్రియ.. పరిచయం ద్వారా ప్రతి ఒక్కరికీ అన్ని విధాలా తగిన సంబంధం చూడాలన్న పెట్టుకున్నారు. ఈ ఆశిస్తున్న జీవిత భాగస్వామి కోసం వెతుకుతున్న జంటలు, వారి కోసం ప్రత్యేక పరిచయ వేదికలను ఏర్పాటు చేయడం మొదలు.. ప్రేమ వివాహాలను అంగీకారంతో జరిపించేలా వారి కోసం ప్రత్యేక కౌన్సెలింగ్ సెషన్స్ నిర్వహించారు. మ్యారేజెస్సీ.. లవ్ కవ్అరేంజ్డ్ మ్యారేజెస్‌గా మార్చేవారు. పెళ్లంటే చేసుకోబోయే మనసులు కలిస్తే సరిపోదు.. వాళ్ల కుటుంబాలు దగ్గిర మా వివాహ వేదికలు ఉపయోగపడుతున్నాయి. అంతేకాదు.. ఆ తమకు వియ్యమందే వారి కుటుంబ నేపథ్యం గురించి తెలుసుకోవాలన్న ఆరాటం ఉంటుంది. నల్లగా ఉన్నామని.. అందుకే తమకు పెళ్లి కావట్లేదంటూ నా దగ్గర పెళ్లిళ్లు స్వర్గంలో నిశ్చయమవుతాయంటారు పెద్దలు దీన్ని నేను బలంగా నమ్ముతాను. మన కోసం మనకు అన్ని విధాలా సరిపోయే భాగస్వామి కచ్చితంగా ఎక్కడో ఓ చోట ఉంటారన్నది నా విశ్వాసం! వాళ్లకూ ఇదే చెప్తా. అలాంటి వారందరినీ ఒక దగ్గరికి చేర్చి వివాహ పరిచయ వేదికను ఏర్పాటుచేస్తాం. ఈ జన్మలో నాకు పెళ్లే కాదన్న నిరాశలో ఉన్నవారెందరో మా వివాహ పరిచయ వేదికల ద్వారా సంబంధాలు కుదిరి ఇప్పుడు సంతోషంగా వైవాహిక జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. అన్నట్లు.. నేను వరకట్నానికీ వ్యతిరేకిని. అందుకే నేను కుదిర్చే సంబంధాలలో కట్నానికి ప్రాధాన్యమివ్వను. డబ్బు కంటే వ్యక్తుల మధ్య గౌరవమర్యాదలే అనుబంధాల్ని శాశ్వతం చేస్తాయని నా నమ్మకం'! అంటే తన సేవల గురించి చెబుతున్నారామె.



**వేల జంటల్ని ఒక్కటి చేసి..!** తన 34 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో సామాన్యుల దగ్గర్నుంచి సెలబ్రిటీల వరకు.. స్వదేశీయులు మొదలు విదేశీయుల దాకా ఎంతోమందికి తగిన సంబంధాలు చూసి పెళ్లిళ్ల చేశారు ప్రియ. వీరిలో పలువురు బాలీవుడ్ ప్రముఖులే కాదు.. డాక్టర్లు, ఇంజినీర్లు, ఎంబీఏ పట్టభద్రులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్టులు, వ్యాపారవేత్తలూ ఉన్నారు. ఇలా ఇప్పటివరకు తన వివాహ పరిచయ వేదిక ద్వారా దేశవిదేశాల్లో ప్రియ సుమారు 12 వేలకు పైగా పెళ్లిళ్లు చేశారట. ఇక వధూవరులకు నచ్చిన, నప్పిన సంబంధాలు చూసి పెళ్లిళ్లు చేసి చేతులు దులుపుకోవట్లేదామె.. వారికి పెళ్లికి ముందు కౌన్సెలింగ్ ఇవ్వడం, పెళ్లి తర్వాత అనుబంధం దృఢమవ్వాలంటే పాటించాల్సిన చిట్కాలు, గొడవల ,అపార్థాలిస్తే వాటిని పరిష్కరించడం.. ఇలా ఆయా జంటలకు కమిట్మెంట్ పాఠాలూ నేర్పుతున్నారు ప్రియ. అందుకే తాను జరిపిన వివాహాల్లో దాదాపు అన్నీ విజయవంతమైనవే అంటారామె. ప్రస్తుతం వారంతా హాయిగా కాపురం చేసుకుంటూ పిల్లపాపలతో సంతోషంగా గడుపుతున్నారంటారు ప్రియ. తరాలు మారుతున్న వివాహాలకు సంబంధించి నేటి యువత ఆలోచన ధోరణి మారుతోంది. డేటింగ్, సహజీవనం.. వంటి పాశ్చాత్య పోకడల ప్రభావం మన దగ్గర పెరిగింది. వీటి మూలంగా చాలామంది విషయంలో నూరేళ్ల దాంపత్య జీవితం మూన్నాళ్ల ముచ్చటవుతోంది. అలా జరగకుండా ఈ తరం జంటలకు పెళ్లి గొప్పతనాన్ని, కమిట్మెంట్ ప్రాముఖ్యతనూ వివాహ పరిచయ వేదికలోనే ప్ర సెషన్లు ఏర్పాటుచేసి వివరిస్తున్నాం. ఇది కూడా ఈ తరంలో మేం జరిపిస్తోన్న వివాహాలు శాశ్వతమవడానికి ఓ కారణం. ఏదైతేనేం.. స్వరంగంలో నిశ్చయమైన పెళ్లిళ్లను భూమిపై జరిపించే బాధ్యతను ఆ భగవంతుడు నా చేతుల్లో పెట్టడం నా అదృష్టం..' అంటూ తరాల్ని బట్ట మారుతోన్న తమ సేవల గురించి చెబుతున్నారీ మహిళా మ్యాచ్ మేకర్.మూడు దశాబ్దాలకు పైగా తన వివాహ సేవలతో దేశంలోనే అత్యుత్తమ మ్యాచ్ మేకర్‌గా ఎదిగిన ప్రియ. ప్రపంచవ్యాప్తంగానూ పాపులారిటీ సంపాదించారు.పలు ప్రతిష్టాత్మక అవార్డులూ సొంతంచేసుకున్నారు. అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు, 'నారీ రత్న అవార్డు' వంటివెన్నో ఆమె ఖాతాలో చేరాయి. ఇక మరోవైపు 'ది మ్యారేజోస్ ఆఫ్ ఇండియా' పేరుతో ప్రత్యేక పత్రికను సైతం నడుపుతున్నారామె.

# సెలవుల్లో పిల్లలకు నైపుణ్యాలు

**వేసవి సెలవుల్లో పిల్లలంతా అల్లరే అల్లరి. ఆట, పాటలతో ఇల్లంతా సందడిగా చేస్తారు. ఆ వినోదానికి విజ్ఞానాన్నీ జోడించాలంటున్నారు నిపుణులు. ఈ సెలవుల్లో వారికి కొన్ని పాఠాలు నేర్పిద్దామిలా..**

ఈ రోజుల్లో స్వీయ రక్షణ చాలా ముఖ్యం. ఆడపిల్లలకైతే మరీనూ, ఎప్పుడు, ఎక్కడ ఎలాంటి ఘటనలు ఎదురవుతాయో తెలీక స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లిన పిల్లలు ఇంటికి వచ్చేదాకా గుమ్మం బయట కాపలా ఉండాల్సి వస్తోంది. తమని తాము రక్షించుకునే విధంగా పిల్లల్ని ఇప్పటి నుంచే తీర్చిదిద్దాలి. మంచి, చెడులకు వ్యత్యాసాన్ని చెబుతూ శారీరకంగా, మానసికంగా వాళ్లని శక్తిమంతంగా చేసే మార్షల్ ఆర్ట్స్ క్లాసుల్లో చేర్చాలి.



★ పోటీ ప్రపంచంలో తమని తాము నిరూపించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాల్సి వస్తోంది. అందుకే మీ పిల్లలకు మక్కువ ఉన్న రంగాల్లో రాణించే విధంగా అవసరమైన నైపుణ్యాలను అందించేలా ప్రయత్నించండి.

★ సెలవుల్లా కూడా తరగతులు, చదువు అంటే పిల్లలకు బోర్ కొట్టేస్తుంది. ఆటా కాకుండా మీరేం నేర్పించాలనుకున్నా ఒక టాస్క్‌లా ఇచ్చి అది పూర్తిచేసిన వారికి బహుమతులు ఇవ్వండి. వారిలో నేర్చుకోవాలనే తపన పెరుగుతుంది.

★ సమ్మర్ క్యాంపులకు పంపే ఏర్పాట్లు చేయండి. దీనివల్ల కొత్తవారిని కలవడం, మాటాడటం, మసలుకోవడం వంటివి నేర్చుకుంటారు తెలియని వాళ్లతో పిల్లల్ని ఎలా పంపుతాం. అని భయపడితే అమ్మమ్మ, నాన్నమ్మల దగ్గరకు పంపండి.

## చెలి చిట్కా

మిక్సీలో మినపప్పు గ్రైండ్ చేసేటప్పుడు ఫ్రిజ్‌లోని నీరు కొద్దిగా పోయండి పిండి బాగా పొంగుతుంది.

# పిండి వదలట్లేదా?



ఒకప్పుడు ఉత్తరాది ఆహార పుటల వాట్లలో భాగమైన రోటీ, పరాఠాలు ఇప్పుడు దక్షిణాదిన కూడా ప్రాచుర్యం పొందాయి. రోజువారీ ఆహారంలో భాగమయ్యాయి. అయితే, ఇందుకోసం పిండిని సిద్ధం చేయడం, తరవాత చేతులకు పట్టనదాన్ని వదిలించుకోవడం మాత్రం కష్టమే.

1. పిండి సరిగ్గా కలిపితేనే రోటీలు మెత్తగా వస్తాయి. ఎక్కువ సమయం తాజాగానూ ఉంటాయి. అయితే, నీళ్లతో తడపడం వల్ల.. అందులోని గ్లూటెన్ పిండిని జిగురుగా మారుస్తుంది. దీంతో అది వేళ్లకు అంటుకుని ఓ పట్టాన వదలదు. నీళ్లతో కడిగినా పూర్తిగా శుభ్రంకాదు. ఇలాంటప్పుడు కాస్త పొడి పిండిని చల్లి నలిపితే సరి.

2. చేతుల్ని నేరుగా నీళ్లతో కడగితే పిండి త్వరగా వదలకపోవచ్చు. ముందు కాస్త నూనె లేదా నెయ్యి రాసుకుని శుభ్రం చేసుకోండి. చన్నీళ్లకు బదులు గోరువెచ్చని నీళ్ల వాడితే మరీ మంచిది.

3. గోధుమ పిండి చేతులకు బాగా అతుక్కుంటే.. సెనగపిండిలో కొద్దిగా నీళ్ల పోసి కలిపిన మిశ్రమంతో రుద్దండి. వినడానికి కొత్తగా ఉన్నా.. ఇది సులువుగా వదిలిస్తుంది. ఉప్పు నీళ్ల కూడా బాగా పనిచేస్తాయి.

# మరకల్ని వదిలించే లాండ్రీ పాడ్స్



పాపాయి గౌనుపై ఇంకు, చీరపై నూనె.. ఇలా దుస్తులపై రకరకాల మరకలు పడుతుంటాయి. ఇవి మామూలు డిటర్జెంట్‌తో వదిలిపోవు. అలాగని పదే పదే ఉదికితే మృదుత్వాన్ని కోల్పోతాయి. చివరికి డ్రైవాష్‌కి ఇస్తేనే కానీ పని అవ్వదు. మీకూ ఇలాంటి పరిస్థితులు ఎదరయ్యాయా? ఇక, ఇబ్బంది అక్కర్లేదు. సులువుగా మరకల్ని వదిలించే లాండ్రీ పాడ్స్ వచ్చేశాయి. స్టెయిన్ రిమూవర్, సాఫ్ట్‌నర్‌లూ, డిటర్జెంట్ సొల్యూషన్ అన్నీ కలగలిపి తయారు చేసిన వీటిని నీళ్లల్లో వేస్తే చాలు కరిగిపోతాయి. దుస్తులూ సులువుగా శుభ్రపడతాయి. మృదుత్వాన్నీ కోల్పోవు. పెద్ద పెద్ద కంపెనీలూ ఇప్పుడీ పద్ధతిని ఫాలో అవుతున్నాయి. మంచి ఆలోచనే కదూ మరి ఈ మల్టీపర్పస్ పాడ్స్‌ని మీరూ ప్రయత్నించి చూడండి.

# గాజుని సులువుగా మెరిపిద్దాం!



ఆరోగ్య స్పృహ, అలంకరణపై శ్రద్ధ.. ఇంట్లో గాజు వస్తువుల వాడకాన్ని పెంచేశాయి. ఇవి చూడ్డానికి ఎంతందంగా ఉన్నా.. ఇవి ఎప్పటికప్పుడు శుభ్రపరచకపోతే దుమ్ము, జిడ్డు వంటి వాటి తో మరకలు పడతాయి. అలాగని శుభ్రం చేసేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. అవి పగిలిపోతాయి. అలాకాకూడదంటే ఈ చిట్కాలు పాటించండి మరి.

✪ గాజు వస్తువులను శుభ్రం చేసేటప్పుడు పీచుకి బదులు స్పాంజ్‌ని వాడాలి. దీన్ని వాడేందుకు సబ్బుకి బదులు లిక్విడ్ సోప్ ఎంచుకోవడం మంచిది. చేతులు పట్టని గాజు వస్తువుల్లోకి మెత్తటి ఫోమ్,లేదా కుచ్చుల నబ్రష్‌తో శుభ్రపరిస్తే సరి.

✪ గ్లాస్‌వేర్‌ని క్లీన్ చేయడానికి చన్నీళ్లకు బదులుగా వేడినీళ్లను వాడండి. ఇవి బ్యాక్టీరియాలను సులువుగా తొలగిస్తాయి. గ్రీజు, జిడ్డు మరకల్ని త్వరగా వదలగొడతాయి.

✪ కఠిన రసాయనాలతో కూడిన క్లీనర్లను గాజుపాత్రల్ని కడగడానికి వాడటం మంచిది కాదు. ఇవి వాటికుండే సహజమెరుపుని తగ్గిస్తాయి. బదులుగా వెనిగర్, నిమ్మ, బేకింగ్ సోడా వంటివి వినియోగించొచ్చు. ✪ గాజు పాత్రల్ని ఓసారి వేణ్నీళ్లలో శుభ్రపరిచి నిమ్మచెక్కలతో రుద్దితే దానిమీదే పేరుకున్న మురికి తొలగిపోతుంది. అంతేకాదు.. ఆహారపదార్థాలు,తేనీటి వాసనలు, మరకలు వంటివీ దూరమవుతాయి. చివరిగా టూత్ పేస్ట్‌ని ఉపయోగించీ గాజు పాత్రల్ని శుభ్రపరచుకోవచ్చు.

# "మాటే మంత్రము"

బ్రహ్మ నుండి శబ్దం ఉద్భవించింది. బ్రహ్మమే శబ్దము. అదే నాదము. మన ము రోజూ మాట్లాడే మాటల శబ్దాలు మనపైన, ప్రకృతిపైన ప్రభావం చూపు తాయి. అవే శబ్దాలు వేద మంత్రాలకు సంబంధించినవైతే మరింత గాఢమైన ప్రభావాన్ని చూపుతాయి. అశుద్ధమైన మాటలు వినడం, చెడు దృశ్యాలు చూడటం వంటివి మనసుపై చెడు ప్రభావం చూపుతాయి. ప్రియమైన మాటలు మాట్లాడితే సకల ప్రాణులూ ఆనందిస్తాయి. ఎప్పుడూ హిత, మిత, స్మిత, సత్య వచనాలే పలకాలి. వినయ పూర్వక సత్య వచనాలు పలకడం వలన బంధువులు, స్నేహితులు దగ్గర అవుతారు. అలా మాట్లాడగలిగే వారు సంఘంలో రాణిస్తారు. తైత్తిరీయారణ్యకంలో " మనో వాక్కాయ కర్మాణి శుధ్యన్తామ్ " అని చెప్పబడింది. మనస్సు, మాట, పనులను (త్రికరణములు) పరిశుద్ధంగా ఉంచుకోవాలి. ఇతరుల మనసులు గాయ పరుస్తూ, బాధించేలా మాట్లాడకూడదు. అలా చేయడం కూడా హింసే అన్నారు గాంధీజీ. మాట్లాడ కలిగే శక్తి ఉంది కదా అని దుర్భాషలాడ రాదు. చెడు మాటలు మాట్లాడుతూ వాక్శక్తిని దుర్వినియోగం చేయరాదు. అలా మాట్లాడితే ముందు నోరు, తద్వారా, మనస్సు మైల పడతాయి. కనుక చక్కగా, జనరంజకంగా మాట్లాడటం సాధనచేయాలి. " మధుర భాషణమున మర్యాద ప్రాప్తించు " అన్నారు పెద్దలు. మంచి మాట ఆభరణమే కాదు, దివ్య శక్తి కూడా! దానిని మనం మితంగా, జాగ్రత్తగా వినియోగించాలి. రఘువంశపు రాజు లందరూ "సత్యాయ మిత భాషిణాం" అని కాళిదాస మహాకవి అన్నారు. అం టే సత్య సంరక్షణార్థం ఆ రాజులు మిత భాషిత్వాన్ని పాటించారని అర్థం. అనాయాసంగా అబద్ధాలు, బూతులు మాట్లాడుతూ ఉండే స్త్రీ పురుషులు మానసికంగా వైఫల్యం చెందుతారు.

-గొల్లాపిన్ని సీతారామ శాస్త్రి

ఆధ్యాత్మికం

# తోతాపురి మామిడి పచ్చడి



**కావాల్సినవి :** తోతాపురి పచ్చి మామిడికాయ-ఒకటి, అల్లం-చిన్నముక్క, పచ్చిమిర్చి-నాలుగు, నువ్వులు-రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు-తగినంత, తాలింపు కోసం, జీలకర్ర, ఆవాలు-అర టీస్పూన్ చొప్పున, ఎండుమిర్చి- ఒకటి.

**తయారీ :** మామిడికాయ చెక్కు తీపి చిన్న ముక్కలుగా కోసుకుని పక్కన పెట్టుకోవాలి. అల్లం ముక్కను శుభ్రంగా కడిగి తురమాలి. కడాయిలో నూనె వేడిచేసి పచ్చిమిర్చి, అల్లం తురుము వేసి వేయించాలి. తర్వాత మామిడిముక్కలు, ఉప్పు వేసి మరికాసేపు వేయించాలి. మామిడి ముక్కలు మెత్తగా అయ్యేంతవరకు ఉడికించి చల్లార్చాలి. నువ్వులను నూనె లేకుండా వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఉడికించిన మామిడిముక్కలు, అల్లం తురుములో నువ్వులు వేసి మిక్సీ జార్‌లో మెత్తగా పేస్టు చేయాలి. కడాయిలో నూనె వేడిచేసి ఆవాలు, జీలకర్ర ఎండుమిర్చి వేసి తాలింపు పెట్టాలి. ఇది అన్నంలోకే కాకుండా చపాతీల్లోకి బాగుంటుంది.

# తినేముందు నీళ్లలో నానబెట్టాలి!

**మామిడి పండ్లను చూస్తే క్షణమైనా ఆగలేం.. వాటి రుచిని ఆస్వాదించే దాకా మనసు మనసులో ఉండదు. అయితే ఆ ఆతృతే**



**వద్దంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ పండ్లను తినే ముందు కాసేపు నీళ్లలో నానబెట్టడం వల్ల ఆరోగ్యపరంగా బోలెడు ప్రయోజనాలు చేకూరతాయని చెబుతున్నారు. మరి, అవేంటో తెలుసుకుందాం..**

ఎంతసేపు నానబెట్టాలి ?

.. 'ఎ', 'సి', 'ఇ', 'కె', 'బి', విటమిన్లతో పాటు ఫోలేట్.. వంటి పోషకాలు మిళితమై ఉన్న మామిడి పండ్లు రుచిలోనేకాదు ఆరోగ్యాన్ని అందించడంలోనూ మిన్నే ! ముఖ్యంగా చర్మం, జుట్టు సంరక్షణ విషయాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు నిపుణులు. అయితే ఈ ప్రయోజనాలన్నీ చూకూరాలంటే తినే ముందు వాటిని 1-2 గంటల పాటు నీటిలో నానబెట్టడం మంచిదంటున్నారు. ఒకవేళ వెంటనే తినాలనుకునే వారు కనీసం పావుగంట పాటైనా నీటిలో నానబెట్టాలట!

**చలువ చేస్తుంది ! ...** వేసవిలో తప్ప ఇతర సీజన్లలో దొరకవని కొందమంది అమితంగా వీటిని లాగించేస్తుంటారు. దీనివల్ల శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తవుతుంది. ఫలితంగా జీర్ణ సంబంధిత సమస్యలు, ముఖంపై మొటిమలు.. వంటివి తలెత్తుతాయి. ఈ సమస్యలను దూరంగా ఉండాలంటే తినే ముందు మామిడి పండ్లను నీళ్లలో నానబెట్టాలి. తద్వారా పండ్ల నుంచి శరీరంలో వేడి ఉత్పత్తి చేసే గుణాలు తొలగిపోతాయంటున్నారు నిపుణులు.

**రసాయనాలు తొలగాలంటే...**

మామిడి పండ్లు త్వరగా పండడానికి వివిధ రకాల రసాయనాలు ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. ఇలా వాడిని రసాయనాలు పండు తొక్కపై చేరతాయి. అది గమనించకుండా వాటిని ఆదరాబాదరాగా శుభ్రం చేసుకొని తీసుకుంటే.. ఆరోగ్యానికే ప్రమాదం! తద్వారా వివిధ ఆరోగ్య సమస్యలొస్తాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలంటే తినే ముందు మామిడి పండ్లను నీటిలో నానబెట్టడమొక్కటే మార్గం! తద్వారా పండు తొక్కకు అంటుకున్న రసాయనాలు తొలగిపోతాయి.

**బరువూ తగ్గచ్చు!...** మామిడి పండ్లలో ఉండే ఫైటోకెమికల్స్, బయోయాక్టివ్ సమ్మేళనాలు కొవ్వు కణాలు కొవ్వు సంబంధిత జన్యువులపై ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలో మామిడి పండ్లను నీటిలో నానబెట్టడం వల్ల ఈ సమ్మేళనాల గాఢత తగ్గి, శరీరానికి హానికరమైన కొవ్వుని కరిగించడంలో తోడ్పడుతాయి. తద్వారా బరువూ అదుపులో ఉంచుకోవచ్చు.



ఆరోగ్యాన్నీ కాపాడుకోవచ్చు. అయితే బరువు తగ్గాలంటే మాత్రం పండ్లను షేక్స్, స్మూతీస్ రూపంలో కాకుండా నేరుగా తినడమే మంచిదంటున్నారు నిపుణులు.

## జర్మనీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో..

# విజేతగా ఇంగ్లండ్ స్టార్ హ్యారీ

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక జర్మనీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ లీగ్ బుండెస్ లీగ్‌లో హ్యారీ కేన్ తన స్వప్నాన్ని సాకారం చేసుకున్నాడు. 2024-25 బుండెస్ లీగ్ సీజన్‌లో బాయెర్న్ మ్యూనిక్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టును విజేతగా నిలబెట్టాడు. ఏకంగా ఆరుసార్లు కెరీర్‌లో మేజర్ ట్రోఫీలు సాధించే అవకాశాన్ని తృటిలో కోల్పోయిన హ్యారీ ఏడో ప్రయ త్నంలో విజయవం తమయ్యాడు. ఈ క్రమంలో తన కెరీర్ లో లోటుగా ఉన్న మేజర్ ట్రోఫీని అందుకున్నాడు. బెర్లిన్‌లో సోమవారం బొరుసియా మొంచెన్‌గ్లాడ్‌బాచ్ క్లబ్‌తో జరిగిన 33వ లీగ్ మ్యాచ్‌లో మాన్యుయేల్ నెయుర్ సారథ్యంలోని బాయెర్న్ మ్యూనిక్ జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలిచింది. తద్వారా ఈ సీజన్‌లో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే బాయెర్న్ మ్యానిక్ జట్టు రికార్డ్ స్థాయిలో 33వ సారి బుండెస్ లీగ్ టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. మ్యూనిక్ జట్టుకు హ్యారీ కేన్ 31వ నిముషంలో, మైకేల్ ఒలిస్ 90వ నిముషంలో ఒక్కో గోల్ అందించారు. ఈ సీజనులో 30 మ్యాచ్‌లు ఆడిన హ్యారీ కేన్ 25 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కాగా సీజన్‌లోని నామమాత్రపు చివరి మ్యాచ్ ఈ నెల 17న హాఫెన్‌హీమ్ జట్టుతో బాయెర్న్ మ్యానిక్ టీం తలపడుతుంది.



ఇక మొత్తం 18 జట్లు ఇంటా, బయట పద్ధతిలో బుండెస్ లీగ్‌లో పోటీపడుతున్నాయి. ఒక్కో జట్టు 34 మ్యాచ్‌లు ఆడుతుంది. 33 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న బాయెర్న్ మ్యానిక్‌జట్టు 24 విజయాలు సాధించింది. 7 మ్యాచ్‌లను డ్రా చేసుకుని, 2 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 95గోల్స్ సాధించి, 32 గోల్స్‌ను సమర్పించుకుంది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 79 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను ఖరారు చేసుకుంది.

## ఆసియా బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో..

# భారత్‌కు తృటిలో చేజారిన పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా వ్యక్తిగత చెస్ ఛాంపియన్‌షిప్ బ్లిట్జ్ విభాగంలో భారత్‌కు తృటిలో రెండు కాంస్య పతకాలు చేజారాయి. పురుషుల విభాగంలో తమిళనాడు గ్రాండ్ మాస్టర్ మరళీ కార్తికేయన్, మహిళల విభాగంలో ఒడిశా అమ్మాయి పద్మిని రౌత్ నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకాలను కోల్పోయారు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత కార్తికేయన్ ఏడు పాయింట్లతో మరో ముగ్గరితో కలిసి ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచాడు. దాంతో మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. రష్యాకు చెందిన రుడిక్ మకారియన్ మూడో స్థానంతో పాటు, కాంస్య పతకం ఖరారైంది. కార్తికేయన్‌కు నాలుగో స్థానం, భారత్‌కు చెందిన మరో ప్లేయర్ నీలాశ్ సాహాకు ఐదో స్థానం, చైనాకు చెందిన జియాంగ్ హావోచెన్‌కు ఆరో స్థానం లభించాయి. పురుషుల విభాగంలో మొత్తం 111 మంది ప్లేయర్లు పోటీపడగా, 8 పాయింట్లతో రష్యాకు చెందిన 15 ఏళ్ల ఇవాన్ జెమ్లియాన్‌స్కి విజేతగా అవతరించాడు. ఇరాన్‌కు చెందిన 15 ఏళ్ల సినా మొవాహెద్ 7.5 పాయింట్లతో రజతాన్ని దక్కించుకున్నాడు. ఇక మహిళల విభాగంలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత పద్మిని రౌత్, చైనాకు చెందిన యుజిన్ సాంగ్, కజకిస్తాన్‌కు చెందిన ఎల్నాజ్ కలియాక్‌మెత్ ఏడు పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. దాంతో మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా కాంస్య పతకాన్ని ఖరారు చేయగా, అది యుజిన్ సాంగ్‌కు లభించింది. పద్మిని నాలుగో స్థానంలో, ఎల్నాజ్ ఐదో స్థానంలో నిలిచారు. 7.5 పాయింట్లతో కజికిస్తాకు చెందిన అలువా నుర్మాన్, రష్యాకు చెందని వాలెంటీనా గునీనా సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌లను వర్గీకరించగా, నుర్మాన్‌కు స్వర్ణం, గునీనాకు రజతం లభించాయి.



# టెస్టులకు గుడ్ బై

## రోహిత్ బాటలోనే విరాట్

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా స్టార్‌బ్యాటర్ విరాట్‌కోహ్లీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇంగ్లండ్ టూర్‌కు ముందు టెస్టులకు కింగ్ కోహ్లీ రిటైర్మెంట్‌తో షాక్ ఇచ్చాడు. రోహిత్ శర్మ బాటలోనే టెస్టు క్రికెట్ నుంచి రిటైరవుతున్నట్లు ప్రకటించాడు స్టార్ క్రికెటర్ కోహ్లీ. ఈమేరకు ఇన్‌స్టాలో సోమవారం సుదీర్ఘ ఎమోషనల్ పోస్ట్ చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో భారతదేశం తరపున అత్య ధిక పరుగులు చేసిన నాల్గవ ఆటగాడిగా కోహ్లీ రిటైర్ అయ్యాడు. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవి డ్, సునీల్ గవాస్కర్ తర్వాత టెస్టుల్లో అత్యధిక పరు గులు చేసింది కోహ్లీనే. ఇంగ్లాండ్ పర్యటనకు తన ను ఎంపిక చేయొద్ద ని భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)కి ముందుగానే సమాచారమిచ్చిన కోహ్లీ తాజాగా తన రిటైర్మెంట్‌ను అధికారికంగా ప్రకటించాడు. ఈ సమయంలో రిటైర్మెంట్ వద్దని బీసీసీఐ వారించినప్పటికీ కోహ్లీ వాటిని పట్టించుకోలేదు. 2011లో భారతదేశం వన్డే ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగమైన రెండు నెలల తర్వాత, అతను జమైకాలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో తన టెస్ట్ అరంగేట్రం చేశాడు. ఇక 2025 జనవరిలో సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన నూతన సంవత్సర టెస్ట్ సందర్భంగా అతను ఈ ఫార్మాట్‌లో చివరిసారిగా కనిపించాడు. 123 టెస్టుల్లో కోహ్లీ 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించాడు. వాటిలో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యధిక స్కోరు - 254 నాటౌట్. 2019లో దక్షిణాఫ్రికాతో పుణెలోని మహారాష్ట్ర క్రికెట్‌అసోసియేషన్ స్టేడియంలోజరిగిన మ్యాచ్‌లో ఈ అత్యుత్తమ ప్రదర్శనచేశాడు. 14 ఏళ్ల టెస్టు కెరీర్ తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నాడు.

**'ప్రేమతో సైనింగ్ ఆఫ్'**

టెస్ట్ క్రికెట్‌లో నేను తొలిసారి బ్యాగీ బ్లూ దుస్తులు ధరించి 14ఏళ్లు అయింది. నిజాయితీగా చెప్పాలంటే, ఈ ఫార్మాట్ నన్ను ఈ ప్రయాణంలో తీసుకెళ్తుందని నేను ఎప్పుడూ ఊహించలేదు. ఇది నన్ను పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితాంతం నేను పాటించాల్సిన పాఠాలు నేర్పింది. తెల్లని దుస్తుల్లో ఆడటంలో ఏదో లోతైన విషయం దాగుంది. నిశ్శబ్దమైన ఆనందం, సుదీర్ఘమైన రోజులు, ఎవరికీ కన్పించని చిన్న చిన్న క్షణాలు నాతో ఎప్పటికీ ఉండిపోతాయి. అలాంటి ఈ ఫార్మాట్ నుంచి దూరం జరగడం అంత తేలిక అయిన విషయం కాదు. కానీ, నా నిర్ణయం సరైనదే అనిపిస్తోంది. ఈ ఫార్మాట్ కోసం నేను ఎంతో ఇచ్చాను. ఆశించిన దాని కంటే ఎక్కువే ఇది నాకు తిరిగిచ్చింది. మనసు నిండా సంతృప్తితో, కృతజ్ఞతాభావంతో ఈ ఫార్మాట్ నుంచి వైదొలుగుతున్నా. ఈ గేమ్ నేను మైదానంలో ఆడిన నా తోటి ప్లేయర్లు, ఈ ప్రయాణాన్ని నేను చూడటానికి కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రేమతో ఇక 269, సైనింగ్ ఆఫ్" అని కోహ్లీ తన పోస్టులో రాసుకొచ్చాడు.

# ఐపిఎల్ హిస్టరీలో చెత్త రికార్డ్స్

## ముందే నిష్క్రమించిన నాలుగు జట్లు.. జాబితాలో చెన్నై, ముంబయి, బెంగళూరు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. 12 మ్యాచ్‌ల్లో ఏకంగా 9 ఓడి, 3 మ్యాచ్‌ల్లో నెగ్గి 6 పాయింట్లతో పట్టికలో అట్టడుగున నిలిచింది. ఫలితంగా సీజన్ 18నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా చెత్త రికార్డ్ మూటుగట్టుకుంది. అయితే టోర్నీ నుంచి అందరికంటే ముందే నిష్క్రమించడం చెన్నైకు ఇది రెండోసారి. 2020లో తొలిసారి ఈ చెత్త రికార్డ్ నమోదు చేసింది. మరి ఇప్పటి వరకు ఐపీఎల్ హిస్టరీలో టోర్నీ నుంచి తొలుత పలు జట్టు నిష్క్రమించాయి. దక్కన్ ఛార్జర్స్ 2008 నుంచి 2012 సీజన్‌లలో ఐపీఎల్‌లో పాల్గొంది. ఇందులో 2008, 2011, 2012లో మొదటగానే ఎలిమినేట్ అయ్యింది. పుణె వారియర్స్ ఇండియా కేవలం మూడు సీజన్లలో 2011, 2012, 2013 లోనే ఆడింది. ప్రతి సీజన్‌లోనూ లీగ్ స్టేజీలోనే తొలి సారిగా వైదొలిగిన టీమ్‌ల జాబితాలో చోటు సంపాదించుకుంది. ఇక దిల్లీ క్యాపిటల్స్ ఒక్కసారి కూడా టైటిల్ గెలుచుకోలేదు. కానీ చరిత్రలో మూడుసార్లు తొలుత నిష్క్రమించిన జట్టుగా నిలిచింది. 2014లో 14 మ్యాచ్‌ల్లో కేవలం రెండే నెగ్గి లీగ్ టేబుల్‌లో అట్టడుగున నిలిచి అందరి కంటే మొదటగా నిష్క్రమించింది. 2018లో 5 మ్యాచ్‌ల్లో, 2023లో కూడా 5 మ్యాచ్ ల్లోనే గెలిచి ఇంటిబాట పట్టింది. పంజాబ్ కింగ్స్ ఇప్పటివరకూ రెండుసార్లు టోర్నీ నుంచి తొలుత నిష్క్రమించింది. 2010లో ఆడిన 14మ్యాచ్‌లలో నాలుగు మాత్రమే నెగ్గి పదింట్లో నిరాశపరిచింది. లీగ్ టేబుల్‌లో చివరి స్థానంలో నిలిచి టోర్నీ నుంచి ఇంటిబాట పట్టింది. 2015లో 14 మ్యాచ్‌లకు కేవలం 3 మ్యాచ్‌లలో విజయం సాధించి పాయింట్స్ టేబుల్‌లో చివరి స్థానంలో నిలిచి మొదటగా వైదొలిగింది. అలాగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒక్కసారి కూడా టైటిల్ గెలవకపోవడం గమనార్హం. ఆర్సీబీ ఇప్పటివరకూ రెండు సార్లు లీగ్ నుంచి తొలుత వైదొలిగింది. 2017లో ఆడిన 14 మ్యాచ్‌లలో 3 మాత్రమే నెగ్గి పదింట్లో ఓడి ఒక మ్యాచ్ టై చేసుకుని ఇంటిబాట పట్టింది. 2019లో 5 మ్యాచ్ లలో గెలిచి 8 మ్యాచ్ లలో నిరాశపరిచి మొదటగా నిష్క్రమించింది. ముంబయి ఇండియన్స్ ఇప్పటి వరకూ 2013, 2015, 2017, 2019, 2020లో టైటిల్ కైవసం చేసుకుంది. అయితే రెండుసార్లు లీగ్ నుంచి మొదటగా ఎలిమినేట్ అయ్యింది. 2022లో ఆడిన 14 మ్యాచ్‌లలో నాలుగింట్లో మాత్రమే విజయం సాధించింది. 2024 లోనూ నాలుగే నెగ్గి 10 మ్యాచ్‌లలో ఓటమి చెంది లీగ్ నుంచి తొలుతగా బయటకు వచ్చింది. కోల్‌కతా నైట్ రైడర్స్ 3సార్లు (2012, 2014, 2024) టైటిల్ గెలుచుకుంది. ఒక్కసారి మాత్రమే లీగ్‌లో తొలుతగా వైదొలిగింది. 2009లో టీమ్ ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం మూడునెగ్గి, 10 ఓటమిపాలై మొదటగా నిష్క్రమించింది. కాగా 2013లో సన్ రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చింది. వచ్చిన మూడేళ్లకే 2016లో ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో రాణించలేదు. 2021 ఐపీఎల్ సీజన్‌లో 14మ్యాచ్‌లలో 3 మాత్రమే నెగ్గి 11 విఫలమైంది. దీంతో లీగ్ నుంచి నిష్క్రమించిన తొలి టీమ్‌గా నిలిచింది.



## మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో.. భారత్ షూటర్స్ చెనాయ్,

# సబీర కంచుమోత

**న్యూఢిల్లీ:** ఐఎస్‌ఎస్‌ఎఫ్ షాట్‌గన్ వరల్డ్ కప్-2025లో భారత షూటర్లు సత్తా చాటారు. కినన్ చెనాయ్, సబీరా హ్యారిస్‌లు పతకంతో మెరిశారు. నికోసియా వేదికగా జరుగుతున్న మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అదరగొట్టి కంచు మోతో మోగించారు. మూడో స్థానం కోసం తుర్కియే షూటర్లతో పోటీ పడిన ఈ జోడీ అద్భుత ప్రదర్శనతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 34వ స్థానంలో నిలిచిన భారత ద్వయం అసమాన ప్రతిభాపాటవాలతో పతకం కొల్లగొట్టడం విశేషం. ఐఎస్‌ఎస్‌ఎఫ్ షాట్‌గన్ వరల్డ్ కప్ మిక్స్‌డ్ పోటీల క్వాలిఫికేషన్‌లో నిరాశపరిచిన కినన్, సబీరలు ఆ తర్వాత పుంజుకున్నారు. టీమ్ విభాగంలో 142 పాయింట్లు సాధించి 34వ స్థానం సాధించారు. మూడో స్థానం కోసం తుర్కియే ద్వయం తొల్గా టన్సర్, పెలిన్ కయాపై 34-33తో విజయం సాధించారు. అగ్రస్థానంలో నిలిచిన చైనా బంగారు పతకం గెలవగా, పొలాండ్ షూటర్లు సిల్వర్ సాధించారు. భారత్‌కు చెందిన శార్దూల్ విమాన్, కిర్తీ గుప్తాలు 137 పాయింట్లతో 17వ స్థానంలో నిలిచారు.

# అప్పుల్లో తమిళనాడు టాప్..

**న్యూఢిల్లీ, మే 12:** దేశంలోని రాష్ట్రాల్లో ఏటికేడు అప్పులు పెరుగుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు భవిష్యత్తులో తమకు ఉపయోగపడేలా స్థానికంగా మౌలిక సదుపాయాల కల్పనకు అప్పులను వాడుతున్నాయి. ఇంకొన్ని రాష్ట్రాల్లో వేతనాలు, పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు వంటి వాటికోసం వీటిని వినియోగిస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉందని ఇటీవల ఆర్‌బిఐ నివేదిక తెలిపింది. మధ్య మొత్తం తమిళనాడు రుణాలు రూ.1.01 లక్షల కోట్లకు చేరుకున్నాయి. బలమైన ఆర్థిక వ్యూహం, వృద్ధి ఆధారిత పెట్టుబడుల పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తూ తమిళనాడు రాష్ట్రం పెట్టుబడులను సమీకరిస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. గత కొన్నేళ్లుగా అప్పుల్లో తమిళనాడు నిలకడగా ముందంజలో ఉంది. సంవత్సరాలవారీగా అప్పులు వివరాలు ఇలా ఉన్నాయి. 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.87,977 కోట్లు, 2022, 2023 ఆర్థిక సంవత్సరాల్లో రూ.87వేల కోట్లు, 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.1.13 లక్షల కోట్లు, 2025 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 2024 నుంచి 2025



ఫిబ్రవరి వరకు రూ.1.01 లక్షల కోట్లు. తమిళనాడు తర్వాత 2025 ఆర్థిక సంవత్సరంలో మహారాష్ట్ర రూ.99వేల కోట్ల అప్పుతో రెండో స్థానంలో నిలిచింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2026 ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయంలో 22శాతం పెరుగుదలను రాష్ట్రం బడ్జెట్లో ప్రతిపాదించింది. ఇది మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థికవృద్ధికి బలమైన నిబద్ధతను సూచిస్తుంది. 15వ ఆర్థిక సంఘం నిర్దేశించిన 28.7శాతంలోపు దాని డెట్-జీఎస్‌డిపి నిష్పత్తి 26.43శాతంగా ఉంది. ఇది ఆర్థిక స్థిరత్వం, సుస్థిరతను నిర్ధారిస్తుంది.

# రూ.16 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

**ముంబై, మే 12:** భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఖరారైన నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు దూసుకెళ్లాయి. అమెరికా చైనా వాణిజ్య చర్చలు, రష్యా ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ చర్చల్లో పురోగతి వంటి అంతర్జాతీయ అంశాలు ఇందుకు తోడయ్యాయి. దీంతో మన సూచీలు ఆకాశమే హద్దుగా పైకెగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 3 వేలకు పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 25 వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. 2024 డిసెంబర్ 16 తర్వాత బెంచ్ మార్క్ సూచీలు ఈ స్థాయిని అందుకోవడం ఇదే తొలిసారి. ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.16 లక్షల కోట్ల మేర పెరిగి రూ.432 లక్షల కోట్లకు చేరింది. భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లారిన వేళ సెన్సెక్స్ ఆరంభంలోనే 80,803.80 పాయింట్ల వద్ద భారీ లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే దూకుడు కొనసాగించింది. ఇంట్రాడేలో 3 వేల పాయింట్లకు పైగా లాభంతో 82,495.97 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2975.43 పాయింట్ల లాభంతో 82,429.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 916.70 పాయింట్ల లాభంతో 24,924.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువగా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంక్ మినహా మిగిలిన షేర్లు లాభాలు చవి చూశాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, ఎటర్నల్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65 డాలర్లు, బంగారం ఔన్సు 3222 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే ముగిశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 6.70 శాతం మేర లాభపడింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కరోజులో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు కూడా 4 శాతం మేర రాణించాయి.





# భారత్ వృద్ధి 6.5శాతం: సిఐఐ

**న్యూఢిల్లీ, మే 12:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడిపి 6.5శాతం వృద్ధి చెందుతుందని పరిశ్రమల సంఘం సిఐఐ అంచనా వేసింది. భౌగోళిక రాజకీయ సమస్యల వల్ల కొంత ప్రభావం ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధిని కొనసాగగలదని కూడా సిఐఐ అధ్యక్షుడు సంజీవ్ పురి అన్నారు. పెరుగుతున్న వాణిజ్య సవాళ్ల నేపథ్యంలో జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవ డానికి దేశం కీలక వాణిజ్య భాగస్వాములతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను కొనసాగించాలని ఆయన ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు పెట్టుబడులకు కొంత అవరోధం ఏర్పడవచ్చు. ఇది స్వల్పకాలమే, ఆ తర్వాత పరిస్థితులు సాధారణంగా మారతాయని సంజీవ్ పూరి వివరించారు. ఈ కారణంగా దేశ ఆర్థిక వృద్ధి అంచనాను 6.5శాతంగా భావిస్తున్నామని చెప్పారు. ఇటీవల ఆర్‌బిఐ వడ్డీరేట్లు తగ్గించింది. ద్రవ్యోల్బణం క్రమంగా దిగివస్తోంది. తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితి పెంచింది. దీని వల్ల వినియోగం గణనీయంగా పెరుగుతుంది. దీనికి తోడు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

ఇంధనం, రవాణా, లోహాలు, రసాయనాలు, ఆతిథ్యం వంటి రంగాలలో ప్రైవేట్ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ప్రస్తుత

# ప్రీమియం స్కూటర్లపై టివిఎస్ ఫోకస్!

**ముంబై, మే 12:** దేశీయ స్కూటర్ల మార్కెట్ అంతకంతకూ విస్తరిస్తోంది. ప్రస్తుతానికి 110, 125 సీసీ సెగ్మెంట్‌దే హవా. ఇందులో హోండా యాక్టివా, టీవీఎస్ జుపిటర్, సుజుకీ యాక్సెస్ వంటివి సత్తా చాటుతున్నాయి. తనదైన స్పోర్టీ లుక్‌తో టీవీఎస్‌కు చెందిన ఎన్‌టార్క్ కూడా కుర్రకారును ఆకట్టుకుంటోంది. మరోవైపు ప్రీమియం, పెర్ఫార్మెన్స్ స్కూటర్లకు ఆదరణ పెరుగుతోంది. దీనిపై టీవీఎస్ దృష్టి పెట్టింది. ఎన్‌టార్క్ రూపంలో 150 సీసీ సెగ్మెంట్‌లోకి ప్రవేశించాలని చూస్తోంది. ప్రస్తుతం ప్రీమియం స్కూటర్ల సెగ్మెంట్‌లో యమహా ఏరోక్స్ 155, హీరో మోటోకార్ప్ జూమ్ 160, ఆప్రిలియా 160 సీసీ మోడళ్లు అందుబాటులో ఉన్నాయి.



యమహా మొత్తం సేల్స్‌లో ఏరోక్స్ 155వాటా 45 శాతం మాత్రమే. హీరో మోటోకార్ప్ మొత్తం అమ్మకాల్లో జూమ్ వాటా కూడా అంతంత మాత్రమే. కానీ, కుర్రకారు అంచనాలు పెరుగుతున్నాయి. తదనుగుణంగా ప్రీమియం స్కూటర్లకు డిమాండ్ పెరగబోతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీవీఎస్ కూడా ఎన్‌టార్క్‌ను 150 సీసీలో తీసుకొచ్చేందుకు సన్నద్ధం అవుతోంది.

# 32 విమానాశ్రయాలు ఓపెన్

**న్యూఢిల్లీ, మే 12:** భారత్‌పాక్ నడుమ ఉద్రిక్తతల నేపథ్యంలో ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను మే 15 వరకు మూసివేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తొలగిపోవడంతో విమానాశ్రయాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. తొలుత ఈనెల 15 వరకు వాటిని మూసి వేయాలని భావించినప్పటికీ పరిస్థితులు మెరుగుపడటంతో వాటిని తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. పౌర విమానయాన కార్యకలాపాలు వెంటనే అందుబాటులోకి వస్తాయని.. ఈ విషయాన్ని దృష్టిలోఉంచుకొని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విమానాల సేవలు, వివరాలకు సంబంధించిన ఇతర విషయాలు తెలుసుకోవడానికి ప్రయాణికులు ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్‌లను పర్యవేక్షించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సూచించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ పాక్‌లోని వివిధ ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు చేయడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో సరిహద్దులకు దగ్గరగా ఉన్న దాడులు జరిగేందుకు అవకాశమున్న చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, లూథియానా, భుంటార్, కిషన్‌గఢ్, పటియాలా, శిమ్లా, ధర్మశాల, భఠిండా, జైసల్మేర్, జోధ్‌పుర్, లేహ్, బికనేర్, పఠాన్‌కోట్, జమ్మూ, జామ్‌నగర్, రాజ్‌కోట్, భుజ్ తదితర విమానాశ్రయాలను మూసివేస్తున్నట్లు పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. ఇటీవల ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడంతో సరిహద్దు ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో ఈ సేవలను తిరిగి పునరుద్ధరించింది.



# వాణిజ్యం

## టారిఫ్ వార్‌కు విరామం..

**వాషింగ్టన్, మే 12:** పరస్పర ప్రతీకార సుంకాల ప్రకటనలతో ప్రపంచ దేశాలకు, స్టాక్ మార్కెట్లకు కంటిమీద కునుకులేకుండా చేసిన అమెరికా, చైనా ఓ అవగాహనకు వచ్చాయి. పోటాపోటీగా విధించుకున్న టారిఫ్‌లను తాత్కాలికంగా తగ్గించేందుకు నిర్ణయించాయి. ఇరుదేశాలు 90 రోజుల పాటు తమ టారిఫ్‌లను 115 శాతం మేర తగ్గించుకుంటాయని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన వాణిజ్య చర్చల్లో భాగంగా ఈ నిర్ణయం వెలువడింది. వివిధ భాగస్వామ్య దేశాలపై ప్రతీకార సుంకాల్లో భాగంగా అమెరికా అధ్య



క్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై భారీగా టారిఫ్‌లు విధించారు. ప్రతిగా ఆ దేశం కూడా టారిఫ్ వార్‌కు దిగింది. దీంతో ట్రంప్ చైనా ఉత్పత్తులపై అమెరికా తన టారిఫ్‌లను 145 శాతానికి పెంచగా.. చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం సుంకాలు విధించింది. దీంతో ప్రపంచ దేశాల స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. ఆర్థిక మాంద్యం భయాలు తలెత్తాయి. ఈ క్రమంలో అమెరికా, చైనా ప్రతినిధులు స్విట్జర్లాండ్ వేదికగా జరిపిన వాణిజ్య చర్చల్లో టారిఫ్‌లను తాత్కాలికంగా వాయిదా వేసేందుకు నిర్ణయించారు. ఇందులోభాగంగా అమెరికా దిగుమతులపై చైనా తన సుంకాలను 115 శాతం అంటే 125 శాతం నుంచి 10 శాతానికి తగ్గించనుంది. మరోవైపు చైనా దిగుమతులపై అమెరికా తన సుంకాలను 145 శాతం నుంచి 30 శాతానికి తగ్గిస్తుంది. 90 రోజుల పాటు ఈ టారిఫ్‌లు అమల్లో ఉండేలా ఇరుదేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.